
ముంబై: సోమవారం జరిగిన హోమీ బాబా వర్శిటీ కాన్వొకేషన్‌లో పాల్గొన్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి: 61 • సంచిక: 13 • మంగళవారం 23 జనవరి 2018 • విజయవాడ ✻ పేజీలు: 14 • వెల: 5.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘమాసం, తిథి: శుద్ధ షష్ఠి మ. 12.35 వరకు, అనంతరం సప్తమి; నక్షత్రం: రేవతి తె. 5.00 వరకు, అనంతరం అశ్వని; అమృతకాలం: రా. 2.35 నుండి 4.10 వరకు; వర్జ్యం: సా. 5.00 నుండి 6.36 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.24 నుండి 9.12 వరకు, తదుపరి రా. 10.48 నుండి 11.36 వరకు; రాహుకాలం: మ. 3.00 నుండి 4.30 వరకు; యమగండం: ఉ. 9.00 నుండి 10.30 వరకు;

ప్రత్యేక హోదా ఇస్తే
బీజేపీతో దోస్తీకి సై

- వైఎస్ జగన్ స్పష్టీకరణ
- చంద్రబాబు అబద్ధాల రారాజు
- ప్రాజెక్టులు నిర్మించే సత్తా లేదు
- అమరావతి ఓ పెద్ద భూస్కామ్
- యువతకు చేసిందేమీ లేదు
- ఆయనకంటే మూగ సీఎం బెటర్
- నాపై కేసులు కుట్రతో మోపినవే



తిరుపతి, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదాను కేంద్రం ప్రకటిస్తే తాను బీజేపీతో జతకట్టడానికి సిద్ధమని వైఎస్సార్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రకటించారు. ప్రజా సంకల్ప యాత్రలో పాదయాత్ర చేస్తున్న జగన్‌మోహన్ రెడ్డి ఒక జాతీయ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, పై విషయాన్ని స్పష్టం చేశారు. ప్రధాని తలచుకుంటే ప్రత్యేక హోదాను ఒకే ఒక నిమిషంలో ఇవ్వగలరు... ఇది ఆయన చేతుల్లోని పనేనన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలకు ఏమాత్రం బలం లేదని, మా ప్రధాన ప్రత్యర్థి తెలుగుదేశమేనన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాను ప్రకటిస్తే బీజేపీతో కలిసి ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమని ఆయన స్పష్టం చేశారు. జగన్ మోహన్‌రెడ్డి ఇప్పటికే రాయలసీమ ప్రాంతంలో 900 కిలోమీటర్ల పాదయాత్రను పూర్తి చేశారు. శ్రీకాళహస్తి దేవాలయం సమీపంలో బహిరంగ సభ అనంతరం ఆయన ఒక జాతీయ చానెల్‌తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఎండ, దుమ్ము రహదారులలో సుదీర్ఘ పాదయత్ర చేస్తున్నప్పటికీ ఆయనలో ఏమాత్రం అలసట ఛాయలు లేవు సరికదా జనం నుంచి లభిస్తున్న స్పందనతో మరింత ఉత్సాహంగా కనిపిస్తున్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన అబద్ధాల రారాజుగా అభివర్ణించారు. అమరావతి నిర్మాణం గురించి చంద్రబాబు నాయుడు ప్రపంచవ్యాప్తంగా గొప్పలు చెబుతున్నారని, ఇప్పుడు దావోస్ వెళ్లి గ్లోబల్ పెట్టుబడిదారులను ఫూల్స్‌ని చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎవరైనాసరే ఒక్కసారి అమరావతికి వెళ్లి పరికించి చూడాలని, గత నాలుగేళ్లుగా అక్కడ పిసరంత అభివృద్ధి కూడా జరగలేదన్నారు. అక్కడో పెద్ద నగరం నిర్మిస్తున్నట్టు చెబుతున్నారు కాని, అదో అతిపెద్ద భూకబ్జా కుంభకోణమని అన్నారు. అంత పెద్ద ప్రాజెక్టును నిర్మించే విజన్ కాని, నిబద్ధత కాని

➪ 7వ పేజీలో...



పెట్టుబడులు పెట్టండి
నాదీ భరోసా!

- ప్రణాళికతో రండి.. అనుమతులిస్తా
- కుప్పంలో చిన్న ఎయిర్‌పోర్టు
- సరకు రవాణాకు అనుకూలం
- పయొనీరింగ్ సంస్థతో సమావేశం
- దావోస్ పర్యటనలో చంద్రబాబు
- రూ.5వేల కోట్లతో ప్రణాళిక
- బాబుతో చైర్మన్ రోస్‌పాల్
- జ్యూరిచ్‌తో సిస్టర్ స్టేట్ ఒప్పందం

అమరావతి, ఆంధ్రప్రభ: వర్షపాతం తక్కువ వున్నప్పటికీ టెక్నాలజీ వినియోగం ఫలితంగా వ్యవసాయ రంగంలో రెండంకెల అభివృద్ధిని నమోదు చేశామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మెగా పెట్టుబడులకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తున్నామన్నారు. దావోస్ పర్యటనలో భాగంగా మొదటి రోజు ముఖ్యమంత్రి బృందం జూవిచ్‌లో పయొనీరింగ్ వెంచర్స్ చైర్మన్‌తో చర్చించింది. రాష్ట్రంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టాలంటూ ఆహ్వానించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ పెట్టుబడులకు తమ రాష్ట్రం అత్యంత అనుకూల మైనదని, అన్ని రాష్ట్రాలు, దేశాల దృష్టి ఇప్పుడు తమవైపు మళ్ళిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగం అభివృద్ధికి తాము అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, రైతులకు లాభాన్ని పెంచి, పెట్టుబడిని తగ్గించేవిధంగా పెద్ద ఎత్తున టెక్నాలజీని వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. హార్టికల్చర్‌ను

➪ 2వ పేజీలో...

ప్రభుత్వాలతో
గొడవ పడను!



- సున్నితంగా వ్యవహరిస్తా
- అస్థిరత పరచం
- ఎడా పెడా మాట్లాడను
- సమస్యలపైనే పోరాటం
- రెండు రాష్ట్రాల్లోనూ పోటీ
- 27నుంచి అనంతలో టూర్

కరీంనగర్, ప్రభ న్యూస్ బ్యూరో : ప్రస్తుతం తనకు సినిమాలపై దృష్టిలేదని, పూర్తి స్థాయి రాజకీయాలపైనే దృష్టిసారిస్తానని, 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి జనసేన పోటీ చేస్తుందని, బలమైన స్థానాల్లో పోటీకి దిగుతామని జనసేన నేత పవన్ కళ్యాణ్ అన్నారు. సోమవారం కొండగట్టు అంజన్న స్వామిని దర్శించుకున్న అనంతరం సాయంత్రం కరీంనగర్‌లోని శ్వేతా హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అగ్రెసివ్ పాలిటిక్స్‌కు దూరంగా ఉంటానని, గొడవలు పెట్టుకునే ఉద్దేశం తనకు లేదని, నిర్మాణాత్మక రాజకీయాలు మాత్రమే చేస్తానని అన్నారు. రేపు, ఎల్లుండి తెలంగాణ జిల్లాలలో

➪ 2వ పేజీలో...



ఆర్థిక అసమానతలతో
అంతులేని అగాధం!

- ఒక్క శాతం మంది వద్దే సంపద పోగు
- 73 శాతం ఆస్తులు వారివే
- ఇది జాతీయ బడ్జెట్‌తో సమానం
- నానాటికీ పెరుగుతున్న అంతరాలు
- ఆక్స్ ఫామ్ ఇండియా సర్వే వెల్లడి

దావోస్: భారత్‌లో పేదలు, ధనికుల మధ్య అంతరం నానాటికీ పెరుగుతోంది. పేదలు నిరుపేదలవుతుంటే, ధనికులు మరింత సంపన్నులుగా అవతరిస్తున్నారు అని ఆక్స్‌ఫామ్ ఇండియా సర్వే నివేదిక స్పష్టం చేసింది. భారత్‌లో సంపద ఎక్కువ భాగం అత్యంత ధనవంతులైన కొద్ది మంది వద్దే కేంద్రీకృతమై ఉందని ఆక్స్‌ఫామ్ వెల్లడించింది. గత ఏడాది భారత్‌లో జరిగిన సంపద సృష్టిలో 73శాతం కేవలం ఒక్క శాతం మంది వద్దే ఉందని తెలిపింది. ఈ మొత్తం రూ.20 లక్షల 91 వేల కోట్లు. అంటే ఇది దాదాపు మన జాతీయ బడ్జెట్‌కు సమానం. ఇదిలావుండగా, దాదాపు 67కోట్ల మంది భారతీయుల సంపదలో పెరుగుదల కేవలం ఒక్కశాతమే కావడం ఆందోళన కలిగించే విషయం. ప్రపంచవ్యాప్తంగా సర్వే ఫలితాల విశ్లేషణ మరింత ఆందోళన కరంగా ఉంది. మొత్తం సంపదలో 82శాతం ధనవంతులైన కేవలం ఒక్క శాతం మంది వద్దకు చేరిందని సర్వే తెలిపింది. ఒక వైపు సంపన్నుల ఆస్తులు అంతకంత పెరుగుతుంటే, కోట్లాది మంది పేదరికంలో మగ్గిపోతూనే ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సంపన్నుల ఆస్తులు వృద్ధి చెందుతుంటే

➪ 7వ పేజీలో...

ప్రపంచ ఆర్థిక సూచీలో మన ర్యాంక్ 62
- చైనా పాక్‌ల కంటే దిగువన

6లో

ఉప ఎన్నికలకు రెడీ

- పిటిషన్లు కొట్టివేస్తే ఎన్నికలకు సై
- హైకోర్టులో పిటిషన్ ఉపసంహరణ
- అవసరమైతే సుప్రీంకు వెళతాం: కేజ్రీవాల్



5లో

భారత్ లాడెన్ అరెస్ట్!

- గుజరాత్ పేలుళ్ల సూత్రధారి
- పదేళ్లపాటు అజ్ఞాతవాసంలో ఖురేషి
- సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ నుంచి ఉగ్రవాదిగా..




5లో

అదే అనిశ్చితి..!

- అమెరికాలో కొనసాగుతున్న షట్ డౌన్
- దిగిరావాల్సిందేనని డెమొక్రాట్ల పట్టు
- నిబంధనలు మారుస్తా : ట్రంప్ హెచ్చరిక





సత్తా చాటిన లోకేష్

- ఐటీ బాధ్యతలిచ్చిన చంద్రబాబు
- విశ్వాసాన్ని నిలబెట్టిన తనయుడు
- పనితీరుతోనే విమర్శకులకు జవాబు
- భారీ సంస్థలను తెచ్చిన ఘనత
- రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర
- నేడు యువనేత 35వ జన్మదిన వేడుక

హైదరాబాద్, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి: విభజనతో తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ పూర్వ వైభవ సాధనకు చంద్రబాబు పాలనే తగినదన్న విశ్వాసాన్ని రాష్ట్ర ప్రజలు ప్రదర్శించారు. కాగా రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగమే కీలకం. తగిన సమర్థుడికి దీన్ని అప్పగిస్తేనే అంతర్జాతీయ, బహుళజాతి సంస్థల్ని ఇక్కడకు ఆకర్షించే వీలుంటుందని భావించిన చంద్రబాబు ఈ బాధ్యతను నారా లోకేష్‌కు అప్పగించారు. ఏడాది తిరక్కముందే లోకేష్ తనపై తండ్రి పెట్టుకున్న విశ్వాసం తప్పు కాదని రుజువుచేశారు. కొడుకు కావడంతోనే ఇంత వేగంగా మంత్రి పదవి కట్టబెడుతున్నారన్న విమర్శకులకు తన పనితనంతోనే ధీటైన జవాబిచ్చారు. ఒకప్పుడు హైదరాబాద్ అభివృద్ధికి ఐటిరంగ విస్తృతే మూలకారణం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే మారుమూల గ్రామాల్లో సైతం ఇంజనీరింగ్ కళాశాలలకు అనుమతులిచ్చి భవిష్యత్‌లో రాబోయే సమాచార విప్లవాన్నందుకునే రీతిలో తెలుగుయువతను ఆయన రూపుదిద్దారు. వారే అంతర్జాతీయంగా ఐటి రంగంలో ప్రవేశించి రాష్ట్రసంపద విస్తృతమవడానికి కారణమయ్యారు. హైదరాబాద్ అభివృద్ధిలో సగానికి పైగా ఐటిరంగ

➪ 3వ పేజీలో...



ఈసీలు, నకళ్లు
ఇక ఫ్రీ!

- రిజిస్ట్రేషన్లు మరింత సులభతరం
- ఇంట్లో నుంచే ఆన్‌లైన్‌లో ప్రక్రియ
- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ

కడప, ప్రభన్యూస్: రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకుంటున్న డిజిటలైజేషన్‌లో భాగంగా ప్రతి వ్యక్తి ఇంటి వద్ద నుంచేస్టాంప్స్, రిజిస్ట్రేషన్స్‌కు సంబంధించిన సేవలన్నీ పొందేందుకు పలు చర్యలు తీసుకోవడం జరిగిందని కడప జిల్లాస్టాంప్స్ అండ్

➪ 7వ పేజీలో...

పెట్టుబడులు పెట్టండి... నాదీ భరోసా!



వెయ్యి కోట్ల పెట్టుబడి

ఇప్పటికే ఇండియాలో వ్యవసాయ రంగానికి సంబంధించి వెయ్యి కోట్ల పెట్టుబడులు పెట్టామని పయొనీరింగ్ వెంచర్స్ చైర్మన్ రోస్ పాల్ వెల్లడించారు. పండ్ల తోటలు, పాడి పరిశ్రమలో పెట్టుబడులు వున్నాయని గుర్తు చేశారు. వివిధ పండ్ల తోటలు, కూరగాయల రకాలలో పెద్ద ఎత్తున పెట్టుబడులకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. భారతదేశం లోని గ్రామాలలో పెట్టుబడులు పెట్టేందుకు తాము సిద్ధంగా వున్నామని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగం అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటోందని, అక్కడ అభివృద్ధిని చూసి భవిష్యత్ కార్యాచరణపై చర్చించాలనే యోచనలో వున్నట్టు పేర్కొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని, ఇప్పటికే 40 లక్షల ఎకరాలలో హర్టికల్చర్‌ను ఏర్పాటు చేశామన్నారు. కోటి ఎకరాలలో హర్టికల్చర్‌ను ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఒకవైపు వున్నా మరోవైపు వృద్ధి రేటును మెరుగు పరిచామని, ఒక్క హర్టికల్చర్‌లోనే 30 శాతం వృద్ధిని సాధించినట్టు చెప్పారు. ఇప్పటికే ఆక్వా కల్చర్‌ను పెద్ద ఎత్తున అభివృద్ధి చేశామని, ఈ రంగంలో దేశంలోనే మొదటి స్థానంలో వున్నామని గుర్తు చేశారు. హర్టికల్చర్‌లో వివిధ పంటలను ప్రోత్సహించేందుకు పంటలవారీగా క్లస్టర్లు ఏర్పాటు చేయబోతున్నామని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు సెన్సార్లు, డ్రోన్లు కూడా వినియోగిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. జూరిచ్ టెక్నాలజీ వినియోగం వినూత్నతలో ఆదర్శంగా నిలిచిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రంగాలలో విప్లవాత్మకమైన మార్పుల కోసం అనేక ఆధునిక టెక్నాలజీలను వినియోగిస్తున్నామన్నారు. సరైన సమయంలో ఆంధ్రప్రదేశ్ , జూరిచ్ ప్రభుత్వాల మధ్య సిస్టర్ స్టేట్ ఒప్పందం జరిగిందని తెలిపారు.

సిస్టర్ స్టేట్ ఒప్పందం

తమ పర్యటనలో భాగంగా చంద్రబాబు బృందం జూరిస్ ప్రభుత్వంతో సిస్టర్ స్టేట్ ఒప్పందం కుదుర్చుకుంది. కార్మెన్ వాకర్‌జూరిచ్ ప్రభుత్వ కౌన్సిలర్, డిప్యూటి మినిస్టర్ బ్రూనో సౌటర్, కోర్ని మేయర్ డైరెక్టర్ ఆఫ్ ఫారెన్ ఎఫైర్స్ లతో చర్చలు జరపడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సమక్షంలో సిస్టర్ స్టేట్ ఒప్పంద పత్రాలను జూరిచ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలకు చెందిన అధికారులు మార్చుకోవడం జరిగింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంట్ టెక్నాలజీ, లైఫ్ సైన్స్, అర్బన్ మరియు రీజనల్ డెవలప్‌మెంట్‌లో తాజా ఒప్పందం ద్వారా పరస్పర సహకారం కోసం అవకాశం ఏర్పడింది.


చైన్ బిజినెస్‌లో పయొనీర్ మేటి

ఇదిలా వుండగా జూరిచ్ కేంద్రంగా పనిచేస్తున్న పయొనీరింగ్ వెంచర్స్ వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత సప్లై చైన్ బిజినెస్‌లో అగ్రగామిగా వుంది. వ్యాపార, ఉత్పత్తిరంగంలో ఇప్పటికే భారతదేశంతో మంచి సంబంధాలు కలిగివున్న ఈ సంస్థ మరిన్ని పెట్టుబడులను గ్రామీణ ప్రాంతాలలో పెట్టాలనే యోచనలోవుంది. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో కూడిన బృందం జరిపిన భేటీకి అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. చంద్రబాబు బృందం జరిపిన భేటీ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఆ సంస్థ చైర్మన్ అంగీకరించారని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ మేరకు చైర్మన్ రోస్ పాల్ నిర్దిష్టమైన హామీని ఇచ్చారని తెలిపారు. పూర్తి స్థాయి. పూర్తిస్థాయి ప్రణాళికలతో వచ్చి వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాల్సిందిగా ముఖ్యమంత్రి ఈసందర్భంగా కోరారు.

చర్చలతో పాటు జూరిచ్ ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పయొనీరింగ్ వెంచర్స్ చీఫ్ ఇన్వెస్టర్ ఆఫీసర్ సందీప్ రాజ్‌తో పాటు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు, పంచాయతీ రాజ్, ఐ.టి, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలతో గొడవపడను!

(మొదటిపేజీ తరువాయి)



కార్యకర్తలను కలిసి వారి అభిప్రాయాలు స్వీకరిస్తానని, సమస్యలపై అధ్యయనం చేసిన తరువాతే వాటిపై కార్యాచరణ ప్రకటిస్తామని, తొందరపడి అడుగులు వేయమన్నారు. యువత ఓట్లు చీల్చడానికే తెలంగాణలో పర్యటిస్తున్నారని, సీఎంను కలసిన పర్యటనకు వచ్చారని అడిగిన ప్రశ్నకు పవన్ కల్యాణ్ తీవ్రంగా ఖండించారు. సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడానికి కలిశాను, సీఎంను కలడవం తప్పుకాదు, దశాబ్దాల పోరాట ఫలితంగా తెలంగాణ వచ్చింది, కేసీఆర్ ఉద్యమం వల్లే తెలంగాణ వచ్చిందని ప్రజలు పట్టం కట్టారన్నారు. తెలంగాణ అంశం సున్నితమైంది, ఇక్కడి ప్రజల సమస్యలపై అధ్యయనం చేస్తాం, విమర్శలు చేసుకుంటూ వెళితేనే రాజకీయాలు కావన్నారు. 2009 ఎన్నికల ప్రచారంనకు వచ్చినపుడు విద్యుత్ తీగ తగిలి ప్రమాదం జరిగిందని, ఆంజనేయస్వామి దయవల్ల అపాడు బయటపడ్డానని చెప్పారు. 2009లో ప్రచారాన్ని కూడ ఇక్కడి నుంచే ప్రారంభించానని గుర్తు చేసుకుంటూ సంపూర్ణ రాజకీయా జీవితంలోకి రావాలనుకున్నపుడు ఆంజనేయస్వామిని దర్శించుకోవాలని ఆయన ఆశీస్సులు తీసుకునేందుకు వచ్చానని అన్నారు. స్వామిని నమ్మితే అసాధ్యాలు కూడ సుసాధ్యాలు అవుతాయన్న నమ్మకం తనకు ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కూడ అంజన్న కృపతోనే వచ్చిందని అంటూ కార్యకర్తలతో ఆలోచించి ఏయే సమస్యలపై ఎలా ముందుకెళ్లాలనే విషయంపై చర్చిస్తామని చెప్పారు. తెలంగాణ అంటే అమితమైన ప్రేమ అని పేర్కొన్నారు. తెలంగాణ కార్యాలయం హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని, కరువు జిల్లా అనంతపురంలో ఈ నెల 27 నుంచి ప్రజాయాత్ర చేపట్టనున్నామని, ఇక్కడ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తొలి పార్టీ కార్యాలయాన్ని కూడ ప్రారంభిస్తామని ప్రకటించారు. అనంతపురం జిల్లాలో మూడురోజుల పాటు యాత్ర ఉంటుందని, ఆ తరువాత ఒంగోలులోని ఫ్లోరోసిస్, కిడ్నీ బాధితులను కలుస్తానని, అనంతరం విశాఖా జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాల్లోనూ, కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రాన్ని పరిశీలిస్తానని చెప్పారు. అనంతపురం జిల్లా పర్యటన తరువాత రాష్ట్రాల వారీగా ఆయా జిల్లాల పర్యటనలకు సంబంధించిన తేదీలను ఖరారు చేస్తానని చెప్పారు. జనసేనా ఎన్నికల బరిలో ఉంటుందని మొదటి నుంచి చెపుతుందని, బీజేపీ జాతీయ అధ్యక్షుడు ప్రాంతీయ పార్టీ ఎందుకు బీజేపీలోకి రమ్మని ఆహ్వానించినపుడు సున్నితంగా తిరస్కరించానని పేర్కొన్నారు. 2014 ఎన్నికల సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశంకు మద్దతు ఇచ్చిన సందర్భంను ఈ సందర్భంగా ఉటంకించారు. సామాజిక తెలంగాణ, సామాజిక ఆంధ్రప్రదేశ్, సామాజిక భారత దేశం లక్ష్యంగా పార్టీ ముందుకు వెలుతుందని, వనరులు అన్ని వర్గాల వారికి సమానంగా అందాలన్నదే తమ ఉద్దేశం తప్ప ప్రభుత్వాలతో గొడవలకు దిగి అగ్రసివ్ పాలిటిక్స్ చేసే ఉద్దేశం తనకు లేదన్నారు. ప్రభుత్వాలను గౌరవించాల్సిన అవసరం ఉందని, రాజకీయ అస్థిరత్వం కోసం తానెప్పుడు మాట్లాడనని, సునిశితంగా ఆలోచిస్తానని, గొడవలు పరిష్కారం కాదన్నారు.

ప్రస్తుతం పార్టీ సంస్థాగతంగా నిర్మాణ దశలో ఉందని, ప్రజలసమస్యలపై అధ్యయనం చేసి, మేధావుల సలహాలు తీసుకొని కార్యారణతో ముందుకు పోతామన్నారు. నిర్మాణాత్మక రాజకీయాలతో ముందుకు వెళ్లేందుకు రిటైర్డ్ అధికారులు, సీనియర్ పాత్రికేయ మిత్రుల సలహాలు, సూచనలు తీసుకుంటున్నానని తెలిపారు. ఇతర పార్టీల నాయకులు, మిత్రులు అందరు నన్ను కలుస్తున్నారు, అభిప్రాయాలను షేర్ చేసుకుంటున్నానన్నారు. నేను సోదరుడు చిరంజీవిని అడిగి పార్టీ పెట్టలేదని, మద్దతు అడగలేదు, అడగనని స్పష్టం చేశారు.

మద్యం పంపిణీ నిలిపివేత

●ఆగిన రూ.50 కోట్ల అమ్మకాలు ●అబ్కారీలో ట్రాక్ అండ్ ట్రేస్ వివాదం ●కమిషనర్ వద్ద వ్యాపారుల ఆందోళన ●కమిషనర్‌తో చర్చిస్తానన్న మంత్రి జవహర్

అమరావతి, ఆంధ్రప్రభ: మద్యం షాపుల్లో ట్రాక్ అండ్ ట్రేస్ మిషన్లు అమర్చలేదనే కారణంతో సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ మద్యం పంపిణీ నిలిపివేసింది. దీంతో సుమారు 50 కోట్ల విక్రయాలు నిలిచిపోయాయి. మద్యం పంపిణీ నిలిపివేయడంతో వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాక్ అండ్ ట్రేస్ మిషన్ల ఏర్పాటు చేసుకునేందుకు ఇటు వ్యాపారులు, అమలు చేసేందుకు అటు అధికారులు సిద్ధంగా ఉన్నా, సాఫ్ట్‌వేర్ విషయంలోనే తకరారు ఏర్పడింది. అబ్కారీశాఖ ఇప్పటికే ఆరునెలలు గడువిచ్చినా షాపుల్లో పెట్టకపోవడంతో కమిషనర్ మద్యం షాపుల యజమానులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది జూన్ 30తో అబ్కారీ సంవత్సరం ముగిసి, జులై ఒకటి నుంచి నూతన అబ్కారీ సంవత్సరం మొదలైంది. ప్రభుత్వ నిబంధనల్లో మద్యం షాపుల్లో ట్రాక్ అండ్ ట్రేస్ మిషన్లు అమరిస్తేనే లైసెన్స్ మంజూరు చేయాలని షరతు ఉంది. ఐతే లైసెన్స్ పొందిన పాత వ్యాపారుల వద్ద కార్వే అమర్చిన కంప్యూటర్లు ఉండగా, కొత్తగా లైసెన్స్ పొందిన వ్యాపారులు మాత్రం కంప్యూటర్లు అమర్చలేదు. అబ్కారీ సంవత్సరం మొదలై ఆరు నెలలు కావస్తున్నా, దుకాణాల్లో మిషన్లు అమర్చకపోవడంతో కమిషనర్ లక్ష్మీనరసింహం ఈనెల 2న సర్క్యులర్ జారీ చేస్తూ పదోతేదీలోపు కంప్యూటర్లు అమర్చకపోతే మద్యం సరఫరా నిలిపి వేయాల్సిందిగా రాష్ట్రంలోని అన్ని డిపోలకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో బెంబేలెత్తిన వ్యాపారులు మూడోతేదీన కమిషనర్‌ను కలిసి మరింత గడువు ఇవ్వాల్సిందిగా కోరారు. వారి కోరిక మేరకు కమిషనర్ నాలుగో తేదీన మరో సర్క్యులర్ జారీ చేశారు. అందులో వైన్ షాపులు ఈనెల 20లోపు, బార్ అండ్ రెస్టారెంట్లు 30 లోపు కంప్యూటర్లను అమర్చుకోవాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. దీంతో ఊపిరి పీల్చుకున్న వ్యాపారులు యధాతథంగా వ్యాపారాలు కొనసాగించారు. గడువు తేదీకి అన్ని షాపుల్లో సిస్టమ్స్ ఏర్పాటు చేయకపోవడంతో తిరిగి మద్యం పంపిణీ నిలిపివేయాల్సిందిగా కమిషనర్ ఈనెల నాలుగున జారీ చేసిన ఆదేశాలను అధికారులు అమలు చేశారు. వ్యాపారులు కొనుగోలు చేసిన సరుకులో 75 శాతం వారి షాపుల నుంచే ట్రాక్ అండ్ ట్రేస్ సిస్టం ద్వారా అమ్మకాలను అప్‌లోడ్ చేసిన వారికే మద్యాన్ని పంపిణీ చేయాల్సిందిగా కమిషనర్ మరో షరతు విధించారు.దీంతో డీలర్స్ అసోసియేషన్ సోమవారం కమిషనర్‌ను కలిసి ఆందోళన వ్యక్తం చేసింది. కార్వే సంస్థ చేసిన నిర్వాకానికి మద్యం పంపిణీ నిలిపివేయడం సమంజసంగా లేదని పేర్కొన్నారు. కమిషనర్ ఈవిషయాన్ని పరిష్కరించాల్సిందిగా ఎక్సైజ్‌శాఖ అడిషనల్ కమిషనర్, జాయింట్ కమిషనర్, ఓఎస్‌డీ, వైన్ డీలర్స్, కార్వే సంస్థ, సాఫ్ట్‌వేర్ రూపొందించిన సీటెల్ కంపెనీ ప్రతినిధులు కలిసి చర్చించాల్సిందిగా ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 4,380 మద్యం షాపులకుగాను, ఇప్పటికే 4,100 షాపుల్లో మిషన్లు ఏర్పాటు చేసామనీ, అందులో 1100 మిషన్లు పనిచేయడంలేదని కార్వే సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈనెల 27 లోపు అన్ని షాపుల్లో మిషన్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్వే సంస్థ ఏర్పాటు చేసిన మిషన్లు సరిగా పనిచేయడంలేదని ఫిర్యాదులు రావడంతో సాఫ్ట్‌వేర్ రూపకల్పన చేసిన సీటెల్ సంస్థ తామే మిషన్లు ఏర్పాటు చేస్తామని ముందుకొచ్చినట్లు సమాచారం. అయితే ఇప్పటి వరకు కంప్యూటర్లు పెట్టని దుకాణదారులు నూతనంగా తమ కిష్టమొచ్చిన కంప్యూటర్లను ఏర్పాటు చేసుకుంటే సాఫ్ట్‌వేర్ అందించేందుకు సీటెల్ సంస్థ సుముఖత వ్యక్తం చేసింది. ఈ మొత్తం ప్రక్రియ పూర్తయితేనే మద్యం పంపిణీకి అనుమతి ఇస్తామని కమిషనర్ వైన్ డీలర్స్ అసోసియేషన్‌తో పేర్కొన్నట్లు తెల్సింది. ఈ విషయమై ఎక్సైజ్ శాఖ మంత్రి జవహర్‌ను వివరణ కోరగా కంప్యూటర్ల ఏర్పాటులో కొంత సందిగ్ధత నెలకొందనీ, మంగళవారం కమిషనర్‌తో చర్చించి గడువును పెంచేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఈ ట్రాక్ అండ్ ట్రేస్ పూర్వపరాలు పరిశీలిస్తే.. మద్యం అమ్మకాల్లో పారదర్శకత కోసం గతంలో ప్రభుత్వం అన్ని మద్యం షాపుల్లో హెడోనిక్ ప్యాత్ ఫౌండ్ సిస్టం (హెచ్‌పీఎఫ్ఎస్)ను ప్రవేశపెట్టింది. తద్వారా మద్యం అధిక ధర నియంత్రణ, బెల్టుషాపుల నిరోధం, బిల్లింగ్, కల్తీ, నకిలీ మద్యాన్ని అరికట్టడంతో కోసం ఆన్‌లైన్లో ఎప్పటికప్పుడు రాష్ట్రవ్యాప్తంగా అమ్మకాలు తెల్సుకునేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం అమలుకు సీటెల్ కంపెనీ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వ ఒప్పందం మేరకు మద్యం వ్యాపారులు షాపుల్లో కంప్యూటర్లు ఏర్పాటు చేసుకుంటే, సీటెల్ కంపెనీ సాఫ్ట్‌వేర్‌ను అందించాల్సి ఉంది. ఐతే అప్పటి అధికారులు కార్వే కన్సల్టెన్సీ ద్వారానే కంప్యూటర్లను ఏర్పాటు చేసుకోవాలని మద్యం వ్యాపారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. బైట మార్కెట్లో పేరెన్నికగన్న కంపెనీలు 40 నుంచి 50 వేల మధ్యలో సిస్టం అమరుస్తామని ముందుకురాగా, కార్వే కంపెనీ తనకున్న పలుకుబడితో నెలకు 5 వేల చొప్పున మద్యం వ్యాపారులు అద్దె రూపేణా చెల్లించే విధంగా కంప్యూటర్లను అమర్చారు. అయితే ఆ కంపెనీ సరిగా సేవలందించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ పద్ధతి అరకొరగానే సాగింది. రాష్ట్రంలో సుమారు 4,380 వైన్ షాపులు, 800 బార్ అండ్ రెస్టారెంట్లున్నాయి. కార్వే సమకూర్చిన కంప్యూటర్లు పనిచేసినా, పనిచేయకపోయినా నెలకు వాయిదా కింద రూ.2.5 కోట్లు మద్యం వ్యాపారులు చెల్లించారు. రెండేళ్లలో సుమారు 60 కోట్లు మద్యం వ్యాపారులు కార్వే సంస్థకు చెల్లించినా ప్రభుత్వ లక్ష్యం సరిగా నెరవేరలేదు.

గతేడాది జూన్ 30తో అబ్కారీ సంవత్సరం ముగిసి, జులై ఒకటి నుంచి నూతన అబ్కారీ సంవత్సరం మొదలైంది. ప్రభుత్వ నిబంధనల్లో ట్రాక్ అండ్ ట్రేస్ మిషన్లు అమరిస్తేనే లైసెన్స్ మంజూరు చేయాలని షరతు ఉంది. ఐతే లైసెన్స్ పొందిన పాత వ్యాపారుల వద్ద కార్వే అమర్చిన కంప్యూటర్లు ఉండగా, కొత్తగా లైసెన్స్ పొందిన వ్యాపారులు మాత్రం కంప్యూటర్లు అమర్చలేదు. కార్వే సంస్థ కొన్ని చోట్ల అమర్చకపోయినా, అమర్చిన చోట పనిచేయక పోయినా వ్యాపారులనుంచి మాత్రం నెలవారీగా 5వేలు వసూలు చేస్తున్న విషయాన్ని కూడా వ్యాపారులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్ళారు. ట్రాక్ అండ్ ట్రేస్ విషయం అబ్కారీ శాఖలో దుమారాన్ని రేకెత్తిచ్చింది. ఏదేమైనా ప్రభుత్వ ఉద్దేశ్యం ఖచ్చితంగా నెరవేర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మద్యం షాపుల్లో ట్రాక్ అండ్ ట్రేస్ మిషన్ల ఏర్పాటుపై కృతనిశ్చయంతో ఉంది.



102-కంప్యూటర్


విలేకరులతో మంత్రి జవహర్

ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు
200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్

●దళితుల భూముల కోసం ప్రత్యేక చట్టం ●పాదయాత్ర తర్వాత దళిత గర్జన సదస్సు ●దళిత ఆత్మీయ సమ్మేళనంలో వైకాపా అధినేత జగన్

తిరుపతి, ప్రభ న్యూస్ బ్యూరో: అందరి ఆశీస్సులతో వచ్చే ఎన్నికలలో తమపార్టీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీల గృహాలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రకటించారు. పాదయాత్ర లో భాగంగా సోమవారం సత్యవేడు నియోజకవర్గం పల్లమాలలో ఏర్పాటు చేసిన దళితుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఆయన దళితులకు ఇచ్చిన భూములను తిరిగి లాక్కోకుండా చట్టపరమైన రక్షణ కల్పిస్తానని, తప్పనిసరై తీసుకోవాల్సివస్తే పరిహారం భారీగా ఇచ్చే లా చూస్తానని, దళితుల భూములకు ఉచితంగా బోర్లు వేయిస్తామని హామీల వర్షంకురిపించారు. ప్రత్యేక కమిటీ ద్వారా రాష్ట్రంలో ప్రతి దళిత కుటుంబాలను కలసి వారి సమస్యలను అధ్యయనం చేసి సమర్పించే నివేదిక ఆధారంగా ప్రస్తుత పాదయాత్ర ముగియగానే ఎస్సీ, ఎస్టీల గర్జన సదస్సు నిర్వహించి మరిన్ని హామీలిస్తానని కూడా ప్రకటించారు. చిత్తూరు జిల్లా చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్రలో భాగంగా సోమవారం జగన్ శ్రీకాళహస్తి , సత్యవేడు నియోజకవర్గాలగుండా పర్యటించారు. ఉదయం శ్రీకాళహస్తిలో ప్రారంభించిన పాదయాత్రలో ఆయన సత్యవేడు నియోజక వర్గానికి చెందిన తంగెళ్లమిట్ట, పార్లపల్లెలో ప్రజలతో మమేకమవుతూ పల్లమాలకు చేరుకున్నారు. పాదయాత్రలో భాగంగా పార్టీ ఎస్సీ, ఎస్ టీలసెల్ రాష్ట్ర అధ్యక్షుడు నాగార్జున అధ్యక్షతన పల్లమాలలో దళితుల ఆత్మీయ సదస్సులో జగన్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వ హయాంలో దళితులపై దాడులు తప్పుడు కేసుల బనాయింపులు పెరిగిపోయా యని ఆరోపించారు. ఒక మంత్రి దళితులు చదువుకోరని, స్నానాలు కూడా చేయరని అంటే మరో మంత్రి ఎస్సి అధికారులను వేధిస్తారని అంటూ ముఖ్యమంత్రి ఏకంగా దళితుడుగా పుట్టడం దురదృష్టకర మంటారని విమర్శించారు. గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ లు కూడా నెరవేర్చకుండా మోసం చేశారన్నారు. వచ్చే ఎన్నికలలో అందరి ఆశీస్సులతో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని ఎస్సి ఎస్టి ల గృహ అవసరాలకు చేసే విద్యుత్ సరఫరాకు 200 యూనిట్ల వరకు ఎటువంటి ఛార్జీలేకుండా చేస్తామన్నారు. గతంలో దళితులకు ఇచ్చిన భూములను లాక్కొంటున్న చంద్రబాబు ప్రభు త్వం పెద్దలకు కట్టబెడ్తోందని ఆరోపిస్తూ ఇటువంటి సమస్యలు రాకుం డా తమ ప్రభుత్వ హయాంలో జరిగే తొలి అసెంబ్లీ సమావేశంలోనే దళితుల భూముల పరిరక్షణకు ప్రత్యేక చట్టం చేస్తామన్నారు. తప్పనిసరై వెనుకకు తీసుకోవాల్సినవస్తే ఇతరులకు ఇచ్చే పరిహారం కన్నా రూ.10 లు ఎక్కువ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని,దళితులకు ఇచ్చే భూములను ప్రభుత్వమే రిజిస్ట్రర్ చేసేలా చూస్తామని, వారి భూముల్లో ఉచితంగా బోరింగ్‌లు వేయిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ మైనారిటీలకు 45 ఏళ్ల నుంచే పింఛన్ సౌకర్యం కల్పిస్తామన్నారు. వీటన్నిటిని మించి రాష్ట్రంలోని ప్రతి దళితవాడకు వెళ్లి దళిత కుటుం బాన్ని కలిసి వారి సమస్యలను అధ్యయనం చేయడానికి తమపార్టీ దళిత నేత నాగార్జున నేతృత్వంలో ప్రత్యేకంగా ఒక కమిటీ ని వెంటనే నియమిస్తున్నామన్నారు. తన పాదయాత్ర పూర్తయ్యేలోగా ఆ కమిటీ తన నివేదికను తనకు సమర్పిస్తుందని, పాదయాత్ర ముగిసిన తర్వాత దళితుల గర్జన పేరుతో ప్రత్యేక సదస్సు నిర్వహించి ఆ నివేదిక ఆధారంగా మరిన్ని హామీలిస్తామని జగన్ ప్రకటించారు. ఈసదస్సులో భాగంగా నిర్వహించి ముఖాముఖి కార్యక్రమంలో కొందరు దళితులు చేసిన వినతులపై జగన్ స్పందిస్తూ రాష్ట్రంలో పెట్టే ఏ పరిశ్రమలో అయినా 75 శాతం స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని, పాత పరిశ్రమలకు నోటీసులు జారీ చేయడం ద్వారా కొత్త పరిశ్రమలకు నిబంధనలు విధించడం ద్వారా ఆ నిర్ణయం అమలు చేయడానికి కృషి చేస్తామని ప్రకటించారు. ఈ సదస్సులో తిరుపతి లోక్‌సభ సభ్యుడు వరప్రసాద్, శాసనసభ్యుడు నారాయణ స్వామి (గంగాధరనెల్లూరు) సునీల్‌కు మార్ (పూతలపట్టు) శ్రీనివాసులు (కోడూరు) సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలం తదితరులు పాల్గొ ని ప్రస్తుత ప్రభుత్వం హయాంలో దళితులకు జరుగుతున్న అన్యాయాలను వివరిస్తూ జగన్ ముఖ్యమంత్రి అయితే కానీ దళితులకు సంపూర్ణ న్యాయం జరగదన్నారు.

ఆపై మధ్యాహ్నం భోజన విరామం తర్వాత కత్తివారి కండ్రిగ,బసవకుంట, అల్లాతూరుక్రాష్, పట్టాభిరెడ్డి గిరిజనకాలనీ గ్రామాల మీదుగా సాయంత్రం రెడ్డిగుంట బడవకు చేరడంతో 68వరోజు పాదయాత్ర ముగిసింది. దాదాపు 13 కిలోమీటర్ల దూరం కొనసాగిన జగన్ పాదయాత్ర ముగిసింది. దాదాపు 13 కిలోమీటర్ల దూరం కొనసాగిన జగన్ పాదయాత్రలో రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, లోక్‌సభ సభ్యుడు మిధున్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, మధుసూదనరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా ఈనెల 23వ తేదీ ఉదయం మరో రెండు, మూడు పల్లెల్లో పర్యటించడంద్వారా చిత్తూరుజిల్లాలో జగన్ పాదయాత్ర ముగియనున్నది. జిల్లా శివార్లలో చిత్తూరుజిల్లా వాసులకు వీడ్కోలు పలకనున్న జగన్‌కు నెల్లూర్లుజిల్లా సుళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలో నెల్లూర్లుజిల్లా నేతలు ఘనంగా స్వాగతం పలకడానికి ఏర్పాట్లు చేశారు.


సత్యవేడు నియోజకవర్గంలో జరిగిన పాదయాత్రలో పాల్గొన్న జగన్, ఇతర నాయకులు

కొండగట్టు అంజన్న సన్నిధిలో పవన్ పూజలు

●ఆలయానికి రూ.11 లక్షల విరాళం ●రాజకీయ ప్రస్థానం ప్రారంభం ●కరీంనగర్‌లో నేడు కార్యకర్తలతో సమావేశం

జగిత్యాల (మల్యాల), ప్రభ,న్యూస్ : తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ సంచనాలను రేకెత్తించే జనసేన అధినేత పవన్ కల్యాణ్ పర్యటన ఆద్యంతం ఆసక్తి భరితంగా సాగింది. మూడు రోజుల క్రితం పవన్ ట్విట్టర్‌లో ప్రకటించిన విధంగా తమ కుటుంబ ఇలవేల్పు అయిన అంజన్న క్షేత్రానికి పర్యటించారు.

సోమవారం హైదరాబాద్ నుండి బయలుదేరి మధ్యాహ్నం 1.30 గంటలకు కొండగట్టుకు చేరుకుని ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అంజన్నను దర్శించుకుని పవన్ కల్యాణ్ అరగంటకు పైగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు శేషవస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అభివృద్ధికి రూ.11 లక్షల విరాళాన్ని ప్రకటించారు. పోలీసులు, బౌన్సర్ల బందోబస్తు మధ్య పవన్ అంజన్న దర్శనంతో పాటు దారి పొడవునా రోడ్‌షో నిర్వహించారు. పవన్‌ను చూడటానికి ఉమ్మడి జిల్లాల నుండి అభిమానులు అధిక సంఖ్యలో కొండగట్టుకు తరలి వచ్చారు.

దారి పొడవునా అభిమానుల నిరీక్షణ

జగిత్యాల జిల్లాలో పవన్ పర్యటన నిమిత్తం సోమవారం ఉదయం నుండి దారి పొడవునా అభిమానులు బారులు తీరడంతో పాటు, రోడ్డు కిరువైపులా, మేడలమీద, చెట్లమీద ప్రజలు నిరీక్షించారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం వరకు పవన్ కల్యాణ్ రాక కోసం అభిమానులు వేచి యున్నారు. పవన్‌కల్యాణ్ మధ్యాహ్నం 1.30 గంటలకు కొండగట్టుకు చేరుకున్నాక అభిమానులు స్వాగతం పలికారు.




యాత్రకు ముందు జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు భార్య అన్నా లెజ్నోవా హారతి. కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు, పవన్‌కు అడుగడుగునా అభిమానుల నీరాజనం

సత్తా చాటిన లోకేష్



(మొదటిపేజీ తరువాయి)

ప్రభావంకనిపిస్తుంది. అక్కడ్నుంచేకొనుగోలుశక్తిపెరిగింది. మార్కెట్ విస్తృతమైంది. అంతవేగంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందేందుకు ఇక్కడిక్కూడా ప్రఖ్యాత ఐటి సంస్థల ఏర్పాటు అత్యవసరం. బాధ్యతలు చేపట్టి ఏడాది తిరక్కముందే ఆంధ్రప్రదేశ్‌కు రెండు డజన్లకు పైగా ఐటి సంస్థల్ని లోకేష్ తీసుకురాగలిగారు. ఐటిరంగంలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టారు. ఎపి క్లౌడ్ ప్రోగ్రామ్ కూడా ఆయన రూపుదిద్దారు. రాష్ట్రానికి ఎన్నైనా పరిశ్రమలు రావొచ్చు. కానీ ఐటిరంగంలో వస్తున్న పరిశ్రమల ద్వారానే పెద్దసంఖ్యలో ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వేగంగా సంపద పోగివేతకు ఈ రంగంలోనే అవకాశముంది. దీన్ని సమర్ధవంతంగా నిర్వహించడం ద్వారా లోకేష్ ఇప్పటికే తన పాలనా సామర్ధ్యాన్ని నిరూపించుకున్నారు.

వారసత్వం ఒక మెట్టు ఎక్కేందుకే ఉపకరిస్తుంది. ఆ తర్వాత సామర్ధ్యాన్ని నిరూపించుకోవాలి. లేనిపక్షంలో శక్తివంతమైన నాయకుడ్ని కేవలం వారసత్వమే తయారు చేయలేదు. ఈ విషయం ఇప్పటికే అనేకసార్లు రుజువైంది. ఎన్‌టిఆర్ మనుమడిగా, చంద్రబాబు కుమారుడిగా రాజకీయాల్లోకొచ్చినప్పటికీ లోకేష్ రాజకీయ జీవితం పూలపాన్పులా సాగలేదు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆయన రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించారు. స్పష్టమైన బాధ్యతనప్పగించనప్పటికీ కార్యకర్తల బలాన్ని, బలగాన్ని కూడదీసేందుకు కార్యక్రమాలు అమలు చేసారు. కార్యకర్తలకోసం బీమా పథకాలు ప్రవేశపెట్టారు. ఎన్‌టిఆర్ ట్రస్ట్‌ను కేవలం రాజకీయవేదిగా కాకుండా కార్యకర్తల ఆరోగ్య పరిరక్షణా కేంద్రంతో పాటు వారికి వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అమల్లో పెట్టారు. వారి పిల్లలకు విద్యాసౌకర్యాలు కల్పించారు. దీంతో పాటు పార్టీలో సామాజిక బాధ్యత పెంచారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పార్టీ కార్యకర్తల్ని సేవా కార్యక్రమాలకు మళ్ళించారు. ఇలా పార్టీలో తనకంటూ ఓ స్థానాన్ని సాధించుకున్న తర్వాతే పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు.

ఏ ఇతర పార్టీలోనూ కార్యకర్తలకు లేని అనేక సౌకర్యాలు తెలుగుదేశంలో కల్పించేందుకు లోకేషే కారణం. ప్రతి క్రియాశీల కార్యకర్తకు వ్యక్తిగతంగా రెండులక్షల బీమా సౌకర్యాన్ని పార్టీ తరపున ఆయనే చేయించారు. ఈ కారణంగానే సిద్ధాంతాల్తో పాటు ఆయన ఆచరణ విధానం ఆకర్షించి 53లక్షలకు పైగా సభ్యత్వాల్ని తెలుగుదేశం సాధించగలిగింది.

1983జనవరి23నజన్మించిన లోకేష్ వారసత్వం ఉండికదాని నేరుగా రాజకీయాల్లోకొచ్చేయలేదు. అంతర్జాతీయ ప్రతిష్టాత్మక స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలో ఎమ్.బి.ఏ పూర్తి చేశారు. కార్నెగి మెల్లాన్ విశ్వవిద్యాలయంలో మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ప్రధానాంశంగా డిగ్రీ పొందారు. ఆ తర్వాతే ఆయన తెలుగుదేశం సంస్థాగత రాజకీయాల్లోకి అడుగెట్టారు.

దీర్ఘకాలంగా దేశంలో సంక్షేమానికి చేస్తున్న వ్యయంలో 89శాతం వరకు పక్కదారి పడుతోందన్న ఆందోళనుంది. ఈ దుస్థితిని తప్పించేందుకు ప్రభుత్వం పేదలకిస్తున్న సబ్సిడీ, రాయితీల్లో మధ్యవర్తుల ప్రమేయాన్ని నిరోధిస్తూ నేరుగా నగదు బదిలీ విధానాన్ని 2009ఎన్నికలకు ముందే లోకేష్ ప్రతిపాదించారు. అప్పటికే అంతర్జాతీయంగా సంక్షేమ అమల్లో పెనుమార్పులు మొదలయ్యాయి. 2009సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం ఈ అంశాన్ని తన మేనిఫెస్టోలో కూడా ప్రవేశపెట్టింది. 2013లో రాహుల్‌గాంధీ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడయ్యాక సరిగ్గా ఇదే ప్రతిపాదనను తాము అమల్లోకి తెస్తామంటూ ప్రకటించారు. గత సాధారణ ఎన్నికల అనంతరం పలు రాష్ట్రాల్లో ఇలా నగదు బదిలీ విధానం కొనసాగుతోంది.

నేడు సురేష్ ప్రభుతో సీఎం భేటీ

పెట్టుబడులు, పరిశ్రమల విస్తరణే అజెండా



(ఫైల్ ఫోటో)

అమరావతి, ఆంధ్రప్రభ : దావోస్ పర్యటనలో వున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 23 న కేంద్ర మంత్రి సురేష్ ప్రభుతో భేటీ కానున్నారు. కేఫ్ ష్నీడర్‌లోని ఇండియా లాంజ్‌లో సురేష్ ప్రభును కలుసుకుంటారు. ఈ సందర్భంగా పలు అంశాలు ప్రస్తావనకు వచ్చే అవకాశాలున్నాయి. కేంద్ర వాణిజ్య శాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్న సురేష్ ప్రభు ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఫలితంగానే ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు రాబట్టడంతో పాటు వివిధ బహుళజాతి పరిశ్రమలకు ఇస్తున్న రాయితీలు, , పరిశ్రమల విస్తరణ, కొన్ని పెండింగ్ ప్రాజెక్టులపై వారు చర్చించే అవకాశాలున్నాయి. కేంద్రంలో కీలకమైన నిర్వహిస్తున్న సురేష్ ప్రభు ఆంధ్రప్రదేశ్‌కు అన్ని విధాలా సహకారం అందించడంలో ముందుండాలంటూ ముఖ్యమంత్రి ఇటీవలే కోరారు. ఆ మేరకు ప్రభు నుంచి నిర్దిష్టమైన హామీ లభించింది. దావోస్ పర్యటనను కేంద్రం, రాష్ట్ర సంబంధాల కోణంలో సద్వినియోగం చేసుకోవాలని నిర్ణయించిన ముఖ్యమంత్రి ఆ దిశగానే ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం సాయంత్రం ఏడు గంటల నుంచి రెండు గంటలపాటు భేటీ కానున్నారు. కాగా రెండవ రోజు పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అంతర్జాతీయ ఆర్థికసంస్థలకు చెందిన సి.ఇ.ఓలతో భేటీ అవుతారు. సిఐఐ, డబ్ల్యుసి సంస్థలు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నాయి. ఏపీ లాంజ్ ప్రారంభోత్సవ కార్యక్రమంతో పాటు కాంగ్రెస్ హాల్‌లో జరిగే సదస్సు, విప్రోకు చెందిన అజీం ప్రేమ్‌జీ, బజాజ్ గ్రూప్, సిఐఐ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలోనూ ముఖ్యమంత్రి పాల్గొంటారు.

తెదేపా ఎన్నికల వ్యూహం

- సమర్థుల అన్వేషణలో అధిష్టానం
- రాష్ట్రంలో ఎన్నికల వేడి
- దావోస్ నుంచి రాగానే చంద్రబాబు ప్రత్యేక సమావేశాలు

అమరావతి, ఆంధ్రప్రభ బ్యూరో: తెలుగు దేశం పార్టీ ఫిబ్రవరి నెల నుంచి సరికొత్త ఎన్నికల వ్యూహంతో ముందుకుపోనున్నది. పార్టీలో సమర్థుల అన్వేషణకూడా చేస్తుందంటున్నారు. ఇప్పటికే పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఇందుకు సంబంధించి వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. దావోస్ పర్యటన ముగించుకుని రాగానే తన ఎన్నికల వ్యూహానికి పదును పెట్టి, సరికొత్త ఎత్తుగడలతో పార్టీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటారని భావిస్తున్నారు.

జనసేన పార్టీ అధినేత తెలంగాణ పర్యటన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో 2019 ఎన్నిక యుద్ధ భేరి మోగించినట్లయింది. ఇదే క్రమంలో దావోస్ పర్యటనకు వెళ్లిన సందర్భంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూడా పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేసి,వెళ్లారు. రాబోయే ఎన్నికల నాటికి సర్వం సిద్ధంకావాలని, ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా చేసుకుని పని చేయాలని నాయకులకు,పార్టీ ప్రజాప్రతినిధులకు నిర్దేశించడం ద్వారా రాష్ట్రానికి ఎన్నికల జ్వరం ఆవరించినట్లయింది. ఫిబ్రవరి నుంచి పార్టీ నాయకులు,కార్యకర్తలు,ప్రజాప్రతినిధులతో ప్రత్యేకించి,భేటీలకు చంద్రబాబునాయుడు సన్నద్ధమవుతున్నారు. రానున్న ఎన్నికల ప్రక్రియలో భాగంగానే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.దావోస్ పర్యటన ముగించుకుని ,రాగానే రాష్ట్రంలో పార్టీ అభివృద్దే లక్ష్యంగా ఆయన పావులు కదుపనున్నారు.సరికొత్త రాజకీయ వ్యూహంతో ముందుకు పోవాలని చంద్రబాబు ప్రణాళికలు రచించారు.ఒక వైపు ఇప్పటికే రాష్ట్రంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాజకీయ యాత్రలకు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో ఇక ఎంతమాత్రం ఆలస్యం చేయకూడదని నిర్ణయించారు. అందులో భాగంగానే ప్రతి ఒక్క నేత ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేయాలని ఆదేశించారు. ప్రజాసంతృప్తిలను లక్ష్యంగా చేసుకుని నాయకులు పని చేయాలని నిర్దేశం చేశారు. ప్రజాప్రతినిధులు ప్రజా సంతృప్తి స్థాయిలను 80 శాతానికి చేరుకోవాలని ఆదేశించారు.ఎవరు నిర్లక్ష్యంగా ఉన్న సహించేది లేదని నాయకులకు అల్టిమేటం కూడా ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకున్నది.

ఫిబ్రవరి నుంచి పరస్పరం సమావేశమై,రాజకీయ చర్చలు జరపాలని సీఎం నిర్ణయించిన రోజే పవన్ కల్యాణ్ కూడా రాజకీయ యాత్రకు శ్రీకారం చుట్టడం రాష్ట్రంలో రాజకీయ వేడి రగులుకుంది. 2019 ఎన్నికలే లక్ష్యంగా నాలుగైదు అంశాల ప్రాతిపదికగా చేసుకుని,నాయకులతో సమావేశమై చర్చించబోతున్నారు. ప్రజలు,ప్రజా సంక్షేమ పథకాలు, వారి పట్ల ప్రజా స్పందన ఎలా ఉందనే అంశంపై కూలంకషంగా చర్చించేందుకు ముఖ్యమంత్రి సన్నద్ధమవుతున్నారు. ఇదిలా ఉంటే ఇదే క్రమంలో జనసేన నేతపై సినీ విశ్లేషకుడు పనిగట్టుకుని 40 రోజులుగా విమర్శలకు దిగిన నేపథ్యంలో పవన్‌కల్యాణ్ ఉన్నట్టుండి తెలంగాణలో సమస్యల అధ్యయనం పేరుతో రాజకీయ యాత్రకు దిగడం రాష్ట్ర రాజకీయాలను వేడిక్కించింది. ఈనెలాఖరులోనే ఆయన ఆంధ్రా పర్యటనకు వస్తుండడంతో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుని హోదాలో చంద్రబాబునాయుడు పార్టీ పటిష్టతకు పదునైన వ్యూహాన్ని పన్నినట్లు భావిస్తున్నారు. దావోస్ నుంచి రాగానే సరికొత్త వ్యూహాన్ని అమలు చేస్తారంటున్నారు.సింగపూర్ తరహాలో ఏపీలో కూడా పార్టీ వ్యూహాలు,అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టబోతున్నారంటున్నారు. సీఎం దావోస్ నుంచి రాగానే రాష్ట్ర రాజకీయాలు మరింత రంజుగా మారతాయంటున్నారు. సోషల్‌మీడియాను సమర్ధవంతంగా వినియోగించుకోవాలని ఇప్పటికే సీఎం నేతలకు ,ప్రజాప్రతినిధులకు దిశా నిర్దేశం చేసిన సంగతి తెలిసిందే.

పిల్లలకు తల్లిదండ్రులే ప్రపంచం

- తల్లి, తండ్రి, గురువు దైవంతో సమానం
- భారతదేశంలో మానవీయ విలువల పట్ల ప్రపంచ దేశాలు ఆసక్తి
- వసంత పంచమి రోజున అమ్మకు వందనం నిర్వహించడం అభినందనీయం : మంత్రి గంటా శ్రీనివాసరావు



విశాఖపట్నం, ప్రభ న్యూస్ బ్యూరో: భారతదేశంలో పిల్లలకు తల్లిదండ్రులే ప్రపంచమని, తల్లి, తండ్రి, గురువు దైవంతో సమానమని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి గంటా శ్రీనివాసరావు కొనియాడారు. సోమవారం ఉదయం మధురవాడ చంద్రంపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మకు వందనం కార్యక్రమాన్ని మంత్రి గంటా అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారతదేశంలో మానవీయ విలువలు, సంస్కృతి గొప్పవని అందువల్లే ప్రపంచ దేశాలు మన దేశం పట్ల ఆకర్షితులవుతున్నారన్నారు.

వసంత పంచమి రోజున రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో అమ్మకు వందనం కార్యక్రమం నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారన్నారు. ఇది గొప్ప కార్యక్రమమని, మనసా, వాచా, కర్మేణ తల్లిదండ్రులను గౌరవించాలని, నిత్యం మన ఆలోచనల్లో తల్లి ఉండాలని మంత్రి సూచించారు. తల్లిపట్ల ప్రేమ, అభిమానం పిల్లలందరి లోనూ అంతర్లీనంగా ఉంటుందన్నారు. విద్యార్థులకు తల్లి ప్రాధాన్యత తెలుసునన్నారు. ఇతర దేశాల్లో తండ్రుల రోజు, తల్లుల రోజును జరుపుకుంటారని కాని మన దేశంలో మాత్రం జీవితాంతం వారితో కలిసే ఉంటామన్నారు. రూ.35 లక్షలతో చంద్రంపాలెం పాఠశాలకు అవసరమైన అభివృద్ధి పనులు చేయిస్తామన్నారు. తొలుత ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ వసంత పంచమిరోజున రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అమ్మకు వందనం కార్యక్రమం ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.

తల్లిని భగవంతుడిగా చాగంటి అభివర్ణించారు. తొలి నమస్కారం తల్లికే అని శాస్త్రం చెబుతుందన్నారు. బిడ్డ తల్లికన్నా భిన్నం కాదని, బిడ్డకు తల్లిరక్తం పాలుగా మార్చి పోషిస్తుందన్నారు. అమ్మకంటే స్థితికర్త ఉండదని, అమ్మలాంటి వ్యక్తి సృష్టిలో వేరొకరు ఉండరన్నారు. నిస్వార్థంగా పిల్లల క్షేమం కోరేది అమ్మ అని, చనిపోయేటప్పుడు కూడా పిల్లల కోసం ఆలోచించేది, క్షేమం కోరేది తల్లిమాత్రమేనన్నారు. పిల్లల ఆరోగ్యం, క్షేమం, అభివృద్ధి కోసం తల్లి ఎంతగానో తాపత్రయం పడుతుందన్నారు. పిల్లలు ఎంత గొప్పవారైనా తల్లికి నమస్కరించాలని, తల్లిరుణం తీర్చుకునే తీరులేదని, వేదాలు తల్లికి అత్యంత గౌరవం ఇస్తున్నాయన్నారు.

పిల్లల్లో మంచి సంస్కృతి పెంపొందించడానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఎంతో గొప్పదన్నారు. పిల్లలు తల్లులను గౌరవించాలని, ప్రతీ రోజు తల్లికి నమస్కరించాలని పిలుపునిచ్చారు. అమ్మమాట అమలు చేస్తే ప్రతీ బిడ్డ భవిష్యత్తు బంగారమవుతుందన్నారు. మంత్రి గంటా ఆహ్వానం మేరకు తాను ఇక్కడకు వచ్చి విద్యార్థులకు మంచిమాటలు చెప్పాలని భావించారని, అయితే తాను ఇక్కడకు వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్న తరువాత చాలా సంతోషం కలిగిందన్నారు. రాష్ట్రంలో కుటుంబ సంబంధాలు, సత్సంబందాలు మరింత మెరుగ్గా ఏర్పడాలని తాను కోరుకుంటున్నానన్నారు. అనంతరం విద్యార్థులచే చాగంటి అమ్మకు వందనం ప్రతిజ్ఞ చేయించారు. తదుపరి విద్యార్థులు వారి తల్లుల పాదాలను శుభ్రం చేసి, పూలు, అక్షింతలతో పూజ చేసి వారి ఆశీర్వాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో తల్లిని గౌరవిస్తూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అనేక రకాల పాటలను విద్యార్థులు ఆలపించారు. తొలుత చాగంటి, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, మంత్రి గంటాతో కలిసి జ్యోతిప్రజ్వలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. విశాఖ ఎంపీ హరిబాబు, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి లింగేశ్వరరావు, సర్వశిక్షాభియాన్, ఇతర అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్లౌడ్ హబ్‌కు ప్రణాళిక

- సమర్థంగా అమలుకు చర్యలు
- ప్రత్యేక బడ్జెట్ కేటాయింపునకు చర్యలు
- పెట్టుబడులు, ఉద్యోగావకాశాల ఆధారంగా రాయితీలు
- విధివిధానాలపై ప్రారంభమైన కసరత్తు

అమరావతి, ఆంధ్రప్రభబ్యూరో: రాష్ట్రంలో ఏపీ క్లౌడ్ హబ్ పాలసీ 2018-20 అమలును మరింత సమర్ధవంతంగా నిర్వహించేందుకు ఐటీ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తోంది. ఇప్పటికే ఈ పాలసీ అమలు చేయనున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ రెండవ రాష్ట్రంగా గుర్తింపు పొందింది. ఈ పథక అమలు సమర్ధవంతంగా ఉండేందుకు పరిశ్రమలు మరియు కామర్స్ శాఖలు ప్రత్యేక హెడ్ ద్వారా బడ్జెట్ కేటాయించాలని నిర్ణయించాయి. ఐటీ మరియు ఎలక్ట్రానిక్ అండ్ టెక్నాలజీ శాఖ బడ్జెట్ మరియు ప్రోత్సాహాలను అందించేందు ఆర్థికంగా సమాయత్తమవతున్నాయి. ఐటీ శాఖ మరియు భారత ప్రభుత్వం సంక్షిప్తమైన చర్చల ద్వారా ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఆర్థిక శాఖలోని ముఖ్య అధికారులు మరియు పర్యావరణ వేత్తలు ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్‌ను ఏర్పాటుచేసేందుకు అనేక అంశాలపై కూలంకుశంగా చర్చించిన అనంతరం ప్రత్యేక బడ్జెట్ కేటాయింపు నిర్ణయాన్ని తీసుకున్నాయి.

ఈ పాలసీ తయారీలో ఆర్థిక శాఖ, పరిశ్రమలు మరియు కామర్స్ విభాగం, ఐటీ సలహాదారులు కలిసి అనేక మంది పారిశ్రామిక వేత్తలతో సదరు పాలసీపై చర్చించారు. ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ శాఖ వివిధ విద్యుత్ టారిఫ్‌ల ద్వారా శ్లాబ్ పద్ధతిలో తిరిగి చెల్లింపులు చేసే అంశాన్ని ఆయా కంపెనీల పెట్టుబడులు పెట్టే మొత్తాల ఆధారంగాను, ఉపాధి అవకాశాల కల్ప ఆధారంగా కేటాయించాలని నిర్ణయించాయి. ముఖ్యంగా ఉద్యోగ నియామకాల్లో ఇచ్చే ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని ఈ పాలసీ అమలుచేసే కంపెనీలకు ప్రత్యేకమైన రాయితీలు ఇవ్వాలని కూడా నిర్ణయించాయి. ఇతర పారిశ్రామిక రంగ విధానాల పై ప్రభావం చూపుతున్నందున ఉపాధి ప్రోత్సహకాల పై సరైన సృష్టత ఇవ్వాలి ఇండస్ట్రియల్ అండ్ కామర్స్ శాఖ ఐటీ మంత్రిత్వ శాఖకు సూచించింది. కృత్రిమ మేధస్సు ప్రాజెక్టులకు సంబంధించి గ్రామీణ, అర్బన్ ప్రాజెక్టుకు సరైన వివరణ ఇవ్వల్సి ఉందని ఐ అండ్ సి విభాగం పేర్కొంది. ఈ శాఖ సూచించిన ప్రకారం సంబంధిత డైరక్టరీ మార్గదర్శకాలను జారీ చేయాల్సి ఉంది. సింగిల్ డెస్క్ పోర్టల్ నిర్వహణకు అనుగుణమైన ఖర్చును భాగస్వామ్యం చేయడానికి ఐటి విభాగానికి దీనిని సూచించారు. అంతేకాకుండా ఏఎన్ యెక్క ముసాయిదాలో పేర్కొన్న విధంగా సేవలు అందించేందుకు క్లౌడ్ హబ్ పాలసీని రూపొందించారు.

నిర్దేశిత గడువులోనే పోలవరం

- పోలవరంపై మాట్లాడే నైతికత జగన్‌కు లేదు
- నవయుగ ఏజెన్సీకే కాంక్రీట్ పనులు : మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



ఏలూరు ప్రభన్యూస్: పదమూడు జిల్లాల రైతుల గుండెచప్పుడు పోలవరం ప్రాజెక్టు 2019 నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేసి తీరతామని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు చెప్పారు. పోలవరం ప్రాజెక్టు పనులు పరిశీలించేందుకు సోమవారం పోలవరం విచ్చేసిన మంత్రి ఉమామహేశ్వరరావు పనులు పరిశీలన అనంతరం విలేఖరులతో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధవలన జాతీయ ప్రాజెక్టుగా పోలవరం నిర్మాణం జరుగుతున్నదని అన్నారు. రాష్ట్రాన్ని కరువురహిత రాష్ట్రంగా స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి కంకణం కట్టుకున్నారన్నారు.

2019 నాటికి పోలవరం పూర్తి చేసే దిశగా పనులు అత్యంత శరవేగంగా జరుగుతున్నా యన్నారు. దేశంలో అతివేగంగా జరిగే ప్రాజెక్టు పనుల్లో పోలవరం పనులు ఒకటని ఇంతవేగంగా పనులు ఎక్కడా జరగడం లేదని ఈ పనులు చూసి ప్రతీ ఒక్కరూ ఎంతో గర్వపడుతున్నారని ఆయన చెప్పారు. ఇటీవల పోలవరం సందర్శించిన నీతి అయోగ్ వైస్ ఛైర్మన్ శ్రీ రాజీవ్‌కుమార్ కూడా ఈ ప్రాజెక్టు 2019 నాటికి తప్పనిసరిగా పూర్తవుతాయని చెప్పారని పనులు ప్రగతిపై ఆయన సంతృప్తి వ్యక్తం చేసారన్నారు. 16 జాతీయ ప్రాజెక్టుల్లో ఇంత శరవేగంగా జరుగుతున్న ప్రాజెక్టు పోలవరం పనులను రాజీవ్ కుమార్ ఎంతో మెచ్చుకున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టు ప్రతీ తెలుగువాడు చూడతగ్గ ప్రాజెక్టు అని వచ్చే నెలలో మండల కేంద్రాలలో రైతులకోసం ఏపియస్ ఆర్‌టిసి బస్సులేర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతీ రైతు బిడ్డా ప్రాజెక్ట్‌ను చూడాలని ప్రతీ ఒక్కరూ ఇంత అద్భుతమైన అతి పెద్ద ప్రాజెక్టును చూసి అనుభూతిని పొందాలని ఉమామహేశ్వరరావు చెప్పారు. పట్టిసీమ, పోలవరం పనుల ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును అపర కాటన్‌గా ప్రతీ ఒక్కరూ అభినందిస్తున్నారని మంత్రి దేవినేని ఉమ చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అడ్డుపడే వారిని రైతులు క్షమించరని ఆయన చెప్పారు. త్వరలో గోదావరి, పెన్నా నదుల అనుసంధానంకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టబోతున్నారన్నారు.

రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించేందుకు ప్రజలను అన్నీవిధాలా ఆదుకునేందుకు ఎంతకష్టమైనా సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా అమలు చేస్తున్నామన్నారు. అర్హులైన ప్రతీపేదవానికి గృహాలు, పెన్షన్లు,రేషన్ కార్డులతోపాటు అన్నీ సంక్షేమ పథకాలూ అందేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్షా లు కుళ్లుకుంటున్నాయని ప్రభుత్వానికి చెడ్డపేరొచ్చేలా అనేక కుతంత్రాలు పన్నుతున్నాయన్నారు. ప్రతిపక్షాలెన్ని అవాంతరాలు సృష్టించినా ప్రగతి అభివృద్ధి ఎట్టి పరిస్థితుల్లోనూ ఎక్కడా ఆగబోదని మంత్రి ఉమామహేశ్వరరావు చెప్పారు.

ప్రాచీన ప్రాశస్త్యం కలిగిన ఆలయాలకు పునరుజ్జీవం

- జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చే విధంగా ఉజ్జయిని మహంకాళి ఆలయ అభివృద్ధి : శ్రీ పీఠాధిపతి స్వామి పరిపూర్ణానంద

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సుదీర్ఘ చరిత్ర, ప్రాశస్త్యం కలిగిన సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని శ్రీ పీఠాధిపతి స్వామి పరిపూర్ణానంద అభిప్రాయపడ్డారు. ఈ ఆలయ అభివృద్ధిలో తమ వంతు భాగస్వామ్యం కూడా ఉంటుందని ఆయన స్పష్టంచేశారు. సోమవారం ఉదయం 11.30 గంటలకు స్వామీజీ అమ్మవారి ఆల యాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పాలక మండలి సభ్యులతో సమావేశమై అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా స్వామి పరిపూర్ణానంద మాట్లాడుతూ, దేశంలో రకరకాల శక్తులు హిందూత్వాన్ని దూషిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ పరిస్థితుల్లో ధర్మపరిరక్షణకు హిందూ బంధువు లంతా దీక్షతో ప్రతిన బూనాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగానే ప్రాచీన ప్రాశస్త్యం కలిగిన ఆలయాలను అభివృద్ధి చేసుకోవాలని స్వామీజీ పిలుపునిచ్చారు. ప్రతి ఏటా లక్షలాది మంది తో అత్యంత వైభవంగా నిర్వహించుకునే ఉజ్జయిని మహంకాళి బోనాల పండుగకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉన్నదని తెలిపారు.

ఢిల్లీలో భక్తి శ్రద్ధలతో
వసంత పంచమి వేడుకలు

వసంత రుతువుకు ఘన స్వాగతం పలికిన తెలుగు వనితలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: విద్యా రంభ దినోత్సవంగా చెప్పుకునే వసంత పంచమి వేడుకలు దేశ రాజధానిలో ఘనంగా జరిగా యి. ఉత్తర భారతదేశంలో విశే షంగా జరుపుకునే ఈ పండుగను మాఘ శుద్ధ పంచమి నాడు తెలుగు మహిళలంతా ఆనందోత్సాహాలతో చేసుకున్నారు. జ్ఞానానికి ఆది దేవత అయిన సరస్వతీ దేవి తమ కుటుంబాలకు కరుణా కటాక్షాలను అందజేయాలని కోరుతూ ఆంధ్ర వనితా మండలి న్యూఢిల్లీ బ్రాంచ్‌లో వసంత పంచమి సంబరాలు జరిపారు. గోల్ మార్కెట్‌లోని మానస సరోవర్ హాల్‌లో మహిళలంతా కలిసి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. వీణాపాణికి ప్రీతిపాత్రమైన పసుపు వర్ణం చీరలు, పసుపు రంగు పూలు ధరించి ''సరస్వతీం శుక్లవర్ణాం సుస్మితాం సుమనోహరమ్'' అంటూ శ్లోకాలతో కీర్తిస్తూ జ్ఞానాన్ని, వివేకాన్ని, బుద్ధిని ప్రసాదించాలని వేడుకున్నారు. అనంతరం అమ్మవారి పూజలో ఉంచిన పెన్నులు, పుస్తకాలను అందరికీ పంచారు. అర్చన అనంతరం ఆంధ్ర పిండి వంటలతో విందు భోజనం ఏర్పాటు చేశారు. రుతురాజు అయిన వసంతుడికి, కామధేనువుకి మధ్య అవినాభావ సంబంధం ఉందని, వారితో పాటు అనురాగ దేవత రతీదేవిని పూజించడం వల్ల మనుషుల్లో ప్రేమానుబంధాలు పెరుగుతాయని పురాణాల్లో ఉండడం వల్ల ప్రతి ఏడాదీ తమ మహిళా మండలి ఆధ్వర్యంలో వసంత పంచమి వేడుకలను ఘనంగా జరుపుతుంటామని న్యూఢిల్లీ బ్రాంచ్ సెక్రటరీ నిడసనమెట్ల శారద తెలిపారు.

ఆదర్శ నియోజకవర్గంగా దర్శిని తీర్చిదిద్దుతా...

మంత్రి శిద్దా రాఘవరావు



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో దర్శి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా నిలుపుతామని, ఇందుకు అనుగుణంగా అన్ని చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖా మంత్రి శిద్దా రాఘవ రావు పేర్కొన్నారు. సోమవారం ఒంగోలులోని ఆయన నివాసంలో దొనకొండ మండలానికి చెందిన 2వేల మంది వైఎస్సార్ సిపి కార్యకర్తలను మంత్రి సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్ర బాబు నాయుడు విశేష కృషి చేస్తున్నారని అన్నారు. ప్రకాశం జిల్లాలో పరిశ్రమలను స్థాపించేం దుకు ఆయన ఆసక్తి కనబరుస్తున్నారని తెలిపారు. దర్శి నియోజకవర్గ పరిధిలో రూ.1,800కోట్లతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని మంత్రి తెలిపారు. కురిచేడులో రూ. 30కోట్ల వ్యయంతో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను నిర్మించనున్నట్లు వెల్లడించారు. దొనకొండలో పరిశ్రమలు రానున్నాయని, దీంతో ఇక్కడి ప్రజలకు ఉపాధి అ వకాశాలు మరింత మెరుగవుతాయన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 20 ఏళ్ళలో జరగని అభివృద్ధి, కేవలం మూడున్నర సంవత్సరాల్లో చేసి చూపించా మన్నారు. నియోజకవర్గ కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ ఫైర్ స్టేషన్, పార్కును ఏర్పాటు చేశామని తెలిపారు. సింగిల్ లైన్ రోడ్లను డబుల్ లైన్ రోడ్లుగా మార్చామన్నారు. ముండ్లమూరు మండలంలో రూ. 120 కోట్ల వ్యయంతో లిఫ్ట్ ఇరిగేషన్‌ను నిర్మించామని తెలిపారు. ఈ పథకం వల్ల 15 వేల ఎకరాల భూములు సాగులోకి వచ్చాయన్నారు. రూ.40 వేల కోట్ల వ్యయంతో అమరావతి నుండి అనంతపురం వరకు జాతీయ రహదారిని నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని మంత్రి శిద్దారాఘవరావు వెల్లడించారు. పేదరికం లేని సమాజాన్ని రూపొందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. మానవసేవే, మాధవసేవ అని భావించి రాజకీయాల్లోకి వచ్చానే కానీ ఎటువంటి లాభాపేక్ష లేదని మంత్రి అన్నారు. ఎవరిమీద ఎలాంటి కక్షసాధింపు చర్యలు ఉండవని, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో దొనకొండ మాజీ మండల పార్టీ అధ్యక్షుడు శివకోటేశ్వరరావు, ప్రస్తుత అధ్యక్షుడు మోడీ వెంకటేశ్వర్లు, ఇతర నేతలు పాల్గొన్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
మంగళవారం 23 జనవరి 2018

ఏది లాభదాయకమైన పదవి?


ఢిల్లీలో ఇరవై మంది ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేలు పార్లమెంటరీ కార్యదర్శి పదవుల్లో కొనసాగడం ద్వారా లాభదాయక పదవులను అనుభవించారన్న ఆరోపణను పురస్కరించుకుని వారి సభ్యత్వాలను రద్దు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రపతికి సిఫార్సు చేయడం,ఆయన వెంటనే ఆమోదించడంతో ఈ వ్యవహారం రాజకీయ మలుపు తీసుకుంది. పార్లమెంటరీ కార్యదర్శులను నియమించడం రాజ్యాంగ విరుద్ధమని వివిధ హైకోర్టులు గతంలో ఇచ్చిన తీర్పుల్లో వెల్లడైంది. శాసనసభ్యులను పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమించడం అనేది తెలుగు రాష్ట్రాల్లో కూడా జరిగింది. మద్రాసు నుంచి ఆంధ్రరాష్ట్రం విడిపోయిన తర్వాత తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి ప్రకాశం పంతులుగారి కేబినెట్ లో రాజమహేంద్రవరానికి చెందిన స్వాతంత్ర్యయోధుడు క్రొవ్విడి లింగరాజు పార్లమెంటరీ కార్యదర్శిగా వ్యవహరించారు.అలాగే, అవిభక్త ఆంధ్రప్రదేశ్ లో నలభై ఏళ్ళ క్రితం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మంత్రివర్గంలో రాజమహేంద్రవరం ఎమ్మెల్యే తటవర్తి సత్యవతితో సహా పలువురు పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమితులయ్యారు.అయితే,అప్పట్లో అభ్యంతరాలేవీ రాకపోవడం వల్ల వారు ఆయా పదవుల్లో కొనసాగారు. పార్లమెంటరీ కార్యదర్శి నియామకం రాజ్యాంగం లోని164(1ఎ)కి విరుద్ధమని కోల్‌కతా హైకోర్టుతో సహా వివిధ హైకోర్టులు తీర్పు ఇచ్చాయి.2015లో బెంగాల్‌లో 24మంది పార్లమెంటరీ కార్యదర్శుల నియామకాన్ని కోల్‌కతా హైకోర్టు కొట్టివేసింది.అదే సమయంలో తెలంగాణలో పార్లమెంటరీ కార్యదర్శుల నియామకంపై ఉమ్మడి హైకోర్టు స్టే ఇచ్చింది. ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఆప్ సారథి కేజ్రీవాల్ ప్రమాణం చేసిన తర్వాత మంత్రి పదవుల సంతర్పణ పెద్ద సమస్యగా పరిణమించింది. మొత్తం 70 మంది సభ్యులు గల అసెంబ్లీలో రాజ్యాంగం239ఎఎ అధికరణం కింద ఆయన మొత్తం సభ్యుల్లో పదోవంతు మందికి అంటే ఏడుగురికి మాత్రమే మంత్రిపదవులు ఇవ్వగలిగారు.ఆయన పార్టీ తరఫున 67 మంది గెలుపొందడంతో మంత్రి పదవుల కోసం ఒత్తిడి పెరగడంతో, ఆశావహులను సంతృప్తి పర్చేందుకు ఆయన పార్లమెంటరీ కార్యదర్శులుగా తనకు సన్నిహితులైన వారిని ఇరవై మంది వరకూ నియమించారు. రాజ్యాంగం ప్రకారం ముఖ్యమంత్రికి సహాయంగా ఒక్క పార్లమెంటరీ కార్యదర్శిని మాత్రమే నియమించడానికి వీలుంది. పార్లమెంటరీ కార్యదర్శి పదవి లాభదాయకమైన పదవా? కాదా అన్న అంశంపై సరికొత్త పరిణామాల నేపథ్యంలో ఢిల్లీలో చర్చ జరుగుతోంది.పార్లమెంటరీ కార్యదర్శులు వేతనాలు, భత్యాలు తీసుకోరు కనుక, ఆ పదవి లాభదాయకమైన పదవి కాదన్నది కేజ్రీవాల్ వాదన. ఆయన ఆదాయం పన్ను జాయింట్ కమిషనర్ పదవిని గతంలో నిర్వహించడం వల్ల చట్టాల లోతుపాతులు, పన్ను పరిధిలోకి వచ్చే అంశాల గురించి సమగ్రమైన అవగాహన కలిగి ఉన్నారు. అయితే,ఆదాయం పన్ను చట్టాలకూ,ప్రజాప్రాతినిధ్య చట్టాలకూ సంబంధంలేదనీ, పార్లమెంటరీ కార్యదర్శి లాభదాయకమైనదేనని ఆయన ప్రత్యర్థులు వాదిస్తున్నారు. తాను మొదటి నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోడీ విధానాలను వ్యతిరేకిస్తున్నందువల్ల ప్రభుత్వం తనపై కక్ష కట్టిందని కేజ్రీవాల్ ఆరోపిస్తున్నారు. దేశంలో పలు రాష్ట్రాల్లో పార్లమెంటరీ కార్యదర్శుల నియామకాలు జరిగినా, ఆయా పదవులను నిర్వహించిన ఎమ్మెల్యేల సభ్యత్వాలను రద్దు చేయకుండా, తమ పార్టీ ఎమ్మెల్యేలనే అనర్హులుగా ప్రకటించడాన్ని ఆయన కక్ష సాధింపు చర్యకు ఉదాహరణగా పేర్కొంటున్నారు. ఆయన ఆరోపణ అలా ఉంచితే, పార్లమెంటరీ కార్యదర్శులనియామకం అనేది రాజ్యాంగ విరుద్ధమనేది వివిధ హైకోర్టులు ఇచ్చిన తీర్పులను బట్టి స్పష్టం అవుతోంది. లాభదాయకమైన పదవి అనే అంశంపై రాజ్యాంగంలో స్పష్టత లేకపోవడం వల్లే ఈ వివాదం పదే పదే తెరమీదికి వస్తోంది. జీతాలు, అలవెన్సులు తీసుకోకపోయినా, ప్రభుత్వ సౌకర్యాలన్నింటినీ పార్లమెంటరీ కార్యదర్శులు వినియోగించుకుంటున్నారు కనుక,అది లాభదాయకమైనదేనని ప్రత్యర్థులు వాదిస్తున్నారు. జాతీయ స్థాయిలో ఈ అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో ఆప్ ఎమ్మెల్యేల పై వేటు కు కేంద్ర ఎన్నికల సంఘం సిఫార్సు చేయడానికి ముందు,దీనిపై అన్ని స్థాయిల్లో అందరినీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ సంప్రదించడం కోసమే ఇంత సమయం తీసుకున్నట్టు ప్రభుత్వం ఇచ్చిన వివరణ సహేతుకంగానే కనిపిస్తోంది. అయితే,చీఫ్ ఎలక్షన్ కమిషనర్ పదవీ విరమణ చేయడానికి మూడు రోజుల ముందు రాష్ట్రపతికి సిఫార్సు చేయడం,ఆయన వెంటనే ఆమోదించడం వంటి తతంగాలన్నీ చకచకా జరిగిపోవడాన్ని బిజేపీయేతర పార్టీలన్నీ రాజకీయ కోణం నుంచే చూస్తున్నాయి.పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి,తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ కేజ్రీవాల్‌కి మద్దతు ప్రకటించారు.ఈ వివాదంపై సర్వోన్నత న్యాయస్థానంలో సవాల్ చేసేందుకు కేజ్రీవాల్ తన అంతరంగికులతో సంప్రదింపులు జరుపుతున్నారు. లాభదాయకమైన పదవిపై రాజ్యాంగంలో స్పష్టమైన నిర్వచనంఇచ్చి ఉంటే ఇంత గందరగోళం జరిగి ఉండేదికాదు.

మంచి మాట

అందరూ తనలాగే ధూర్తులు అనుకుని
అందర్నీ ద్వేషించేవాడే నిరాశావాది.
● **జార్జ్ బెర్నార్డ్ షా**

తపన.. కార్యదీక్ష వెరసి చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి పట్టుదల చూస్తుంటే తాననుకున్నది ఎలాగైనా సాధించాలన్న తపన కనిపిస్తోంది. విమర్శలు పెరుగుతున్న కొద్దీ ఆయనలో కార్యదీక్ష మరింత రగులుతోంది. ఎన్ని అడ్డంకులు ఎదురవుతున్నా సరే తాను నమ్మిన దాన్ని సాకారం చేసి ఫలితాలను సామాన్యుడికి అందించాలన్నదే ఆయన ఏకైక లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఇందుకు ఎదురవుతున్న ప్రతికూలాంశాలను ఆయన గమనిస్తున్నా, గత చేదు అనుభవాలు వెన్నాడుతున్నా ఆయన వెరవడం లేదు. ఇందుకు కారణం ఉంది. ప్రపంచం మొత్తం సాంకేతికత ఇరుసు మీదే సాగుతోందని ఆయన 90వ దశాబ్దంలోనే గ్రహించారు. ఆర్థిక సంస్కరణలను పూర్తిగా ఒంటబట్టించుకున్న అతి కొద్దిమంది ఆర్థిక, రాజకీయవేత్తలలో ఆయన ఒకరన్నది నిర్వివాదాంశం. ఆయన అప్పుడే 2020 విజన్‌ను ఆవిష్కరించుకున్నారు. మొదటిసారి అధికారంలోకి వచ్చిన సందర్భం నుంచే దాన్ని తెరకెక్కించారు. సాంకేతిక ఆలోచనలతో సాగుతున్న ఆయనను టెక్ బాబుగా ఎద్దేవా చేశారు కూడా. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సమస్యలు ఎన్ని ఉన్నా, అన్నిటికీ పరిష్కారం ఐటీ మాత్రమేనని ఆయన ప్రగాఢంగా నమ్మారు. దాంతో ఆయన ఎవరి మాటనూ వినలేదు... చివరకు రాష్ట్రానికి వెన్నెముక అయిన వ్యవసాయ రంగాన్ని కూడా పక్కన పెట్టేశారు. ప్రతి అంశాన్నీ సాంకేతిక కోణంలోనే చూడడం మొదలెట్టారు. విద్యుత్, సాగునీటి రంగాల్లో సంక్షోభం తలెత్తింది. దీనికితోడు వరుసగా కరవు. అంతే... ఆయన 2004లో అధికారం కోల్పోయారు. నాటి ప్రతిపక్షనేత వైఎస్ రాజశేఖరరెడ్డి సరిగ్గా బాబు వదిలేసిన అంశాలనే భుజానవేసుకున్నారు. సంక్షుభిత విద్యుత్, వ్యవసాయ రంగాలపైనే ప్రధానంగా దృష్టి సారించారు. జలయజ్ఞంతో పాటు ఆరోగ్యశ్రీ వంటి పథకాలతో జనాన్ని ముఖ్యంగా రైతాంగంతో పాటు బీదబిక్కీకి ఆపద్బంధువులానే కనిపించారు. జలయజ్ఞం, ఆరోగ్యశ్రీ, ఫీజుల రీయింబర్స్‌మెంట్ వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. దీంతో జనం ఆయనకు బ్రహ్మరథం పట్టారు. చంద్రబాబు విజన్ 2020ని ట్రాష్‌గా కాంగ్రెస్ నేతలు కొట్టేయగా, జనం కూడా పట్టించుకోలేదు. అయితే, సరిగ్గా అప్పటి నుంచే చంద్రబాబు నాటిన మొక్కలు పెరిగి వృక్షాలై ఫలసాయం మొదలైంది. తొలి ఫలం సంపద పెరుగుదల! ఇది సామాన్యుడికి అంత తేలిగ్గా అర్థంకాని విషయం. అయితే, రాజశేఖరరెడ్డి దీన్ని గ్రహించిన తొట్ట తొలి వ్యక్తి! ఆర్థిక సంస్కరణలతో పెరుగుతున్న, పెరిగిన సంపదను తన పథకాలకు ఆయన బ్రహ్మాండంగా వినియోగించుకున్నారు. ఆయన జలయజ్ఞాన్ని అఖండంగా నిర్వహించారు. ఎన్నో సాగునీటి ప్రాజెక్టులకు బీజం పడింది. ఎవరెన్ని విమర్శలు చేసినా కొన్ని దాదాపు 70 శాతం వరకూ కూడా పూర్తయ్యాయి కూడా. చంద్రబాబు విద్యుత్ సంస్కరణలు, హైటెక్ హంగులు కూడా అప్పటికి కార్యరూపం దాల్చాయి. అటు సేద్యపు రంగం, ఇటు సాంకేతిక రంగంలో స్పష్టమైన అభివృద్ధి జనానికి కనిపించడం మొదలైంది. దీనికితోడు అడుగుకొకటిగా స్థాపించిన చంద్రబాబు ఇంజినీరింగ్ కళాశాలలు, రాజశేఖరరెడ్డి ఇస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో




నవ ఇంజినీర్ల విస్ఫోటం జరిగింది. అమీర్‌పేట్ నుంచి అమెరికా వరకూ వారిదే హవా. గ్రామీణ యువత పట్టణబాట పట్టారు. నగరీకరణ విపరీతంగా పెరిగింది. దీంతో ఉపాధి, సేవా రంగాలు విస్తరించాయి. రాష్ట్ర ఆదాయం పెరిగింది. వడ్డీ రహిత రుణాల వంటి పథకాలను రాజశేఖరరెడ్డి మరిన్ని పెంచారు. ధనయజ్ఞం జరుగుతోందని, తాను నాటిన మొక్కల ఫలాలు రాజశేఖరరెడ్డి ఆరగిస్తున్నారని చంద్రబాబు ఎంత గగ్గోలు పెట్టినా జనం వినలేదు... పట్టించుకోలేదు. రెండోసారి మళ్లీ రాజశేఖర రెడ్డి అధికారంలోకి వచ్చారు. అయితే, దురదృష్టవశాత్తూ ఆయన ఆకస్మిక మరణం ఉమ్మడి రాష్ట్ర రాజకీయాలు, భవిష్యత్తును ఊహించని మలుపు తిప్పింది. ఆ తర్వాత ముఖ్యమంత్రులు మారడం, రాష్ట్ర విభజన అనివార్యంగా జరిగిపోయాయి. తెలంగాణ రాష్ట్రంలో అటు చంద్రబాబు నాయుడు హైటెక్ ఫలాలు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలబడగా, రాజశేఖరరెడ్డి జలయజ్ఞం ప్రయోజనాలను కూడా ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు చాలా తెలివిగా తనకు అనుకూలంగా మలుచుకున్నారు. దాదాపు అన్ని జలయజ్ఞం పనులపై రాజశేఖరరెడ్డి గుర్తులను చెరిపేసి తనదైన విశిష్టముద్రలను వేసుకున్నారు. అభినవ చాణక్యతను ఆయన దిగ్విజయంగా ప్రదర్శించి జనాన్ని మెప్పించారు. సందేహమే లేదు... ఇందుకు రాజకీయంగా ఆయన్ని అభినందించాల్సిందే. ప్రతిపక్షాలు ఆయన్ని నిలువరించడంలో ఎక్కడా కనీస ప్రతిఘటన కూడా చూపలేకపోయాయి.

ఇక విభజిత ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే... తన విజన్ ఆకాశమార్గం పట్టడం వల్లే సామాన్య జనానికి ముఖ్యంగా రైతాంగం, తన మానసిక పుత్రికలైన డ్వాక్రా సంఘాలను కూడా ఆకట్టుకోలేదని ఉమ్మడి రాష్ట్ర విపక్ష నేతగా చంద్రబాబు గ్రహించగలిగారు. భవిష్యత్ భవంతికి పునాదులు వేయడంతో పాటు వర్తమాన గుడిసెకు కనీసం కప్పు ఉండాలని జనం కోరుకుంటున్నారని అర్థం చేసుకున్నారు. తానే స్వయంగా చెప్పుకుంటున్నట్టు ఆయన నిత్య విద్యార్థి. వెంటనే దిద్దుబాటు చర్యలకు దిగారు. తన ఆకాశమార్గాన్ని భువికి దించారు. సాంకేతికత జనజీవనంతో బాగా పెనవేసుకుపోతోందని ఆయన ఆనాడే గ్రహించగా, అది అక్షరసత్యమైంది. అరచేతిలో స్మార్ట్ ఫోన్ కూడా తనలో భాగమేనన్న స్థాయికి సామాన్యుడు వచ్చేశాడు. దీంతో నాడు చంద్రబాబు చెప్పినవన్నీ జనానికి సులువుగా అర్థమవుతున్నాయి. దీంతో ఇప్పుడు చంద్రబాబు పని మరింత తేలికైంది. సాగునీటి రంగంలో కూడా ఆయన సాంకేతికతను వినియోగించుకుంటున్నారు. ముందస్తు వ్యూహాలతో కదిలారు. ఎంతగా ఆర్థిక లోటు ఉన్నా, ఐటీతోనే భవిష్యత్ ఉంటుందని మరింత బలంగా నమ్మారు. అందుకు తగ్గట్టుగానే ప్రణాళికలు సాగుతున్నాయి. మరో వంక, విద్యుత్, వ్యవసాయ రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో సవాళ్లను ఆయన ముందుగానే అంచనా వేయగలిగారు. మిగులు విద్యుత్ ఎలాగైతేనేం సాధించారు. అలాగే, పట్టిసీమ అనే జలాస్త్రాన్ని దిగ్విజయంగా సంధించారు. గత మూడేళ్లుగా వర్షపాతం లోటు ఉన్నా, కృష్ణమ్మ పారకపోయినా డెల్టాకు సాగు నీరందించారు. ఎంతోకొంత శ్రీశైలం ఎగువ నుంచి కరువు సీమకు నీరందించారు. దాదాపు రెండు దశాబ్దాలుగా నీటి చుక్క కనిపించని సీమ చెరువులు నేడు జలకళతో ఉత్సవశోభ కనిపిస్తున్నాయి. భూగర్భ నీటి నిల్వలు అమాంతం పెరిగాయి. రైతులు ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారంటే అతిశయోక్తి లేదు.. ఇక పోలవరం సాకారమైతే రైతాంగం మదిలో చంద్రబాబు శాశ్వత స్థానం సంపాదించుకున్నట్టే. అయితే, ఇదంతా నాణేనికి ఒకవైపు! మరో వైపు చూస్తే... ఇంకా అనేక సమస్యలతో రాష్ట్ర ప్రజానీకం గోస పెడుతోంది. అసంతృప్తి ఎంత శాతం వ్యక్తమవుతోందన్నది అసలు ప్రశ్న! డెల్టా రైతుని అధిక శాతం సంతృప్తి పరిచినా, ఇంకా చివరి భూములకు నీరందడం లేదు. మెట్ట రైతుల పరిస్థితి కూడా ఆశించిన స్థాయిలో మెరుగుపడలేదు. వాణిజ్య పంటలకు గిట్టుబాటు ధరల్లేవు... మార్కెటింగ్ వ్యవస్థ అస్తవ్యస్తం. బీమా గగన కుసుమం. సబ్సిడీలు అందరికీ అందడం లేదన్నది కూడా అంతే వాస్తవం. రైతు రుణాలు పూర్తిగా మాఫీ చేశామని చెబుతున్నారు. ఎంతమందికి ఇంకా రుణ మాఫీ జరగలేదు అన్నది మాత్రం వెల్లడి కానివ్వడం లేదు. అదేవిధంగా డ్వాక్రా, చేనేత రుణాలు కూడా. నివురుగప్పిన నిప్పులా అసంతృప్తి రగులుతూనే ఉంది. రేషన్, పింఛన్ల విషయంలోనూ అంతే. తాను కోరుకున్నది అందితే మరో కోరిక ఉత్పన్నం కావడం సహజం.వృద్ధాప్య, దివ్యాంగుల విషయంలో దీన్ని నూటికి నూరుపాళ్లు అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అది ప్రభుత్వాల సామాజిక బాధ్యత కూడా. అలాగే, వేలాది కోట్లు విద్యారంగానికి కేటాయిస్తున్నా వాస్తవ లబ్ది జనానికి చేరుతోందా అన్న అంశంపై మరింతగా లోతుగా అధ్యయనం చేయాలి. హాజరు కోసం సాంకేతికతను ఉపయోగిస్తే సరిపోదు.. తమ పిల్లల్ని బడికి పంపిస్తే భవిష్యత్ బాగుంటుందనే విషయం తల్లితండ్రులకు తెలుసు. కాని, భవిష్యత్ కంటే భుక్తి గడవడం ముఖ్యం అనే స్థాయిలోనే అధికశాతం గ్రామీణులు ఉన్నారని, వారిలో అసంతృప్తి స్థాయి 50 శాతానికంటే అధికంగానే ఉన్నదన్నది వాస్తవం. విద్యుత్, వ్యవసాయ రంగాల్లోని ప్రధాన సమస్యలకు విరుగుడు మందులు వేసి సస్యరక్షణ సాధించినా, అనుబంధ రంగాల్లో సమస్యలు చిల్లలు వేసి ఏపుగా పెరుగుతున్నాయి. ఇవే రేపటి ఎన్నికల్లో ప్రధాన విపక్షం లేదా విపక్షాలకు ప్రధాన ఆయుధాలు. ఇక ప్రభుత్వానికి కాడెద్దులుగా వ్యవహరించాల్సిన మంత్రులు, ఎమ్మెల్యేలకు అధికారులకు మధ్య పొసగడం లేదు. తాము నిమిత్తమాత్రులమై పోయామన్న భావన అటు మంత్రుల్లోనూ, అధికార ఎమ్మెల్యేల్లోనూ నెలకొని ఉంది. అధికారులు లెక్కచేయడం లేదన్న అసంతృప్తి ఎక్కువగానే ఉంది. మరోపక్క అధికారగణం జోలికివెళితే ఏం జరుగుతుందో 2004లోనే గ్రహించిన చంద్రబాబు వారిపట్ల అవసరానికి మించి మెతకవైఖరిని ప్రదర్శిస్తున్నారు. మరోపక్క అధికారులకు పెత్తనం ఇస్తే మరి మేమెందుకని మంత్రి ఆదినారాయణ రెడ్డి ఏకంగా కలెక్టర్ల సదస్సులోనే చంద్రబాబును ప్రశ్నించడం కొసమెరుపు. రియల్‌టైమ్ గవర్నెన్స్ రంగుల్లో కనిపిస్తుంటే, క్షేత్రస్థాయిలో వెలిసిపోతున్న అంశాలు కంటికి గోచరించకపోతే?! నిత్య విద్యార్థి తెలుసుకోవాలి మరి!

● **గుళ్లపల్లి దివ్వాబాబు, 949 2424 829**

కాంగ్రెస్.. బీజేపీ భవిత ఏమిటి?

కఠోర సత్యాలు



పెంటపాటి పుల్లారావు
రాజకీయ విశ్లేషకులు, న్యూఢిల్లీ
ppr193@gmail.com

గుజరాత్ ఎన్నికల ఫలితాలు వెలువడగానే, తాను పునరుజ్జీవన మార్గంలో ఉన్నాననీ, అధికారంలోకి వస్తాననీ కాంగ్రెస్ పార్టీ ప్రకటించుకుంది. కేంద్రంలో గానీ, వివిధ రాష్ట్రాలలో గానీ ఆ పార్టీ 70 సంవత్సరాల పాటు అధికారాన్ని చెలాయించింది. కేంద్రంలో అధికారంలో లేని సమయంలో సైతం కొన్ని రాష్ట్రాలలో ప్రభుత్వాలకు నాయకత్వం వహించింది. ప్రస్తుతం పంజాబ్, కర్ణాటకలలో మాత్రమే రాజ్యమేలుతోంది. 15 రాష్ట్రాలలో ప్రతిపక్ష పాత్ర పోషిస్తోంది. ఆ పార్టీకి విశ్వసనీయత ఉందనడానికి ఇది చాలు. 2014లో 542మంది సభ్యులున్న లోక్‌సభలో కేవలం 44 సీట్లను గెలుచుకోగలిగింది. ఇది ఆ పార్టీకి తీరని దెబ్బ. అయినప్పటికీ తాను కోలుకుంటానని చెబుతోంది. తనకు రాహుల్ గాంధీ రూపంలో కొత్త అధ్యక్షుడు దొరికాడని సంబరపడుతోంది. ఏది ఎలా ఉన్నా భవిష్యత్తును అంచనా వేయడం చాలా కష్టం. భవిష్యత్తు అంచనా వేయలేనంత ఊహించలేనిదని 200 ఏళ్ళ క్రితం ప్రాఢన్ అనే ఫ్రెంచ్ ఆర్థికవేత్త అన్న మాటలు ఈ సందర్భంగా గుర్తుతెచ్చుకోవాలి. 2014 ఫిబ్రవరిలో కాదు.. మేలో కూడా నరేంద్ర మోడీ ఇంత భారీ ఆధిక్యతతో అధికారంలోకి వస్తారని ఎవరు ఊహించారు?

కాంగ్రెస్ పార్టీకి లాభాలు

కాంగ్రెస్ పార్టీకి ఎన్నో ఆస్థులున్నాయి. వాటితో పాటు బలమైన నాయకులున్నారు. దేశవ్యాప్తంగా వీరు వ్యాపించి ఉన్నారు. 70ఏళ్ళు పైగా అధికారంలో ఉండడం వల్ల వేలాదిమంది మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర నాయకులు పార్టీ సొంతం. పాత్రికేయ నిపుణులు, పాత్రికేయులు, న్యాయవాదులు, వాణిజ్యవేత్తలు, అధికారులు కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా అనుకూలంగా మెలిగారు. ఇప్పుడు పార్టీ అధికారంలో లేదు కాబట్టి, వారంతా దూరంగా జరిగి ఉండవచ్చు, పార్టీ అధికారంలోకి వస్తుందని చిన్నపాటి సూచన కనిపించినా వీరంతా మళ్ళీ చురుగ్గా వ్యవహరించడం ప్రారంభిస్తారు. చేయాల్సిందల్లా తాను అధికారంలోకి రాగలనన్న నమ్మకాన్ని కలిగించడమే. ఈ రకమైన ప్రచారాన్ని చేయించుకోవడంలో ఆయన తెలివిగా వ్యవహరించగలగాలి.

మునిగిపోయే ఓడలోకి గానీ, దగ్గరగా గానీ ఎవరూ వెళ్ళరు. ఇది మానవ నైజం. పార్టీ విషయం అలా కాదు. అధికారంలోకి వచ్చే అవకాశముందని కొద్దిపాటి సూచనలు కనిపించినా కార్యకర్తలు పనిచేయడం ప్రారంభిస్తారు. విరాళాలిస్తారు. భవిష్యత్తులో లాభాల కోసం పెట్టుబడులూ పెడతారు. గుజరాత్ ఎన్నికలలో కాంగ్రెస్ చేసిందిదే. నెలకొన్న గట్టి పోటీ మిగిలిన ప్రతిపక్షాలనూ ఆలోచింపచేసింది. 2019లో మోడీ లేదా బీజేపీ ఓడిపోతారనేదే ఆ సందేహం. ఇదే ప్రతి ఒక్కరి మదిలోనూ మెదిలింది. అందుకే కాంగ్రెస్ ఇప్పుడు మరో అవకాశాన్ని అందిపుచ్చుకోవడానికి సిద్ధమవుతోంది. కర్ణాటక, రాజస్థాన్, మధ్య ప్రదేశ్, చత్తీస్‌ఘర్ రాష్ట్రాలలో రెండు కీలకమైన రాష్ట్రాలలో కాంగ్రెస్ బీజేపీ మాత్రమే ముఖాముఖి తలపడుతున్నాయి. ఇది కాంగ్రెస్‌కు కలిసొచ్చే అంశం. కాంగ్రెస్‌కు కర్ణాటకలో గెలిస్తే చాలు, బీజేపీ మాత్రం మిగిలిన మూడు రాష్ట్రాలు అంటే రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘర్‌లలో తప్పని సరిగా విజయకేతనం ఎగరేయాల్సుంది. భారతీయ జనతా పార్టీకి ఇది అతి పెద్ద సవాలు.

పంజాబ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌ఘర్, గుజరాత్, అసోం, మధ్య ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఒక పార్టీయే ప్రత్యర్థిగా ఉండడం కాంగ్రెస్‌కు కలిసొచ్చే అంశం. మహారాష్ట్ర, కర్ణాటకలలో కాంగ్రెస్ మిత్రపక్షాలు బీజేపీతో తలపడుతున్నాయి. కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీకి స్థానమే లేదు. ఈ రెండు రాష్ట్రాలలోని 62 ఎంపీ స్థానాలలో బీజేపీ వ్యతిరేక పార్టీలే 60కి పైగా స్థానాలను గెలుచుకున్నాయి. అంటే ఇక్కడి ప్రజలకు ప్రత్యామ్నాయమేదీ కనిపించడం లేదు. బీజేపీకీ లేదా కాంగ్రెస్‌కీ మాత్రమే వారు ఓటు వేయగలరు. అనేక రాష్ట్రాలలో బీజేపీ వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో నాలుగు రాష్ట్రాల ఎన్నికలలో గెలుపు గుర్రంపై ఎక్కడం బీజేపీకి చాలా కష్టం.

జాతీయ మీడియాలోని ఒక వర్గం కాంగ్రెస్ పార్టీకి కొమ్ము కాస్తోంది. ఇందుకు కారణాలు అనేకమున్నాయి. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వాలు మీడియాతో సంబంధాలను నెరపడంలో అలక్ష్యత్వాన్ని ప్రదర్శించడం ఇందులో ఒకటి. ఈ మీడియా కాంగ్రెస్‌నూ, రాహుల్ గాంధీనీ ముందుకు తీసుకెళ్ళడమే



ప్రధాన ధ్యేయంగా పెట్టుకున్నాయి. నిజానికి అది ఫలితాన్ని కూడా ఇచ్చింది. మరోవంక, బీజేపీ సోషల్ మీడియా పద్ధతులను కాంగ్రెస్ మక్కీకి మక్కీగా అనుసరించింది. సామాజిక మాధ్యమంపైనే ఎక్కువ ఖర్చుచేస్తోంది. సామాజిక మాధ్యమంపై బీజేపీకున్న ఆధిపత్యం ఇక పోయినట్టే.

బీజేపీ తప్పిదాలు కాంగ్రెస్ పునరుత్థానానికి తోడ్పడుతున్నాయి. కాంగ్రెస్ తనకోసం తాను ఎంతగా తాపత్రయపడినా కానిది, బీజేపీ తప్పిదాల వల్ల అయ్యింది. మెరుగ్గాలేని పరిపాలన, తప్పులు కాంగ్రెస్‌కు అతి పెద్ద అవకాశాన్ని చేతికి అందించాయి. నోట్ బందీ ద్వారా దిద్దుకోలేని తప్పునకు బీజేపీ పాల్పడింది. బీజేపీకి ఇది మరణశాసనం లాంటిది. ఇలాంటి తప్పునకు బీజేపీ పాల్పడి ఉండకూడదు. ప్రస్తుతం బీజేపీ నాయకులెవరూ జీఎస్టీ లేదా నోట్ బందీ ప్రయోజనాల గురించి మాట్లాడడం లేదు. బలహీనమైన మంత్రులు, సమంజసం కాని అధికారుల నియామకాలూ ప్రభుత్వ ప్రతిష్టను మంటకలిపేశాయి. సొంత ఆర్థిక మంత్రిత్వ శాఖే మోడీని ప్రమాదంలోకి నెట్టేసింది. దీనివల్ల కాంగ్రెస్ పార్టీకి నష్టమేమీ లేదు.

ఆర్థిక మంత్రి వైఫల్యం: ఏ ప్రభుత్వంలోనైనా ఆర్థిక మంత్రి చాలా కీలమైన వ్యక్తి. పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు మన్మోహన్‌సింగ్ ఆర్థిక మంత్రిగా ఉండేవారు. పీవీ ప్రారంభించిన ఆర్థిక సంస్కరణలను అమలు చేసి, మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చారు. ఆ తర్వాత యూపీఏ హయాంలో ప్రధానమంత్రి పదవి చేపట్టి పదేళ్ళ పాటు ఆ పదవిలో కొనసాగారు. వస్తు సేవాపన్ను (జిఎస్‌టి) వ్యవహారంలో అరుణ్ జైట్లీ సమర్థంగా వ్యవహరించలేదు. ఆర్థిక వ్యవస్థ విషయంలోనూ ఆయనపై ఆగ్రహం కలగడానికి అదే కారణం. అరుణ్ జైట్లీ గుజరాత్ నుంచే రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన గుజరాత్ ఎన్నికల ప్రచారంలో ఒక్క రోజున కూడా పాల్గొనలేదు. ఆయన హయాంలో ఆర్థిక వ్యవస్థ బాగా దెబ్బతింది. ఉద్యోగాలు పోయాయి. ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేసిన ఘోరమైన తప్పిదం ఇది. బలహీన మంత్రివర్గం మృతప్రాయమైనది. విషపూరితమైనది.

మోడీ ప్రభుత్వంలో రాజకీయపరమైన లోటు: పూర్వపు కేంద్ర మంత్రివర్గాల్లో కనీసం 15మంది మాజీ ముఖ్యమంత్రులు, పేరొందిన రాజకీయవేత్తలు ఉండేవారు. నరేంద్రమోడీ ప్రభుత్వంలో ఆయన తప్ప సుదీర్ఘ అనుభవం ఉన్న మాజీ ముఖ్యమంత్రులు ఎవరూ లేరు. హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పదకొండు మాసాల పాటు, విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ రెండు నెలలపాటు ముఖ్యమంత్రులుగా పనిచేశారు. ప్రతిభ గల రాజకీయ వేత్తలెవరూ లేరు. సీనియర్ మంత్రుల్లో చాలామంది బీజేపీ ప్రతినిధులుగానే వ్యవహరిస్తున్నారు. వారెవరికీ రాజకీయంగా బలమైన పునాదులు లేవు. ప్రజా జీవితం నుంచి దాదాపు దూరమైనవారే. ఒక్క మాటలో చెప్పాలంటే వారంతా దూదిపింజల వంటి వారే. దీంతో మోడీ ప్రభుత్వంలో పెద్ద అగాధం ఏర్పడింది.

మోడీ,అమిత్ షా: బీజేపీ ఈనాడు దేశంలో అతి పెద్ద రాజకీయ పార్టీ. ఇంత పెద్ద పార్టీకి ప్రచారకర్తలుగా ఇద్దరే ఉన్నారు. ఒకరు ప్రధాని మోడీ, రెండవ వారు పార్టీ అధ్యక్షుడు అమిత్ షా. బీజేపీ ప్రధాన బలహీనత అదే. ఇలాంటి పరిస్థితుల్లో నగరాల్లో ఉన్న వారైతే టెలివిజన్ చానల్స్‌లో బాగా మాట్లాడేందుకు అవకాశం ఉంది. బీజేపీలో ఎదగడానికి ప్రస్తుతం ఎటువంటి అర్హత అవసరం లేదు. అదే మాదిరిగా అన్ని రాజకీయ పార్టీల్లో ఇప్పుడు పార్టీ అధికార ప్రతినిధి పదవి కోసం పెనుగులాట ప్రారంభమైంది. టీవీ షోల్లో కనిపించేందుకు పోటీపడుతున్నారు. ఢిల్లీలో బీజేపీ అధికార ప్రతినిధులుగా వ్యవహరించిన వారంతా కేంద్రమంత్రులయ్యారు, వారంతా రాజ్యసభ సభ్యులుగా మంత్రి పదవులను పొందిన వారే. వీరిలో ఏ ఒక్కరికీ ప్రజల్లో బలం లేదు. ఇదేమీ కొత్త ఫార్ములా కాదు. గతంలో కాంగ్రెస్ అనుసరించిందే.

ఉద్యోగాలు, ఆర్థిక వ్యవస్థ: మోడీ అధికారంలోకి వచ్చేనాటికి అంతర్జాతీయ చమురు మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధర బాగా తక్కువగా ఉంది. ఆ వాతావరణాన్ని అనుకూలంగా మలుచుకోవడంలో మోడీ విఫలమయ్యారు. 2022నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని మోడీ పదే పదే చెబుతున్నారు. ఇంతవరకూ చేసిందేమీ లేదు. వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉంది. యువత ఉద్యోగాల కోసం వీధుల్లోకి వస్తోంది. నిజానికి ఈ రెండు రంగాల్లో పరిస్థితులు చక్కదిద్దడం పెద్ద కష్టమేమీ కాదు. సమస్య తీవ్రతను అర్థం చేసుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది. మోడీ ప్రభుత్వ పెద్ద బలహీనత ఇదే.

కాంగ్రెస్ పుంజుకుంటుందా?: 2019లో అధికారాన్ని పొందలేమన్న సంగతి కాంగ్రెస్ నాయకులకు తెలుసు. బీజేపీ 2004 నుంచి 2014వరకూ పదేళ్ళ పాటు ప్రతిపక్షంలో ఉంది. కాంగ్రెస్ తాను తిరిగి పుంజుకోగలనన్న అభిప్రాయాన్ని జనంలో కలిగించాలి. వాణిజ్యవేత్తలు, ఇతర రంగాలకు చెందిన వారి మద్దతు కూడగట్టాలి. తన ఉనికిని కాపాడుకునేందుకు కాంగ్రెస్ మీడియాపై దృష్టిని కేంద్రీకరించింది. ఫొటోలు దిగడానికి రోడ్డుషోలు సులభమైనమార్గం. ప్రజలను తరలించాల్సిన అవసరం లేదు. ఇకపైన కాంగ్రెస్ మరిన్ని రోడ్డు షోలనూ, టీవీ గోష్టుల్లోనూ కనిపించవచ్చు. కొత్త వివాదాలను, సమస్యలను సృష్టించవచ్చు.

బీజేపీకి ప్రత్యామ్నాయం కాగలనని నిరూపించేందుకు కాంగ్రెస్‌కు ఇప్పుడు మిత్రులు కావాలి. మహారాష్ట్రలో మాజీ రక్షణమంత్రి శరద్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ), కర్నాటకలో మాజీ ప్రధాని దేవెగౌడ నేతృత్వంలోని జనతాదళ్ (ఎస్), ఒడిషాలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజూ జనతాదళ్ (బీజేడి)లను మిత్ర పక్షాలుగా చేర్చుకునేందుకు కాంగ్రెస్ తీవ్రంగా కృషి చేస్తోంది. ఈ మూడు పార్టీలను తన శిబిరంలోకి ఆకర్షించగలిగితే కాంగ్రెస్ ఇంకేమీ చేయనవసరం లేదు. ఈ మూడు రాష్ట్రాల్లో బీజేపీకి చెప్పుకోదగిన బలం లేదు. 2014కి ముందు బీజేపీ ఇతర రాష్ట్రాల నాయకులను దిగుమతి చేసుకునేది. ఇప్పటికీ స్థానిక నాయకుల్లో పేరున్న వారెవరూ లేరు. తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి కూడా అంతే, 2014ఎన్నికల తర్వాత ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణల్లో పేరున్న నాయకులెవరూ బీజేపీలో చేరలేదు. ఎన్నికల ముందు చేరిన వారంతా ఇప్పుడు జారుకుంటున్నారు. కర్నాటకలో పరిస్థితి ఇందుకు భిన్నం. అక్కడ బీజేపీలో పదవీకాంక్షఉన్న నాయకులు ఎక్కువమంది ఉన్నారు. మాజీ ముఖ్యమంత్రి యెడ్యూరప్ప, డజన్ల కొద్దీ మాజీ ముఖ్యమంత్రులు, మాజీ మంత్రులు ఉన్నారు. దీంతో అక్కడ బీజేపీని ఎదుర్కొనడంలో ప్రస్తుత ముఖ్యమంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సిద్దరామయ్య పని సులభమైంది. ఆయన పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మీద కూడా ఆధారపడటం లేదు. పాత ముఖాలు జనానికి రోత పుట్టిస్తున్నాయి. బీజేపీలో పాత నాయకులు తప్పుకునేట్టు చేయడంలో బీజేపీ కేంద్ర నాయకత్వం విఫలమవుతోంది. వీరంతా 1983 నుంచి కొనసాగుతున్న వారే. మహారాష్ట్ర, కర్నాటక, ఒడిషాల్లో కాంగ్రెస్ కొత్త మిత్రులను సంపాదించుకోకుండా చూడటం ప్రస్తుతం బీజేపీ ముందున్న సవాల్. రాజకీయ పరిభాషలో చెప్పాలంటే, శత్రువుని జయించడం కాదు, శత్రువు గెలుపొందకుండా చూడటం ముఖ్యం. బీజేపీ గెలుపొందడానికి లేదా ఎందుకు ఓడిపోతుందో చెప్పడానికి విశ్లేషకులు, రచయితలు చెప్పేందుకు ఎన్నయినా కారణాలు ఉంటాయి. కానీ, చివరికి కొన్ని కారణాలు మాత్రమే కనిపిస్తాయి. కాంగ్రెస్ వివిధ కులాల నాయకులపై కాంగ్రెస్ ఎక్కువగా ఆధారపడుతోంది. వారి వల్ల కాంగ్రెస్‌కి నష్టమే కానీ, లాభం లేదు.

ఈ కింది చర్యలు తీసుకుంటే కాంగ్రెస్‌ని బీజేపీ నిలువరించవచ్చు

ఎ) ఒడిషాలో నవీన్ పట్నాయక్‌తోనూ, కర్నాటకలో దేవెగౌడతోనూ పొత్తు కుదుర్చుకోవాలి. మహారాష్ట్రలో శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీని చీల్చాలి. పవార్ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏలో చేరకపోవచ్చు.

బి) ఆర్థికమంత్రి కొత్తగా జనంపై భారం మోపకుండా చూడాలి. కొత్తగా పన్నులు వేయకుండా చూడాలి.

సి) ఎన్నికలు జరగనున్న రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గడ్‌లలో అధికారాన్ని నిలబెట్టుకోవాలి.

డి) చమురు ధరలపై కన్నేసి ఉంచాలి. 2015 తర్వాత మొదటిసారిగా క్రూడ్ ధర బ్యారల్‌కు 80 డాలర్లు దాటింది. చమురు ధర పెరిగితే మోడీ,ఆయన ప్రభుత్వం బలహీన పడుతుంది. కొత్తగా ఉద్యోగాలు సృష్టించలేదు. ధరలను అదుపు చేయలేదు. 2014 తర్వాత ఆర్థిక వ్యవస్థ నిర్వహణ లోపం వల్ల ఎన్నో నష్టాలు వాటిల్లాయి.

ఇ) అమిత్ షా రాజకీయాల నిర్వహణలో ఆరితేరిన వాడు. రాజకీయ నాయకులు ఆయన మాట నిలబెట్టుకుంటారని గౌరవిస్తారు. ఆయనపై ఇప్పటికే భారం పెరిగింది. అన్నింటిపైనా ఆయన దృష్టిని కేంద్రీకరించలేరు.

ఎప్పటికప్పుడు పుట్టుకొచ్చే సమస్యలను పరిష్కరించేందుకు బీజేపీలో కొత్త నాయకులు తయారుకావాలి, మోడీయే ఇప్పటికీ జనాదరణ కలిగిన నాయకుడు. ఆయన ఉక్కిరిబిక్కిరవుతున్నారు. తడబడుతున్నారు. 2019లో జరిగేవి ఒక ముఖ్యమంత్రికి, ఒక రాష్ట్రానికి సంబంధించిన ఎన్నికలు కావు. ఈరోజుకి కూడా దేశ ప్రజలు మోడీ నాయకత్వాన్నే కోరుకుంటున్నారు. ఆయన విదేశాల్లో మన ప్రతిష్టను బాగా పెంచారు. బ్రిటన్ మాజీ ప్రధాని ఒకరు చెప్పినట్టు రాజకీయాల్లో వారం రోజులు సుదీర్ఘ కాలమే. 2019కి ఇంకా 16మాసాల గడువు ఉంది.

జమిలి ఎన్నికలు 2024 వరకు

సాధ్యంకావు

మాజీ సీఈసీ

హైదరాబాద్: దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించడం 2024 సంవత్సరం వరకు సాధ్యంకాకపోవచ్చని మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ టీఎస్ కృష్ణమూర్తి అభిప్రాయపడ్డారు. దేశంలో ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలంటే రాజ్యాంగ సవరణ తప్పనిసరి అని ఆయన తెలియజేశారు. దేశంలో ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలన్నఆలోచన మంచిదే అని..అయితే అందుకోసం కొంత కసరత్తు అవసరమని చెప్పుకొచ్చారు.



ఉప ఎన్నికలకు రెడీ

● పిటీషన్లు కొట్టివేస్తే ఎన్నికలకు సై ● హైకోర్టులో పిటీషన్ ఉపసంహరణ ● అవసరమైతే సుప్రీంకు వెళతాం: కేజ్రీవాల్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: అనర్హత వేటు పడిన ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేలు ఢిల్లీ హైకోర్టు నుంచి తమ పిటీషన్లను ఉపసంహరించుకున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం సిఫారసులను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటీషన్ల స్థానంలో కొత్త పిటీషన్ దాఖలు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీ హైకోర్టు నుంచి తమ పిటీషన్లను వెనక్కి తీసుకున్నారు. ఎన్నికల సంఘం సిఫారసులపై స్టే ఇవ్వాలని తొలుత పిటీషన్ వేయగా, రాష్ట్రపతి 20వ తేదీన అనర్హత వేటు వేయడంతో కొత్త అంశాలతో పిటీషన్లు వేయాలని ఆప్ నిర్ణయం తీసుకుంది. దీనికి హైకోర్టు అనుమతి మంజూరు చేసింది. ఈనెల 19న ఈసీ సిఫారసులపై మధ్యంతరంగా స్టే ఇవ్వాలని కోరగా హైకోర్టు తిరస్కరించింది. కాగా రాష్ట్రపతి ఆమోదం నేపథ్యంలో ఆ ఉత్తర్వులను పూర్తిగా పరిశీలించి మళ్లీ కొత్త పిటీషన్ వేసేందుకు పార్టీ సిద్ధమవుతోంది. అనర్హత వేటు వేస్తూ తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ వ్యతిరేకమని, తమ వాదన వినకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని ఆప్ ఆరోపించింది. అవసరమైతే ఈ విషయంపై తాము సుప్రీంకోర్టుకు కూడా వెళతామని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు.

ఉప ఎన్నికలకు రెడీ అవుతున్న ఆప్

న్యాయస్థానాల్లో పిటీషన్లు కొట్టివేస్తే ఎన్నికలకు సైతం పార్టీ సిద్ధమవుతోంది. అన్ని రాష్ట్రాల్లో పార్లమెంటరీ కార్యదర్శులు కొనసాగుతుండగా తమపైనే అనర్హత వేటు వేయడం రాజకీయ కక్ష్య సాధింపేనని, ఇది రాజ్యాంగ విరుద్ధమని ప్రజల్లోకి వెళ్లాలని భావిస్తున్నారు. 70 సీట్లున్న ఢిల్లీ అసెంబ్లీలో ఆమ్ ఆద్మీ పార్టీకి ప్రస్తుతం 46 మంది ఎమ్మెల్యేలున్నారు. ఉప ఎన్నికలు జరిగే 20 అసెంబ్లీ సీట్లలో ప్రతికూల ఫలితాలు వచ్చినా తమ ప్రభుత్వానికి ఎటువంటి ఢోకా లేదని ఆప్ వర్గాలు చెపుతున్నాయి. అయితే అనర్హత వేటు నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ సీఎం అరవింద్‌కేజ్రీవాల్ రాజీనామా చేయాలని కాంగ్రెస్, బిజెపిలు డిమాండ్ చేస్తున్నాయి.

జస్టిస్ లోయ కేసును లోతుగా పరిశీలించాలి

● వెంటనే పత్రాలు కోర్టుకు సమర్పించాలి
● ఫిబ్రవరి 2కు విచారణ వాయిదా

న్యూఢిల్లీ : స్పెషల్ సీబీఐ జడ్జి లోయ మరణంతో కూడిన అన్ని డాక్యుమెంట్లను లోతుగా విశ్లేషించాలని సుప్రీం నిర్ణయించింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాకు ఈ కేసుతో సంబంధం ఉందంటూ ఆయన పేరు చేర్చడంపై ఓ సీనియర్ న్యాయవాది మండిపడ్డారు. 2014లో సీబీఐ ప్రత్యేక న్యాయ స్థానం న్యాయ మూర్తి బీహెచ్ లోయ మృతి చెందారు. అయితే ఆయన హత్యకు గురయ్యారంటూ లోయ సోదరి, ఇతర కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ కేసులో స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలంటూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు అయింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారిస్తున్నది. దేశ వ్యాప్తంగా లోయ మృతి సంచలనం సృష్టించిందని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేయడంతో పాటు ప్రతీ అంశాన్ని లోతుగా పరిశీలించాలని ధర్మాసనం ఆదేశించింది. దీనికి సంబంధించిన పత్రాలు వెంటనే కోర్టుకు సమర్పించాలని సూచించింది. జస్టిస్ లోయ మృతికి సంబంధించి ముంబై హైకోర్టులో ఉన్న రెండు పెండింగ్ పిటిషన్లను సుప్రీం కోర్టుకు బదిలీ చేస్తున్నట్టు చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా స్పష్టం చేశారు. దేశంలోని ఏ హైకోర్టు కూడా లోయ కేసును విచారించొద్దని, సుప్రీం ధర్మాసనం మాత్రమే పరిశీలిస్తుందని న్యాయమూర్తులు ఎఎ ఖాన్విల్కర్, డీవై చంద్రచూడ్ల చెప్పారు.

భారత్ లాడెన్ అరెస్ట్

● గుజరాత్ పేలుళ్ల సూత్రధారి
● పదేళ్లపాటు అజ్ఞాతవాసంలో ఖురేషి
● సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ నుంచి ఉగ్రవాదిగా

న్యూఢిల్లీ: ఇండియన్ ముజాహిదీన్‌కు చెందిన మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది, గుజరాత్ వరస పేలుళ్ల సూత్రధారి అబ్దుల్ సుభాన్ ఖురేషిని (46) ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేశారు. భారత బిన్‌లాడెన్‌గా పేర్కొనే ఖురేషిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) మోస్ట్ వాంటెడ్ జాబితాలో చేర్చింది. అయితే కొంతకాలంగా ఖురేషి కాసిం అనే పేరుతో ఢిల్లీలో నివసిస్తున్నాడు. 2008 గుజరాత్ పేలుళ్ల సూత్రధారి, సిమి ఇండియన్ ముజాహిదిన్ ఉగ్రవాది అబ్దుల్ సుభాన్ ఖురేషి పదేళ్ల తర్వాత పోలీసులకు చిక్కాడు. మారుపేరుతో అజ్ఞాతంలో ఉంటున్న ఖురేషిని ఢిల్లీ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఢిల్లీ ఘాజీపూర్‌లోని ఓ ఇంట్లో నివసిస్తున్న ఖురేషీని ప్రత్యేక పోలీస్‌దళం అరెస్టు చేసింది. నిషేధిత సిమి సంస్థతో సంబంధాలు కలిగిన ఖురేషి 2008లో గుజరాత్‌లో చోటు చేసుకున్న వరుస పేలుళ్లలో ప్రధాన నిందితుడని పోలీసులు తెలిపారు. ఖురేషి బాంబులు తయారీలో దిట్ట. గుజరాత్‌తో పాటు ఢిల్లీ, బెంగళూరులోనూ ఖురేషి బాంబు దాడులకు పాల్పడినట్టు కేసులు ఉన్నాయి. 2008లో గుజరాత్‌లో భీకర ఉగ్రదాడి జరిగింది. అహ్మదాబాద్, సూరత్‌లో దాదాపు 27 బాంబులను ఉగ్రవాదులు వరుసగా పేల్చి మారణకాండ సృష్టించారు. ఈ ఘటనలో 56మంది ప్రజలు తమ ప్రాణాలు కోల్పోగా 200మందికిపైగా గాయపడ్డారు. 2006లో ముంబై సబర్‌బన్ రైళ్లలో జరిగినదాడిలో సుమారు 200మంది చనిపోయారు. మరో 700మంది గాయపడ్డారు. 2008 జూలై 26న అహ్మదాబాద్‌లో వరుసగా 21బాంబు పేలుళ్లు జరిగాయి. ఒక అమెరికన్ వైఫై నెట్‌వర్క్ ద్వారా మీడియాకు పంపించిన ఈమెయిల్స్‌లో పేలుళ్లకు తనే పాల్పడినట్టు ఖురేషి పేర్కొన్నాడు. దీంతో ఖురేషీ కోసం ఎన్ఐఏ అప్పటినుంచి విస్తృతంగా గాలిస్తోంది. ఢిల్లీ, బెంగళూరు ఉగ్రవాద దాడులతోపాటు 2006లో ముంబై లోకల్ రైలులో బాంబు పేలుళ్లకేసుల్లోనూ ఖురేషి నిందితుడు. ఖురేషీ అరెస్టుతో ఢిల్లీ పోలీసులు, గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్, అహ్మదాబాద్ క్రైంబ్రాంచ్ అప్రమత్తమయ్యాయి.



ఉగ్రవాదిగా మారిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

ఖురేషి ఒకప్పుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఖురేషీ కుటీంబీకులు దశాబ్దాల కిందటే యూపీ నుంచి ముంబైకి వలసవచ్చారు. అతని విద్యాభ్యాసం ముంబైలోనే జరిగింది. కంప్యూటర్ ఇంజినీరింగ్ చదివిన ఖురేషీ పలుసంస్థల్లో టెకీగా పనిచేశాడు. ముంబై మత కలహాల నేపథ్యంలో ఉగ్రవాదంవైపు మరలి మొదట స్టూడెంట్ ఇస్లామిక్ మూవెంట్ ఆఫ్ ఇండియా (సిమి)లో చేరాడు. సాంకేతికంగా మంచి పట్టున్న ఖురేషి అహ్మదాబాద్ వరుస పేలుళ్లకు ఉపయోగించిన బాంబులను అతనే తయారుచేశాడని పోలీసులు తెలిపారు. అనంతరం ఇండియన్ ముజాహిద్దీన్ (ఐఎం) ఉగ్రవాద సంస్థ ఏర్పాటులో కీలక పాత్ర పోషించాడు. అహ్మదాబాద్ పేలుళ్ల తరువాత మాయమైన ఖురేషీ అలియాస్ తౌఖీర్ బంగ్లదేశ్‌లో ఉన్నట్టు 2004 పోలీసులు గుర్తించారు. అంతకముందు నేపాల్, సౌదీ అరేబియా తిరిగినట్టు పోలీసులు కనుగొన్నారు. దీంతో ఇంటర్‌పోల్ ద్వారా అతనిపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయించారు. ఖురేషీ తలపై 4లక్షల బహుమతి కూడా ఉంది. విదేశాల్లో తలదాచుకున్న ఢిల్లీలో పట్టుబడటం సంచలనంగా మారింది. ఢిల్లీ,గుజరాత్, మహారాష్ట్ర పోలీసులు ఖురేషీ కోసం చాన్నాళ్లుగా వెతుకుతున్నారు. ఢిల్లీకి చెందిన స్పెషల్ పోలీసులు ఎట్టకేలకు ఖురేషీని అరెస్టు చేశారు. రిపబ్లిక్ డే ఉత్సవాలకు ముందు ఖురేషి అలియాస్ తౌఖీర్ పట్టుబడటం సంచలనం రేపింది. ఖురేషీ అరెస్టు నేపథ్యంలో రిపబ్లిక్ డే ఉత్సవాల బందోబస్తును కట్టుదిట్టం చేశారు.

మోడీకి అహంకారం ఎక్కువ: హజరే

ముంబై: ప్రధాని నరేంద్ర మోడీకి అహంభావం ఎక్కువగా ఉందని అవినీతి వ్యతిరేక ఉద్యమకారుడు అన్నాహజారే ఆరోపించారు. ప్రధాని మోడీ తాను రాసిన లేఖలకు ఏమాత్రం స్పందించడంలేదన్నారు. సంగ్లీజిల్లాలోని అట్పాడి తెహసీల్‌లో జరిగిన బహిరంగ సభలో అన్నాహజారే ప్రసంగించారు. తాను గత మూడేళ్లలో ప్రధాని మోడీకి 30కిపైగా లేఖలు రాశానని అన్నాహజారే తెలిపారు. ఒక్కలేఖకు కూడా మోడీ స్పందించలేదన్నారు. ప్రధానమంత్రి అయ్యాక మోడీకి అహం బాగా పెరిగిందని అన్నా హజారే విమర్శించారు. లోక్‌పాల్, లోకాయుక్తా నియామకం, రైతులకు 5వేల పెన్షన్, పంటలకు అధిక రేట్లు తదితర డిమాండ్‌లతో అన్నా మరోసారి ఉద్యమం చేపట్టబోతున్నారు. ఈలోగా మూడు ర్యాలీలను నిర్వహిస్తాను అని చెప్పగా మొదటి ర్యాలీ సంగ్లీజిల్లాలోని అట్పాడి తెహసీల్‌లో నిర్వహించారు. మార్చి 23 నుంచి ఢిల్లీలో మరో విడత ఆందోళన కార్యక్రమం ప్రారంభించనున్నట్టు ప్రకటించిన సంగతి విదితమే. అన్నాహజారే సభ్యుల అనర్హత విషయంపై స్పందించేందుకు అన్నాహజారే విముఖత వ్యక్తం చేశారు.

బంకర్లు ఏర్పాటు చేయాలి

జమ్మూ : దేశ సరిహద్దు వద్ద టెన్షన్ వాతావరణ నెలకొంది. ఆ ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి. ఈ సందర్భంగా గతంలో అధికారులు ప్రజలకు భద్రత కల్పించే విషయమై బంకర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారులు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని ఆప్రాంత ప్రజలు కోరుతున్నారు. మోర్టార్ షెల్స్‌తో పాకిస్థాన్ దాడులు చేస్తున్న నేపథ్యంలో సరిహద్దు వెంట నివసిస్తున్న వారిని పోలీసులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. గురువారం జమ్మూ, ఖతువ, సాంబా, ఐబీ, ఎల్ఓసీ వద్ద పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో 12 మంది చనిపోయారు. 50 మందికిపైగా గాయపడ్డారు. గత నెలలో జమ్మూ డివిజన్‌లోని ఐబీ, ఎల్ఓసీ వద్ద 14,460 బంకర్లు నిర్మించడానికిగాను కేంద్ర ప్రభుత్వం రూ.415.73 కోట్లు మంజూరు చేసింది. 2015 ఎన్నికల ప్రచారంలో భాగంగా సరిహద్దు వద్ద 1361.25 చదరపు అడుగుల విస్తీర్ణంలో బంకర్లు నిర్మిస్తామని బీజేపీ హామీ ఇచ్చింది.

మీ కేసులో ప్రతివాదులెవరు?

● ఏపీ సీఎంకు కేవీపీ బహిరంగ లేఖ ● విభజన హామీలపై కోర్టులో కేసు వేస్తామన్న సీఎం వ్యాఖ్యలపై కేవీపీ ప్రశ్నలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : విభజన హామీలు అమలు చేయకపోతే సుప్రీంకోర్టులో కేసులు వేస్తానంటున్న ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, ప్రదివాదులుగా ఎవరిని పేర్కొంటారో చెప్పాలని రాజ్యసభ సభ్యులు డా. కేవీపీ రామచంద్రరావు అన్నారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రికి బహిరంగ లేఖాస్త్రం సంధించారు. హామీలు అమలు చేయని ప్రధాని మోడీ మీద కేసులు వేస్తారా? తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వంపై వేస్తారా? అంటూ లేఖలో చంద్రబాబును నిలదీశారు. ఎవరిపై కేసులు వేయాలన్నా చంద్రబాబుకు భయమని కేవీపీ ఎద్దేవా చేశారు. విభజన హామీల అమలుపై ఎంపీలతో అఖిలపక్షం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ప్రధాని మోడీ గ్రాఫ్ తగ్గుతోందని గ్రహించిన బాబు, విభజన హామీల అమలు విషయంలో బీజేపీని దోషిగా చిత్రీకరిస్తూ చేతులు దులుపుకోవాలని చూస్తున్నారని వ్యాఖ్యానించారు. విభజన జరిగి దాదాపు నాలుగేళ్లు గడుస్తున్నా ఇంతకాలం పాటు రాష్ట్ర ప్రయోజనాలు ఫణంగా పెట్టి సొంత లాభాల కోసమే పని చేశారమని తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో ఎవరికీ చిత్తశుద్ధి లేదని, వాటాల కోసమే తెదేపా, బీజేపీ తగాదా పడుతున్నాయని కేవీపీ రామచంద్రరావు ఆరోపించారు. కాంట్రాక్టర్‌ను మార్చి అంచనాలు పెంచి తద్వారా కమీషన్లు దండుకోవాలన్న ప్రయత్నం తప్ప ప్రాజెక్టు పూర్తిచేయాలన్న ఉద్దేశమే లేదని అన్నారు. ఎన్డీయే సర్కారు త్వరలో ప్రవేశపెట్టబోయేదే చివరి బడ్జెట్ అవుతుందని, ఇందులోనైనా విభజన హామీలకు తగ్గ కేటాయింపులు జరపించలేకపోతే ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసగించినట్టేనని ధ్వజమెత్తారు.



భోగాపురం విమానాశ్రయాన్ని ప్రభుత్వ రంగ సంస్థ నిర్మించేందుకు ముందుకొచ్చినా, కమీషన్లు దక్కవన్న ఉద్దేశంతోనే ప్రైవేటు సంస్థల కోసం ఎదురుచూస్తున్నారని, ఇప్పటికే ఏడాది సమయం వృధా అయిందని ఆరోపించారు. భావనపాడు పోర్టు విషయంలో కూడా ఇదే జరుగుతోందని విమర్శించారు. చంద్రబాబు వైఖరే ఆంధ్ర ప్రజలకు శాపంగా మారిందని కేవీపీ అన్నారు.

పద్మావత్‌కు తప్పని నిరసన జ్వాలలు



న్యూఢిల్లీ : ఈనెల 25న విడుదలకు సిద్ధం అవుతున్న వివాదాస్పద చిత్రం పద్మావత్‌కు కష్టాలు తప్పడం లేవు. కర్ణిసేన ఆధ్వర్యంలో రాజ్‌పుత్‌లు ఈ సినిమాకు వ్యతిరేకంగా జోరుగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. తాజాగా సోమవారం కర్ణిసేన సభ్యులు ఉజ్జయిని ప్రధాని రహదారిని మూసివేసి నిరసన తెలిపారు. రోడ్లపై టైర్లు కాల్చి సినిమా విడుదలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉజ్జయిని నుండి నగాడ, దేవస్ నుండి మకీస్, ఆగర్ నుండి కోట వెళ్లాల్సిన రోడ్లపై నిరసన తెలపడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. దీంతో రంగంలోకి దిగిన ఎస్పీ సచిన్ అతుల్‌కర్ పరిస్థితి అదుపులోకి తీసుకురావాలని ఆదేశించారు.

సుప్రీంను ఆశ్రయించిన రాజస్థాన్, ఎంపీ

జనవరి 18 సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పుపై పలు రాష్ట్రాల్లో ఆందోళనలు చెలరేగాయి. తాజాగా ఈ నిరసనల మధ్య సినిమాను తమ రాష్ట్రాల్లో విడుదల చేయలేమంటూ రాజస్థాన్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు తాజాగా సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. పద్మావత్ సినిమా విడుదలను నిలిపివేయాలంటూ రెండు రాష్ట్రాలు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి.


రష్యాతో భారత్ కీలక ఒప్పందం

రూ.39వేల కోట్లతో రక్షణ సామగ్రి కొనుగోలు

న్యూఢిల్లీ : భారత్-రష్యా మధ్య రక్షణ రంగంలో ఓ భారీ ఒప్పందం జరిగింది. రూ.39,000 కోట్లు (5.5 బిలియన్ డాలర్లు) ఖరీదు చేసే ఎస్-400 ట్రూమ్ఫ్ ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ సిస్టంను భారత్, రష్యా నుండి కొనుగోలు చేయనుంది. ఇవి అత్యాధునిక సాంకేతిక వ్యవస్థతో రూపొందించినవి కావడం గమనార్హం. శత్రువులు ప్రయోగించిన బాంబులను, గూఢాచారి విమానాలు, క్షిపణులు, డ్రోన్లను గుర్తించి నాశనం చేయగల సామర్థ్యం ఉన్నవి కావడం గమనార్హం. 400 కి.మీటర్ల దూరం, 30 కి.మీ ఎత్తులో వీటిని గుర్తించే సామర్థ్యం ఎస్-400 ట్రూమ్ఫ్ ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ సిస్టంకు ఉంది. 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను భారత్ ఇదో పెద్ద డీల్‌గా అభివర్ణిస్తున్నది. ఐదు ఎస్-400 సిస్టమ్స్‌తో పాటు మీడియం రేంజ్ బాలిస్టిక్ మిస్సైల్, క్రూయిస్ మిస్సైల్స్ 54 నెలల్లో భారత్‌కు అప్పగించేలా రష్యాతో ఒప్పందం చేసుకుంది.

రాజీనామాకు సిద్ధమైన ఏచూరి!

న్యూఢిల్లీ: కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ మార్క్సిస్టు (సీపీఎం) కేంద్ర కమిటీలో విభేదాలు పొడచూపాయి. ప్రకాశ్ కారత్‌కు, సీతారాం ఏచూరికి మధ్య భిన్నాభిప్రాయాలు తలెత్తాయి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీతో పోరాడేందుకు కాంగ్రెస్‌తో కలిసి సాగాలన్న ఏచూరి ప్రతిపాదనను కేంద్ర కమిటీ తిరస్కరించడమే ఇందుకు కారణం. ఈ అంశంపై జరిగిన ఓటింగ్‌లో ఏచూరి ప్రతిపాదన వీగిపోయింది. దీంతో మనస్తాపం చెందిన ఆయన, బాధ్యతల నుంచి తప్పుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. అయితే, అలాంటిదేమీ లేదని, ఏచూరి రాజీనామా ప్రస్తావన లేదని పొలిట్ బ్యూరో పేర్కొంది. కేంద్ర కమిటీ సమావేశంలో ప్రకాశ్ కారత్, ఏచూరి వర్గాలు రెండుగా చీలిపోయినట్లు సమాచారం. రానున్న మూడేళ్ల కాలానికి పార్టీ అనుసరించాల్సిన విధానాలకు సంబంధించి ఇరువర్గాలు వేర్వేరు నివేదికలు సమర్పించాయి. కాంగ్రెస్‌తోసహా అన్ని లౌకిక పార్టీలతో కలిసి ఉండాలని ఏచూరి ప్రతిపాదించారు. ఇందుకు కారత్ వర్గం ససేమిరా అన్నది. ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ కాంగ్రెస్‌తో సంబంధాలు వద్దేవద్దని స్పష్టం చేసింది. ఆయనకు కేరళ, త్రిపుర పార్టీశ్రేణులతోపాటు, కాంగ్రెస్ వ్యతిరేకులు మద్దతుగా నిలిచారు. కాగా, రెండు వర్గాల ముసాయి తీర్మాణాల్లో ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగిన బీజేపీ ప్రభుత్వం దేశానికి ముప్పేనని పేర్కొనడం జరిగింది. ఇదివరకు 1975లో నాటి పార్టీ ప్రధాన కార్యదర్శి సుందరయ్య ప్రతిపాదనలు తిరస్కారానికి గురయ్యాయి. దీంతో ఆయన పార్టీ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. అదే క్రమంలో ఏచూరి ఆదివారం రాజీనామా ప్రతిపాదన తీసుకొచ్చినట్లు స్పష్టం అవుతున్నది.




మా ఆదేశాలను అపహాస్యం చేశారు

● ఏపీ సీఎస్, డీజీపీలపై హైకోర్టు అసహనం
● 29న వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంక్రాంతి పండగ సందర్భంగా నిర్వహిస్తున్న కోడి పందేలను నిర్వహించకుండా తగు చర్యలు తీసుకోవాలని తాము జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయకుండా అపహాస్యం చేశారని ఏపీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ లపై హైకోర్టు అసహనాన్ని, అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఇక నుంచి కోడి పందేలను నిర్వహించకుడా చూసే బాధ్యత ఏపీ సర్కారు దేనని తేల్చి చెప్పింది.. సంక్రాంతి పండగ సందర్భంగా అక్రమంగా కోడిపందేలు, జూదం తదితర క్రీడలు జరగకుండా తీసుకున్న చర్యలను వివరిస్తూ కార్యాచరణ నివేదికలను సమర్పించాలని తాము ఈ నెల 4న జారీ చేసిన ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైన ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్, డీజీపీ మాలకొండయ్యలపై హైకోర్టు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. నివేదికలు సమర్పించడంలో అలసత్వం వహించినందుకు గానూ ఈ నెల 29న వ్యక్తిగతంగా కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని హైకోర్టు ఏపీ సీఎస్, డీజీపీలను ఆదేశించింది. ఒకవేళ కుడి పందేలను అడ్డుకునేందుకు చేతకాకపోతే, తమ దృష్టికి తీసుకువస్తే, ఆ వ్యవహారాన్ని తామే చూసుకుంటామని అభిప్రాయపడింది. కోడి పందేల్లో ప్రజాప్రతినిధులు సైతం హాజరైనట్లు తాము టీవీల్లో చూసినట్లు ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఎం.గంగారావు లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ ప్రజాహిత వ్యాజ్యాలపై సోమవారం మరో సారి విచారణ చేపట్టి ఈ మేరకు ఆదేశాలు వెలువరించింది. తదుపరి విచారణ ఈ నెల 29కి వాయిదా వేసింది. పశ్చిమ గోదావరి జిల్లాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న కోడిపందేలు, జూదం, గుండాట వంటి క్రీడలు యధేచ్చగా నిర్వహిస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం తీసుకోవడం లేదని పేర్కొంటూ కె.రామచంద్రరాజు హైకోర్టులో ప్రజాహిత వాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే..ఈ దశలో పిటిషనర్ తరపు న్యాయవాది పి.వెంకట్ రెడ్డి వాదనలు వినిపిస్తూ..పశ్చిమ గోదావరి జిల్లా వెంప,శ్రీరాంపురం గ్రామాల్లో మాత్రమే ఈ సంక్రాంతికి కోడి పందేలు నిర్వహించలేదని తెలిపారు.

ప్రభుత్వ విధానాలను పక్కనబెట్టిన కేరళ గవర్నర్



తిరువనంతపురం: కేరళ గవర్నర్ పి. సదాశివం అసెంబ్లీ సమావేశాల ప్రారంభ ప్రసంగంలో రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు పక్కనబెట్టారు. కేరళలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం రూపొందించిన ప్రసంగంలోని కొన్ని వాక్యాలను ఆయన చదవకుండా దాటవేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచురించిన లైన్లను చదవకుండా తన ప్రసంగాన్ని కొనసాగించారు. గవర్నర్ కు అందించిన కాపీలనే శాసనసభ్యులు, మీడియాకు అందజేయడంతో ఈ విషయం బయటకు పొక్కింది . మేం కేంద్ర ప్రభుత్వం ధోరణిని వ్యతిరేకిస్తున్నాం. సంప్రదాయంగా వస్తున్న సమన్వయ సమాఖ్యకు భంగం కలిగిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాన్ని పట్టించుకోకుండా..నేరుగా జిల్లాల యంత్రాంగం, స్థానిక సంస్థలతో టచ్ లో ఉంటోంది. అన్న వాక్యాలను గవర్నర్ సదాశివం చదవకుండా దాటవేశారు.

అదే అనిశ్చితి..!

● అమెరికాలో కొనసాగుతున్న షట్ డౌన్ ● దిగిరావాల్సిందేనని డెమొక్రాట్ల పట్టు
● నింబంధనలు మారుస్తా : ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్: గడిచిన రెండు రోజులుగా స్తంభించిన అమెరికా ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకోవడానికి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగిరావాలని డెమొక్రాట్లు పట్టుపడుతుండగా, వారు పంతానికి పోతే నిబంధనలు మార్చేస్తానంటూ ట్రంప్ తాజాగా హెచ్చరించారు.అమెరికాలో ఈరోజు రెండవ రోజున కూడా ప్రభుత్వ కార్యాలయాల మూసివేతపై రెండవరోజున కూడా ప్రతిష్ఠంభన కొనసాగింది. సెనేట్ లో ట్రంప్ ప్రాతినిధ్యం వహిస్తున్న రిపబ్లికన్ పార్టీకి బలం లేకపోవడం వల్లనే ఆర్థిక బిల్లులు ఆగిపోయాయి. అయితే,ఇది కొత్త విషయం కాదని అమెరికన్ మీడియా వాదిస్తున్నప్పటికీ, ఆర్థిక సంక్షోభం ఇంకా కొనసాగుతూనే ఉంది.ఈ నేపథ్యంలో సెనేట్ సభ్యులు పంతానికి పోతే సెనేట్ నిబంధనలు మార్చేస్తానంటూ ట్రంప్ హెచ్చరించారు.కీలకమైన బిల్లులు సెనేట్ ఆమోదం పొందాలంటే 61 మంది సభ్యులు తప్పని సరిగా ఓటు వేయాలన్నది సూపర్ మెజారిటీ నిబంధన ప్రకారం తప్పని సరి.సెనేట్ లో రిపబ్లికన్ లకు 10ఓట్లు తక్కువగాఉన్నాయి.ఈ వివాదం కొనసాగితే 51 ఓట్లకే బిల్లులు ఆమోదంపొందేలా సూపర్ మెజారిటీ నిబంధనను మార్చాల్సిఉంటుంది.డెమొక్రాట్లు పట్టు విడకపోతే తాను ఆ పనే చేస్తానంటూ ట్రంప్ హెచ్చరించారు.ఆర్థిక బిల్లుల ఆమోదం ఆగిపోవడంతో ట్రంప్ డెమొక్రాట్లపై దాడికి దిగుతున్నారు. విదేశీయులు అక్రమంగా దేశంలోకి చొరబడితే తనిఖీ చేయవద్దని డెమొక్రాట్లు కోరుతున్నారంటూ ఎదురు దాడికి దిగారు. ట్రంప్ తన వైఖరిని మార్చుకుంటే తప్ప కీలక బిల్లులకు ఆమోదం తెలుపబోమని డెమొక్రాట్లు స్పష్టంగా ప్రకటించారు. నిధుల వ్యయంలో అసమానతలకు వ్యతిరేకంగా ట్రంప్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులను డెమొక్రాట్లు వ్యతిరేకిస్తున్నారు.ఈ ప్రతిష్ఠంభన ఇలా కొనసాగడం వల్ల అమెరికా ఆర్థికవ్యవస్థ కుప్పకూలే ప్రమాదంఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితి ఇంతకుముందు కూడా వచ్చిన మాట నిజమే కానీ, సుదీర్ఘంగా కొనసాగితే, అమెరికాకే కాక ప్రపంచంలో ఇతరదేశాలపై కూడాదీని ప్రభావం ఏర్పడే ప్రమాదం లేకపోలేదని వారు హెచ్చరిస్తున్నారు.



Andhraprabha business 2018
బిజినెస్
BUSINESS

ఫిక్కీ డైరెక్టర్ జనరల్‌గా దిలీప్ చినోయ్

న్యూఢిల్లీ : ఫిక్కీడైరెక్టర్ జనరల్‌గా దిలీప్ చినోయ్‌ను సోమవారం నియమించారు. కాగా చినోయ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌డీసీ)కి మేనేజింగ్ డైరెక్టర్‌గా.. అలాగే ఆటోమొబైల్ తయారీరం గాని కిచెం దిన సియామ్ డిప్యూటి జనరల్, సీఐఐ డిప్యూటి జనరల్‌గా పనిచేస్తు న్నారని ఫిక్కీ ఒక ప్రకటనలో తెలిపింది. చినోయ్‌ను గతంలోని కాంగ్రెస్ నేతృ త్వం లోని యూపీఏప్రభుత్వం (ఎన్ఎస్‌డీసీ)కి మేనేజింగ్ డైరెక్టర్‌గా నియ మిం చింది. అయితే స్కిల్ డెవలప్‌మెంట్ సరిగ్గా పనిచేయడం లేదని ఎన్‌డీఏ ప్రభు త్వం అసంతృప్తి వ్యక్తం చేశారు.2015లో ఎన్ఎస్‌డీసీ పద వికి కి రాజీ నామాచేశారు. మాజీ స్కిల్ డెవెలప్‌మెంట్ మంత్రి రాజీవ్ ప్రతాప్ రూడీ స్కిల్ డెవెలప్‌మెంట్ మానవ వనరులను శిక్షణ ఇవ్వడంలో విఫలమైం దన్నారు.

దావోస్‌లో ధాటిగా నిలుద్దాం!



●సేల్స్‌మెన్ పాత్రకాదు... స్టేట్స్‌మెన్‌గా మెరుద్దాం
● ఇండియన్ సీఈవోల ముక్తకంఠం

దావోస్ : భారత ప్రధానమంత్రి నురేంద్రమోడీ ప్రపంచ ఆర్థిక సదస్సులో భారత్ గురించి ఏం మాట్లాడుతారో అని ప్రపంచ దేశాల నాయకులు ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు. ప్రధాని దావోస్ పర్యటనలో ప్రపంచంలోని టాప్ సీఈవోలతో భేటీ అవుతారు. దేశీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి భారత్ తరఫున ఒకగట్టి నాయకుడిని ఎంపికచేసుకోవాలని.. భారత్‌కు చెందిన పెద్ద కార్పొరేటర్లు అభిప్రాయపడుతున్నారు. అదే సందర్భంలో ప్రస్తుతం అమెరికా లాంటి దేశాలు రక్షణాత్మక చర్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో భారత్ తరఫున వాటిని తిప్పికొట్టడానికి మనకు ఒక బలమైన నాయకుడు కావాలని వీరు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ఎందుకంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ కూడా ఈ సదస్సుకు రానున్నారని, ఆయన వచ్చీ రావడంతోనే అమెరికాలో తాను కార్పొరేట్ టాక్స్ బాగా తగ్గించానని చెబుతారని.. దీంతో అమెరికా కొర్పొరేట్లు పెద్దెత్తున ఉద్యోగాలు సృష్టించాయని, విదేశాల్లో లాభాలను ఆర్జించి అమెరికాకు తీసుకువచ్చాయని చెబుతున్నారని సీఈవోలు పేర్కొన్నారు. కాగా మోడీ మంగళవారం నాడు డబ్ల్యూఈఎఫ్ ప్లీనరీ సదస్సులో కీలక ప్రసంగం చేయనున్నారు. దావోస్‌కు బయలుదేరే ముందుమోడీ మాట్లాడుతూ.. అంతర్జాతీయ సమాజంతో భవిష్యత్తులో భారత్ కుదర్చుకోబోతున్న భాగస్వామ్యంపై దావోస్‌లో తన అభిప్రాయాలను చెబుతానన్నారు. గ్లోబల్ ఆర్థిక వ్యవస్థలో ఎదురవుతున్న సవాళ్లను గురించి ప్రపంచ నాయకుల దృష్టి తీసుకువస్తానన్నారు. అంతర్జాతీయ వ్యవస్థతో పాటు ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్లను గ్లోబల్ గవర్నెన్స్‌పై ప్రపంచ నాయకులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వాలు, విధాన కర్తలు, కార్పొరేట్, ప్రభుత్వ ఉన్నతాధికారులు అందరూ దీనిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ప్రధాని ట్విట్ చేశారు.డబ్ల్యూఈఎఫ్ వ్యవస్థాపకుడు, తన మిత్రుడు ప్రొఫెసర్ క్లాస్‌స్కాబ్ ఆహ్వానం మేరకు తాను దావోస్‌కు వెళుతున్నానని, ఈ ఏడాది దావోస్‌లో 'బీటలు వారిన ప్రపంచంలో భవిష్యత్తులోప్రతి దేశం తన వంతు పాత్ర' గురించి ప్రసంగం చేయను న్నారు. ప్రధాని ప్రసంగంలో చేయబోతున్న వ్యాఖ్యలు ఇక్కడ ప్రాముఖ్యం సంతరించుకోనున్నాయి. పలు ప్రపంచ నాయ కులు ఇక్కడ జరుగుతున్న సదస్సులో ప్రపంచ ఎదు ర్కొంటున్న పలు సవాళ్ల గురించి మాట్లాడే అవకా శాలున్నాయి. దీంతో పాటు ప్రపంచంలోని పలు అగ్రరా జ్యాలు శక్తిమంతమైన దేశాలు కూడా ఆర్థికపరమైన రక్షణా త్మక ధోరణి అవలంబించడంపై కూడా ప్రసంగాలు చేయ నున్నారు. ఈ సదస్సుకు జర్మనీ చాన్సలర్ ఏంజిలినా మెర్కిల్, ఫ్రెంచి అధ్యక్షుడు ఎమాన్యుయెల్ మ్యాక్రాన్, బ్రిటిష్ ప్రధానమంత్రి థెరిసా మేతో పాటు పలు ప్రపంచ దేశాల నాయకులు హాజరుకానున్నారు. స్పైస్‌జెట్‌కు చెందిన సింగ్ మాట్లాడుతూ 140 కోట్ల మంది ప్రజల తరఫును ప్రాతినిధ్యం వహిస్తున్న మోడీ ఇక్కడ తన ప్రభుత్వం తీసుకొచ్చిన పలు సంస్కరణలను గురించి దీంతో వృద్ధిరేటులో భారత్ దూసుకుపోతున్న వైనం గురించి, దేశంలోని జనాభాలో అత్యధిక శాతం యువతతో పాటు ప్రపంచంలోనే అతి పెద్ద మార్కెట్ కలిగి ఉండటంపై మోడీ తన ప్రసంగంలోప్రపంచ నాయకులకు వివరించి చెప్పాలన్నారు. గతేడాదిన చైనా ప్రీమియర్ జిన్‌పింగ్ దావోస్ పర్యటనకు వచ్చినప్పుడు అందరి దృష్టిచైనాపై ఉండిందని.. ప్రస్తుతం అందరి దృష్టి భారత ప్రధాని నరేంద్రమోడీపై ఉండటం సహజమేనని సింగ్ అన్నారు. సింగ్ మాట్లాడుతూ.. తనతో పాటు భారతీయ సీఈవోకు ఇక్కడ భలే డిమాండ్ ఏర్పడిందని.. ప్రతి ఒక్కరూ తమతో సమావేశం కావాలని కోరుతున్నారని.. ప్రస్తుతం భారత్‌లో జరుగుతున్న పరిణామాలపై అందరిలోనే ఆసక్తి నెలకొని ఉందని సింగ్ అన్నారు.దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సు 48సంవత్సరాల చరిత్రలో గతంలో ఎన్నడూలేని విధంగా భారత్ నుంచి పెద్దమొత్తంలో ప్రతినిధులు హాజరయ్యారు.

స్విస్‌మంచుశిఖరాల రిసార్ట్‌లో జరుగుతున్న ఈ సదస్సులకు భారత్ నుంచి 130 సీఈవోలతో పాటు సుమారు 2,000 మంది వ్యాపారవేత్తలు, పలు రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు, కళాకారులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరయ్యారు. కాగా ఈ సదస్సు శుక్రవారంతో ముగుస్తుంది.



ఉదయ్‌కొటక్ : ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కొటక్ గత కొన్ని సంవత్సరాల నుంచి దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సులకు హాజరవు తున్నారు. భారత్ గురించి బాగా అవగాహన కలిగిన వ్యక్తి అయి ఉండి సేల్స్, మార్కెటింగ్‌కు మధ్య వ్యత్యాసం తెలిసిన వారై ఉండాలి. ఇక్కడ జరిగే సదస్సులో భారత్‌ను చక్కగా ప్రాజెక్టు చేసే బలమైన నాయక ుడు కావాలని ఆయన అన్నారు. ఉదయ్ కొటక్ మాట్లాడుతూ.. డబ్ల్యూఈఎఫ్ భారత్ తరఫున స్పష్టమైన సందేశం ఇవ్వాలని, భారత్ ఆర్థిక వ్యవస్థ తలుపులు అందరికి తెరిసే ఉన్నాయని సంకేతాలు ఇవ్వాలని, దేశీయ ఇన్వెసర్లతో పాటు గ్లోబల్ ఇన్వెస్టర్ల ప్రయోజనాలను కాపాడుతామని నమ్మకం కలిగించాలన్నారు. దావోస్‌లో భారత్ తన స్థానాన్ని పదిలపర్చుకోవాలని.. ఇక్కడ మన బలమైన నాయకుడుగా స్థిరపడాలి కానీ.. సేల్స్‌మన్‌గా కాదని ఉదయ్ కొటక్ అన్నారు.ప్రస్తుతం ఇక్కడ సరికొత్త భారత్ గురించి వివరించి చెప్పడానికి మంచి అవకాశం లభించిందని ఆయన అన్నారు. చందా కొచ్చార్ మాట్లాడుతూ.. భారత్ ఆర్థిక వ్యవస్థ ఈ ఆర్థిక సంవత్సరం రెండవ సగభాగంలో జీడీపీ వృద్ధిరేటు 7శాతం సాధిస్తుందని.. అన్నీ రంగాలు గాడినపడ్డాయన్నారు.



అజయ్‌సింగ్ : అజయ్‌సింగ్ నష్టాల్లో ఉన్న స్పైస్‌జెట్‌ను గాడిలోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. దావోస్‌లో భారత్ విజయగాధలను వివరించడానికి ప్రధాన మంత్రి నరేంద్రమోడీ కంటే మరో నాయకుడు అవసరం లేదని అన్నారు.



చందాకొచ్చార్ : ఐసీఐసీఐ బ్యాంకు సీఈవో చందకొచ్చార్ కూడా ఇక్కడ జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సుకు తప్పకుండా హాజరవుతుంటారు. భారత ఆర్థిక వ్యవస్థ క్రమంగా మెరుగుపడుతోందని, అన్నీ రంగాలు గాడినప డుతున్నాయన్నారు. ప్రస్తుతం వృద్ధిరేటులో భారత్ దూసుకుపోతోందని.. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియో గించుకోవచ్చునన్నారు. ఇక్కడికి వచ్చిన పలువురు భారత సీఈవోలు గ్లోబల్ లీడర్లు.. చాలా మంది ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఏం మాట్లాడుతారో అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



హెల్త్‌కేర్‌కు జాతీయ హోదా కల్పించండి

●అపోలో హాస్పిటల్స్ ఎండీ సునీతా రెడ్డి



న్యూఢిల్లీ : దేశంలో హెల్త్‌కేర్‌కు జాతీయ హోదాఇవ్వాలనుకుంటే .. దీనికి యూనివర్సల్ హెల్త్ ఇన్స్యూరెన్స్‌తో పాటు కొన్ని కీలకనిర్ణయాలు తీసుకుంటే దేశంలో హెల్త్‌కేర్‌ను బలోపేతం చేయవచ్చునని అపోలో హాస్పిటల్స్ సోమవారం నాడు తెలిపింది. బడ్జెట్‌లో హెల్త్‌కేర్ రంగానికి కేటాయింపుల్లో ఎలాంటి రాజీ ఉండరాదని ప్రకటనలో పేర్కొంది. కాగా ఫిబ్రవరి 1వ తేదీన ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ పార్లమెంటులో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.హెల్త్‌కేర్‌కు జాతీయ హోదా కల్పించాలనుకున్నప్పుడు ప్రభుత్వం ఈ రంగంలోకి పెద్దెత్తున పెట్టుబడులను ఆకర్షించాలని, అది పెట్టుబడుల రూపంతో పాటు మేధోసంపత్తి రూపంలో ఆకర్షించగలగాలని, అపోలో హాస్పిటలర్స్ ఎండీ సునీతా రెడ్డి చెప్పారు.హెల్త్‌కేర్ రంగంలో పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) మోడల్‌తో పాటు ప్రైవేట్ రంగంలో కొన్ని రాయితీలు ఇచ్చి పెట్టుబడులను ఆకర్షించాలని ఆమెపేర్కొన్నారు. దీంతో పాటు ప్రభుత్వం పెద్దమొత్తంలో పన్ను చెల్లించే వారికి ఆరోగ్యంపై చేసేవ్యయంతో పాటు బీమాచెల్లింపులపై రాయితీలు ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించారు. ఆరోగ్య బీమాపై యూనివర్సల్‌రేట్లను అమల్లోకి తేవడంతో మేలని ఆమె అన్నారు. హెల్త్‌కేర్ సర్వీసెస్, హెల్త్‌కేర్ ఇన్స్యూరెన్స్ ప్రీమియంపై జీఎస్టీని సున్నా శాతానికి తీసుకురావాలని, దీంతో వినియోగదారుడి ప్రయోజనాలను కాపాడినట్లు అవుతుందన్నారు. ప్రజలు నాణ్యమైన ఆరోగ్య సేవలను డిమాండ్ చేస్తుంటారని.. దీనికి పెద్దమొత్తంలో పెట్టుబడుటు అవసరంతో పాటు నిపుణులైన మానవ వనరులు కావాల్సి ఉంటుందని.. ప్రస్తుతం ఈ రెండు వైద్యరంగంలో కొరవడి తల్లడిల్లుతున్నాయని సునీతా రెడ్డి వివరించారు. భాగస్వాములందరూ.. ప్రభుత్వం, ప్రైవేట్‌రంగంతో చేతులు కలిపి సరి కొత్త భాగస్వామ్యంలో ప్రైవేట్ రంగంలో వైద్యసేవారంగాన్ని మరింత బలోపేతం చేయవచ్చునని ఆమె వివరించారు.

ఈ ఏడాది టెల్కోలకు మోక్షం

●తగ్గనున్నపోటీ ● పెరగనున్న టారిఫ్

●ఫిచ్ రేటింగ్ ఏజెన్సీ

న్యూఢిల్లీ : టెలికం రంగంలోకి ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో ఎంట్రీ ఇవ్వడంతోచోటా మోటా పోటీ కంపెనీలతో పాటు దేశంలోని అతి పెద్ద టెలికం ఆపరేటర్ భారతి ఎయిర్‌టెల్ కూడా డీలా పడింది. ఈ ఏడాది చివరి నాటికి దేశంలోని టెల్కోలపై ఒత్తిడి తగ్గుతుందని ఫిచ్ రేటింగ్ అంచనా వేసింది. ఎందుకంటే జియో కూడా పోటీ నుంచి క్రమంగా తప్పుకుంటోందని పేర్కొంది. ఫిచ్ అంచనా ప్రకరం ప్రస్తుతం భారతీయ టెలికం మార్కెట్లో టారిఫ్ అత్యంత కనిష్టంగా ఉందని... ఈ స్థాయిలో ఇది దీర్ఘకాలం పాటు కొనసాగలేదని,, ఈ ఏడాది నుంచి టారిఫ్ పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. జియో కూడా కస్టమర్లనుపెద్దెత్తున తన ఖాతాలో వేసుకుని ప్రస్తుతం తమ పెట్టుబడులపై లాభాలను ఆర్జిస్తోంది. భారతితో పాటు ఇతర టెలికం కంపెనీలపై లాభాల ఒత్తిడి క్రమంగా ఈ ఏడాది నుంచి తగ్గముఖం పడతాయని పేర్కొంది. 2016లో టెలికం రంగంలో జియో ఎంట్రీ ఇవ్వడంతో ఈరంగంలో పోటీ తారాస్థాయికి చేరింది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి భారతి ఎయిర్‌టెల్ కూడా లాభాల బాట పడుతుందని ఫిచ్ పేర్కొంది. దీనికి కారణం మొబైల్ డేటా వినియోగం క్రమంగా పెరగడమేనని తెలిపింది. టెలికం రంగం భవిష్యత్తు గురించి ప్రస్తావిస్తూ.. క్రమంగా ఈ రంగం గాడినపడుతోందని దీనికి కారణం ఈ రంగంలో పోటీ క్రమంగా సమసిపోవడమే కారణమని ఫిచ్ అంచనా వేసింది.



భారత్‌లో విలీనాలు టేకోవర్ల జోరు

● ఎర్నెస్ట్ అండ్ యంగ్

న్యూఢిల్లీ: ఈ ఏడాది విలీనాలు టేకోవర్‌లు జోరుగా కొనసాగే అవకాశాలున్నాయని ఎర్నెస్ట్‌యంగ్ తాజా నివేదికలో పేర్కొంది. ఎర్నెస్ట్ యంగ్ 17వ గ్లోబల్ క్యాపిటల్ కాన్ఫిడెన్స్ బ్యారోమీటర్ (ఇండియా) నివేదిక ప్రకారం దేశీయ మార్కెట్లు స్థిరపడ్డంతో ప్రస్తుతం డిజిటల్‌రంగంలోకి మారుతుండటంతో.. దీంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడంతో పాటు తేలికగా రుణాలు లభించడంతో కంపెనీలు టేకోవర్‌లు విలీనాలపై వైపు మొగ్గుచూపుతున్నాయి. గ్లోబల్ మార్కెట్లో కాస్తా ఒడిదుడుకులున్నా.. భారత్ కార్పొరేట్లు మాత్రం టేకోవర్‌లవైపు మొగ్గు చూపుతున్నాయని.. భవిష్యత్తులో పెద్దెత్తున టేకోవర్‌లు జరిగే అవకాశాలున్నాయని ఈవై మేనేజింగ్ పార్టనర్ అమిత్ ఖండేల్‌వాల్ చెప్పారు. ఈవై అంచనా ప్రకారం 2017లో రికార్డు స్థాయిలో 1.011 ఒప్పందాలు జరిగాయి. వీటి విలువ 40,961 మిలియన్ డాలర్లుగా తేలింది. కాగా ప్రభుత్వం కూడా పెద్దెత్తున సంస్కరణలు పెద్దపీటవేయడంతో కార్పొరేట్లు కూడా టేకోవర్లకు ఉత్సాహం చూపుతున్నాయి. 55శాతం కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌లు వచ్చే 12 నెలలకాలంలో టేకోవర్‌లు లేదా విలీనాలు అవుతాయన్న భరోసాతో ఉన్నారు.



పెట్రోల్ లీటరు రూ. 80



ముంబై : సోమవారం నాడు ముంబైలో పెట్రోల్ లీటరు రూ.80 మార్కును దాటిపోయిందని ఇండియన్ ఆయిల్ వెబ్‌సైట్లో ప్రకటించింది. ముంబైలో లీటరుపెట్రోల్ రూ.80.10 పలకగా.. కోలకతాలో రూ.74.94, చెన్నైలో రూ.74.91, దేశరాజధాని ఢిల్లలో రూ.72.23కి విక్రయిస్తున్నారు.పెట్రోల్ ధరలు పెరగడానికి ప్రధాన కారణం అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగడమే కారణమని ఆదివారం నాడు కేంద్ర చమురు శాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వివరణ ఇచ్చారు. పెట్రోల్‌ధరలు పెరగడానికి రాష్ట్రస్థాయిలో పెట్రోల్‌పై సుంకం విధించడం కూడా ఒక కారణమని ఆయనపేర్కొన్నారు.

తమ మంత్రిత్వ శాఖ పెట్రోల్, డిజిల్, కిరోసిన్‌ను వస్తు సేవల పన్ను (జీఎస్టి) పరిధిలోకి తేవడానికి ప్రయత్నిస్తోందన్నారు. త్వరలోనే జీఎస్టి మండిలి తమ ప్రతిపాదనకు ఆమోదం తెలుపుతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా చూస్తే పెట్రోల్ ధరలు ముంబైలోనే ఎక్కువగా ఉన్నాయి.

చైనా,పాక్ దిగువన భారత్ ర్యాంకు!

• ప్రపంచ ఆర్థిక సదస్సు సూచిలో.... • అగ్రస్థానంలో నార్వే



దావోస్ : అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ సూచిలో భారత్ ర్యాంకు 62గా నిలిచింది. సూచిలో చైనా 26, దాయాదీ దేశం పాకిస్తాన్ 47తో పోల్చుకుంటే భారత్ ర్యాంకు చాలా చాలా తక్కువే. నార్వే అగ్రస్థానంలో ఉండగా.. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో లుథియేనియా అగ్రస్థానంలో ఉంది. డబ్ల్యూఈఎఫ్ వార్షిక సదస్సు ప్రారంభించడానికి ముందు ఈ జాబితాను విడుదల చేశారు. ఈ సమావేశానికి భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీదో పాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా హాజరవుతారు. ఈ సూచిలో ప్రధానంగా పరిగణనలోకి తీసుకొనే అంశాల విషయానికి వస్తే ... ఆయా దేశాల్లో ప్రజల జీవప ప్రమాణాలు, పర్యావరణ స్థిరత్వం, రాబోయే తరాల వారిని మరింత అప్పుల్లో కూరుకోకుండా కాపాడ్డమని డబ్ల్యూఈఎఫ్ ఒక ప్రకటనలోపేర్కొంది. ప్రపంచ నాయకులందరూ తక్షణమే వృద్ధిరేటు.. అభివృద్ధికి సంబంధించి కొత్త మోడల్‌ను తీసుకురావాలని కోరుతున్నారు. ప్రస్తుతం వృద్ధిరేటును కొలువడానికి వినియోగిస్తున్న జీడీపీ స్వల్పకాలిక ఫలితాలను చూపిస్తున్నాయని.. ఫలాలు అందడంలో అసమానత కనిపిస్తోందని చెబుతున్నారు.అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో భారత్ ర్యాంకు గత ఏడాది 60 కాగా చైనా 15, పాకిస్తాన్ 52వ స్థానంలో ఉన్నాయి. ఈ ఏడాది 2018 సూచిలో మొత్తం 103 దేశాలను పరిగణలోకి తీసుకున్నారు. వాటిని మూడురకాలు విభజించారు. ఒకటి వృద్ధి,అభివృద్ధి, వృద్ధి ఫలాలు అందరికి దక్కుతున్నాయా, అంతర్గత ఎంత సంపద సృష్టించింది. మొత్తం 103 దేశాలను మళ్లీ రెండుగా విభజించారు. వాటిలో 29 దేశాలను అభివృద్ధి చెందిన దేశాలుగా... 74 దేశాలను అభివృద్ధి చెందుతున్న దేశాలుగా విభజించారు. వీటిలోనే మళ్లీ ఐదు సబ్‌కేటగిరీలుగా విభజించాయి. ఐదు సంవత్సరాల పాటు మొత్తం అభివృద్ధి.. అభివృద్ధి రేటు స్కోర్, వృద్ధిరేటు తగ్గిందా.. క్రమంగా తగ్గింది. స్థిరంగా ఉందా.. క్రమంగా అభివృద్ధి బాటలో పడుతుందా అన్నీ లెక్కలోకి తీసుకుంటాయి. భారత్ ర్యాంకు చాలా తక్కువగా ఉన్నా ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో టాప్ 10లో ఉంది. క్రమంగా వృద్ధిరేటులో దూసుకుపోతోంది. అభివృద్ధి చెందుతున్న రెండు దేశాలు మాత్రమే భారత్‌లా వృద్ధిరేటులో దూసుకుపోతున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో నార్వే అగ్రస్థానంలో ఉంటే.. తర్వాత స్థానాలు ఐర్లాండ్, లక్సెంబర్గ్ స్విట్జర్లాండ్, డెన్మార్కులు టాప్ ఐదులో స్థానం దక్కించుకున్నాయి. చిన్న యూరోపియన్ దేశాలు కూడా సూచిలో అగ్రస్థానాలు దక్కించుకున్నాయి. ఆస్ట్రేలియా (9) ఒక్క టే యూరోపియనేతర దేశం టాప్ 10లో స్థానం దక్కించుకుంది. మిగిలిన జీ7 ఆర్థిక వ్యవస్థల విషయానికి వస్తే జర్మనీ (12), కెనెడా 17, ఫ్రాన్స్ 18, బ్రిటన్ 21, అమెరికా 23, జపాన్ 24, ఇటలీ 27వ స్థానాల్లో ఉన్నాయి. టాప్ ఐదు అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల విషయానికి వస్తే లుథువేనియా, హంగేరీ, అజర్‌బైజాన్, లాటివియా, పోలంట్‌లున్నాయి. బ్రిక్స్ దేశాల్లో మిశ్రమ స్పందన కనిపిస్తోంది. రష్యా ఫెడరేషన్ ర్యాంకింగ్ 19 కాగా తర్వాత స్థానాలు చైనా 26, బ్రెజిల్ 37, ఇండియా 62, దక్షిణాఫ్రికా 69గా నిలిచాయి. మూడు రకాల కొలబద్ద ప్రకారం చూస్తే భారత్ ర్యాకు 72 (ఇంక్లూషన్) అభివృద్ధి..వృద్ధిరేటు 66, అంతర్గతంగా సృష్టించిన సంపద ర్యాంకులో 44ర్యాంకుల్లో ఉంది. భారత్‌కు పొరుగున ఉన్న దేశాల విషయానికి వస్తే శ్రీలంక 40, బంగ్లాదేశ్ 34, నేపాల్ 22, భారత్ కంటే మెరుగైన ర్యాంకు సాధించిన దేశాల విషయానికి వస్తే మాలే, ఉగాండా, రవాండా, బురిండి, ఘనా, ఉక్రెయిన్, సర్బియా, పిలిప్పీన్స్, ఇండోనేషియా, ఇరాన్, మెసిడోనియా, మెక్సికో, థాయిలాండ్, మలేషియాలున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో చైనా అగ్రస్థానంలోఉంది. 2012 నుంచి జీడీపీ వృద్ధి 6.8 శాతంతో పాటు తలసరి ఆదాయంలో అగ్రస్థానంలో ఉంది. అయితే గత కొన్ని సంవత్సరాలనుంచి వృద్ధిరేటు కాస్తా వెనుకబడిపోయింది. అభివృద్ధి ఫలాలు అందరికి దక్కడం లేదు.. సామాజిక సమతుల్యం దెబ్బతింటోంది. అయితే జీడీపీ వృద్ధిరేటు కొలడానికి ప్రస్తుతం పాటిస్తున్న పద్దతిని తప్పించి దాని స్థానంలో కొత్త పద్దతిని ప్రధానం దేశ సామాజిక ఆర్థిక వ్యవస్థను దృష్టిలో ఉంచుకొని.. దేశంలోని ప్రతి గృహస్తుడు ఆదాయం, ఉపాధి అవకాశాలు, సామాజిక భద్రత, నాణ్యమైన జీవన ప్రమాణాలను కొలబద్దగా తీసుకోవాలని కోరుతున్నారు.

నియంత్రణ సడలింపులుంటేనే...
స్టార్టప్‌లు ఫాస్ట్‌ట్రాక్



హైదరాబాద్ : స్టార్టప్‌లు శరవేగంగా దూసుకుపోవాలంటే నియంత్రణా సంస్థలు నిబంధనలు సడలించాలని ... ఇతర అంశాలు స్నేహపూరిత వాతావరణంలో ఉండాలని సీనియర్ ఐటి రంగానికి చెందిన నిపుణుడు వి బాలకృష్ణన్ అన్నారు. ఫండింగ్‌తో పాటు నైపుణ్యం కలిగి ఉండి గ్లోబల్ మార్కెట్లతో కనెక్ట్ అయ్యేలా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. గత రెండు సంవత్సరాల నుంచి స్టార్టప్ రంగాల్లో పలుమార్పులు చేర్పులు చోటు చేసుకుంటున్నాయని, ప్రస్తుతం ఈ రంగం కాస్తా స్థిరపడిందని.. ఇక ఈ కంపెనీలకు కావాల్సింది ఫండింగ్ (నిధులు)అనీ, అన్నీ కంపెనీలు పెట్టుబడులను ఆకర్షించలేవన్నారు. బీ2సీ స్టార్టప్లకు నిధులు అతి పెద్ద సవాలుగా మారిందని, ఇప్పుడిప్పుడే వాటిలో పెద్ద కంపెనీలు సొంతంగా నిధులు సమీకరించుకుంటున్నాయని ఆయన పేర్కొన్నారు. బీ2బీ మార్కెట్లకు ప్రస్తుతం నిధులు అవసరం చాలా ఉందని.. అదే సమయంలో చాలా కంపెనీలు కూడా బీ2బీకి ఫండింగ్ ఇవ్వడానికి ముందుకొస్తున్నాయని, ఎందుకంటే ఈ కంపెనీలకు మూలధనం చాలా చాలా తక్కువ అవసరం ఉంటుందన్నారు. అలాగే ఈ బీ2బీ నుంచి నిష్క్రమించడం కూడా చాలా సులువేనని ఆయన పేర్కొన్నారు. తన అంచనా ప్రకారం చాలా మటుకు వెంచర్ క్యాపిటల్ సర్కిల్స్ బీ2సీ నుంచి తమ దృష్టిని బీ2బీ వైపు మరల్చుతున్నాయన్నారు. ఈ ప్రస్తుతం స్టార్టప్ కంపెనీలు ప్రధానంగా నియంత్రణా సంస్థల నిబంధనలతో ఎక్కువ ఇబ్బందులు పడుతున్నాయని బాలకృష్ణన్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఆదాయపు పన్ను శాఖ నుంచి స్టార్టప్ కంపెనీలకు నోటీసులు అందుతున్నాయన్నారు. తన అభిప్రాయం ప్రకారం కొన్ని నిబంధనలు స్నేహపూరితంగా ఉండేలా మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎందుకంటే స్టార్టప్‌లను ప్రారంభించే కంపెనీలు యువకులైన 25 -30 సంవత్సరాల వయసుగల వారు ఈ రంగంలోకి వస్తున్నారని వారినెత్తిన ఒకటేసారి 30 నుంచి 40 చట్టాలను రుద్దడం భావ్యం కాదన్నారు. స్టార్టప్‌ల నిబంధనలు సరళతరంగా ఉండాలని ఆయన అన్నారు. ఇటీవల ఆదాయపు పన్ను శాఖ అన్నీ స్టార్టప్ కంపెనీలకు నోటీసులు జారీ చేశాయని తెలిపారు. స్టార్టప్ కంపెనీలు తాము సమకూర్చుకున్న మూలధనంపై పన్ను చెల్లించాలనడం భావ్యం కాదని బాలకృష్ణన్ పేర్కొన్నారు. స్టార్టప్ నిబంధనల్లో కూడా స్పష్టత ఉండాలని, నిబంధనలు సరళతరంగా ఉంటేనే స్టార్టప్‌లకు పెద్దమొత్తంలో మూలధనం సమకూర్చుకుని గాడిన పడతాయని..పెట్టుబడులు వస్తే నైపుణ్యం దానంతట అదే వస్తుందని బాలకృష్ణన్ వివరించారు.



బీజేపీతో దోస్తీకి సై

(మొదటిపేజీ తరువాయి)

చంద్రబాబునాయుడుకు లేవన్నారు. విభజనా నంతరం సమయం చాలా తక్కువ ఉన్నా బెంగళూరు, చెన్నయ్, హైదరాబాద్‌లతో పోటీపడుతున్నట్టు చంద్రబాబునాయుడు చెబుతున్నారని, వాస్తవానికి మా యువత పొట్ట చేతపట్టుకుని బెంగళూరు, చెన్నయ్ నగరాలకు వలసపోతున్నారని చెప్పారు. వారికి ఆయన చేసిందేమీ లేదన్నారు. వాస్తవానికి బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల నిర్మాణానికి 50 ఏళ్లు పడుతుందని, కాని, చంద్రబాబుకు తలకిందులుగా తపస్సు చేసినా అది చేతకాదన్నారు. డప్పాలు చెప్పుకుంటున్న చంద్రబాబు స్థానంలో కనీసం మూగ ముఖ్యమంత్రి ఉన్నా ఇంతకంటే ఎంతో బాగా చేసేవారని జగన్మోహన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. సామాన్య జనం చంద్రబాబుతో విసిగివేసారి పోయారని, 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కనీస స్థానాలు కూడా గెలవలేదన్నారు. ఆయనకు తెలిసిందల్లా అబద్ధాలాడడం, జనాన్ని వంచించడమేనన్నారు. జీడీపీ విషయంలోనూ అదేవిధంగా అబద్ధాలు చెబుతున్నారన్నారు. రాష్ట్రం వెలుపల చంద్రబాబు నాయుడు పెద్ద డెవలపర్‌గా ప్రచారం జరుగుతోందని, అదంతా భ్రమేనన్నారు. ఆయన వ్యక్తిగతంగా మాత్రం అభివృద్ధి చెందుతున్నారని ఆరోపించారు. తనపై సీబీఐ కేసులన్నీ కాంగ్రెస్ కుట్రతో మోపినవేనన్నారు. దివంగత నేత వైఎస్సార్ ఆకస్మిక మృతి చెందే వరకూ తాను కాంగ్రెస్‌లో ఎటువంటి పదవుల్లోనూ లేనని, ఆయన మరణానంతరం ఆయన ఆశయాల సాధనకు మాత్రమే తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. అటువంటి తనపై కుట్రతో అవినీతి కేసులు మోపారని అన్నారు.

ప్రజా ఫిర్యాదులు, అర్జీలను
నెలాఖరులోగా పరిష్కరించాలి

• గ్రీవెన్స్ సమీక్షలో సీఎస్ దినేష్‌కుమార్

అమరావతి, ఆంధ్రప్రభ : ప్రజల నుండి వచ్చిన విజ్ఞాపనలు, అర్జీలలో ఆర్థికేతర పరమైన అంశాలకు సంబందించిన వాటిని ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని , దీనికి సంబంధించిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన సచివాలయంలోని తన కార్యాలయంలో గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎస్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో వచ్చిన అ ర్జీలతో పాటు అంతక ు ముందు వచ్చిన అర్జీలన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలన్నారు. దీనికి సంబంధించి వెంటనే అన్ని జిల్లాల కలెక్టర్లు ఆయా శాఖాధిపతులకు డిఓ లేఖలు పంపాలని సూచించారు. అదే విధంగా వచ్చిన అర్జీలలో ఆర్థిక, ఆర్థికేతర విజ్ఞాపనలు విడివిడిగా పరిష్కరించాలని కోరారు. వ్యక్తిగత, సామాజిక పరమైన వాటిని విభజించి వాటిని సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యక్తి గత అవసరాలకు సంబంధించి వచ్చిన విజ్ఞాపనల్లో అర్హమైన వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలన్నారు. సామాజిక పరమైన విజ్ఞాపనులు, ఫిర్యాదులను మూడు కేటగిరిలుగా విభజించాలని సూచించారు. అదేవిధంగా వీటి పరిష్కారానికి ఎంత మొత్తంలో నిధులు అవసరమవుతాయో అంచాలను రూపొందించి నివేదికలు అందజేయాలని సీఎస్ దినేష్ కుమార్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారంపై తాను ఎప్పటికప్పుడు సమీక్షిస్తానని, ఎటువంటి జాప్యం జరిగిన ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రణాళిక శాక ప్రత్యేక కార్యదర్శి పి.వి చలపతిరావు, ప్రణాళికా శాఖ సంచాలకులు గోపాల్, రియల్ టైమ్ గవర్నన్స్ డైరెక్టర్ ఎ. బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఈసీలు, నకళ్లు ఇక ఫ్రీ!



(మొదటిపేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్స్ డిప్యూటీ జనరల్ కె.అబ్రహాం తెలిపారు. కడప పాత రిమ్స్‌లోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారానే ఎవరైనా రిజిస్ట్రేషన్. ఏపి.జివోవి.ఇన్‌లో లాగిన్ అయి యూజర్ ఐడి, పాస్ వర్డ్ క్రియేట్ చేసుకుని ఇంటి నుంచే ఉచితంగా ఈసీలు, సర్టిఫైడ్ డ్యాకుమెంట్స్(నకళ్లు) పొందవచ్చన్నారు. గతంలో ఫర్ ఇన్ఫర్మేషన్ అని నకళ్లు వచ్చేవని కానీ నేడు సబ్ రిజిస్ట్రార్ డిజిటల్ సిగ్నేచర్‌తో వాటిని పొందవచ్చని తెలిపారు. వీటికి సంబంధించి రిక్వెస్టు పెట్టిన 24 గంటల్లో అందించడం జరుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ప్రక్రియను కూడా ఆన్‌లైన్ ద్వారానే నూతనంగా ప్రవేశపెట్టినటువంటి టెంప్లేట్స్‌ను పూర్తి చేయడం ద్వారా డాక్యుమెంట్ ప్రిపరేషన్‌ను పూర్తి చేసుకుని సులభంగా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి పది నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవచ్చన్నారు. ఇక్కడ నింపే ఆధార్ కార్డు ద్వారా సదరు ఆస్తికి సంబంధించి ఖచ్చితమైన హక్కుదారుడా కాదా అన్నది ఫోటోను చూసి సులభంగా గుర్తించవచ్చన్నారు. నూతన విధానం ద్వారా అక్రమాలు జరిగేందుకు తావులేకుండా ఉంటుందన్నారు. పైగా రెవిన్యూ రికార్డులను కూడా తనిఖీ చేసిన డేటా లభిస్తుందన్నారు. బ్యాంకులకు వెళ్లకుండానే ఈ చలానా ద్వారా చలానాలను చెల్లించవచ్చన్నారు. డ్యాకుమెంట్స్ సమయంలో రిజిస్ట్రేషన్ సమయంలో రైటర్లు చేసే పొరపాట్లు జరగకుండా ఈ విధానం ద్వారా తప్పులను స్వయంగా సరిచూసుకోవచ్చన్నారు. అనంతరం జిల్లా రిజిస్ట్రార్ దామోదర్ రావు మాట్లాడుతూ పబ్లిక్ ఆన్‌లైన్ సర్వీస్‌లోకి లాగిన్ అయిన ప్రతి పౌరుడు తనకు కావాల్సిన దస్తావేజు నకళ్లను పొందవచ్చునన్నారు. ఆన్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీని వలన ముందుగానే స్లాట్‌ను బుక్ చేసుకోవచ్చని, సమయం ఆదా అవుతుందన్నారు. ఎక్కడ నుంచైనా ఆన్‌లైన్ ద్వారా ఈసీలు, దస్తావేజు కాపీలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కడప అర్బన్ సబ్ రిజిస్ట్రార్ నాగరాజు, రైటర్లు పాల్గొన్నారు.

గ్రూప్-1(2011)
మౌఖిక ఇంటర్వ్యూలు ప్రారంభం

• ఫిబ్రవరి 20 వరకు ఇంటర్వ్యూలు
• రోజుకు 15 మంది చొప్పున ఇంటర్వ్యూలు

అమరావతి, ఆంధ్రప్రభ : విజయవాడ బందర్ రోడ్డులోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో సోమవారం నుంచి గ్రూప్ - 1 (2011) అభ్యర్థులకు మౌఖిక ఇంటర్వ్యూలు నిర్వహించే ప్రక్రియను సంబంధిత అధికారులు ప్రారంభించారు. ఈ విషయమై అభ్యర్థులకు ముందుగానే ఏపీపీఎస్సీ అధికారులు సమాచారం అందించారు. ఇందు కోసం ప్రత్యేకించి, ఏర్పాటు చేసిన బోర్డు సభ్యుల నేతృత్వంలో ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు.ప్రతి రోజు 15 మంది చొప్పున ఫిబ్రవరి 20 తేదీ వరకు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 15 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ఏపీ సీఆర్డీఏ వినూత్న ప్రయోగం



• నిర్మాణ రంగంలో విప్లవాత్మక మార్పులు
• భవనాలకు 'బిమ్' విధానం తప్పనిసరి
• త్రీడి ప్లాన్ ఉంటేనే ఇకపై అనుమతులు • జీపీఎస్‌కు అనుసంధానం • నిబంధనల ఉల్లంఘనలకు చెక్

అమరావతి, ఆంధ్రప్రభ: భవన నిర్మాణ రంగంలో సాంకేతికతకు పెద్దపీట వేస్తూ ఏపీ సీఆర్డీఏ పలు సంస్కరణలకు త్వరలో శ్రీకారం చుట్టనుంది. భవనాల నిర్మాణాలకు తీసుకున్న ప్లాన్‌లకు విరుద్ధంగా చిత్తం వచ్చిన విధంగా ఉల్లంఘనలకు పాల్పడే నిర్మాణ దారుల ఆట కట్టించేందుకుగాను కొత్త విధానానికి అంకురార్పణ చేసేందుకుగాను సీఆర్డీఏ అధికారులు రూపకల్పన చేస్తున్నారు. బిల్డింగ్ మ్యాప్ మోడలింగ్ (బిమ్) విధానం ద్వారా భవన నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. భవనాల నిర్మాణాలకు అనుమతులు తీసుకోవాలంటే భవనం బైట స్థితి, బెడ్‌రూమ్, కిచెన్, హాలు తదితరాలను మ్యాప్ రూపంలో సమర్పించే వారు. నిర్మాణ ప్రదేశం చుట్టూ ఉన్న ఖాళీ స్థలం, అందుకు సంబంధించిన కొలతలను బ్లూప్రింట్‌గా ఇవ్వాల్సి ఉండేది. ఇకపై బ్లూప్రింట్‌తో సంబంధం లేకుండా త్రీడీ ప్లాన్ ఉంటేనే నిర్మాణానికి అనుమతులు లభిస్తాయి. పాలనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి భవన నిర్మాణ రంగంలో కూడా ఇదే పద్దతిని అనుసరించేందుకు గాను ఏపీ సీఆర్డీఏ అధికారులకు ఇటీవల కాలంలో నిర్వహించిన సమీక్షల్లో మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. అంతేగాక కొత్త విధానాన్ని సీఆర్డీఏ నుంచే అమలు చేయాలని కూడా ముఖ్యమంత్రి నిర్ణయించారు. రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు ప్లాట్ల పంపిణీకి రంగం సిద్ధం అవుతున్న తరుణంలో సీఆర్డీఏ కొత్త విధానాన్ని అమలు చేసేందుకు ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. బిమ్ విధానంలో భవనం బైట ప్రదేశం, హాలు, బాత్‌రూమ్‌లు, బాల్కనీ వంచి నిర్మాణాలకు కొలతలు సక్రమంగా ఉండాలి. నిర్మాణంలో వాడే మెటీరియల్, మార్బుల్, సిమెంట్, ఇటుక తదితరాలకు సంబంధించిన వివరాలను త్రీడి ప్లాన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. సాధారణంగా ప్లాన్ తీసుకున్నాక భవన నిర్మాణాన్ని ప్లాన్‌లో పేర్కొన్న ప్రకారం జరగడం లేదన్న విషయం అధికారులకు తెలియంది కాదు. ఈ మాదిరి ఉల్లంఘనలకు చెక్ పెట్టేందుకు గాను బిమ్ విధానంలో త్రీడీ ప్లాన్ రూపొందించే విధానంపై కొద్ది రోజుల క్రితం లైసెన్స్‌డ్ సర్వేయర్లతో సిఆర్డీఏ అధికారులు సమావేశం నిర్వహించి త్రీడీ ప్లాన్ గురించి వారికి సోదాహరణంగా వివరించారు.

బిమ్ విధానంలో త్రీడి ప్లాన్‌ను అధికారులకు సమర్పించాక దానిని జిపిఎస్‌కు అనుసంధానం చేస్తారు. దీని వల్ల భవనాల నిర్మాణాలు సాగుతున్న తీరుని కార్యాలయంలో కూర్చుని క్షేత్రస్థాయి నుంచి పరిశీలించే అవకాశం ఉంటుంది. భవనాల నిర్మాణాల్లో ఉల్లంఘనలను కూడా స్పష్టంగా పసిగట్టే అవకాశం ఉంటుందని ఒక అధికారి తెలిపారు. అంతేగాక ఈ కొత్త విధానాన్ని ప్రభుత్వ భవనాల నిర్మాణాల్లో కూడా పాటించే అవకాశం ఉంద న్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ విధానం అమలు ద్వారా మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ఈ విధానాన్ని రోడ్ల నిర్మాణాల్లో కూడా ప్రవేశపెట్టే అవకాశాలపై కూడా అధికారులు యోచిస్తున్నారు.

సరస్వతిదేవి రూపంలో దుర్గమ్మ

• విద్యార్థులకు ప్రత్యేక దర్శనం



అమరావతి, ఆంధ్రప్రభ : వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని బెజవాడ ఇంద్రకీలాద్రిలోని కనకదుర్గమ్మ ఆలయంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి, పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు,తల్లిదండ్రులు పెద్ద ఎత్తున ఆలయానికి వచ్చి,పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ వారిని సరస్వతి రూపంలో అలంకరించి,భక్తులకు దర్శనం కల్పించారు. సరస్వతిదేవి పుట్టిన రోజు కావడంతో విద్యార్థులకు ఆశీస్సులు అందజేసేందుకు ఆలయ నిర్వాహకులు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రాన్ని విద్యాంధ్రప్రదేశ్‌గా మార్చాలన్న ప్రభుత్వ సంకల్పానికి తోడ్పాటు అందించాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వేద పండితులు తెలిపారు. అమ్మ వారి మూలవిరాట్‌తో పాటు మహామండపం ఆరో అంతస్తులో అమ్మ వారి ఉత్సవ మూర్తిని సరస్వతిదేవి రూపంలో అలంకరించి, విద్యార్థులకు దర్శనం కల్పించారు. విద్యార్థులందరికీ అమ్మ వారి వద్ద ప్రత్యేక పూజలు చేసి,పెన్ను,పెన్సిల్, సరస్వతి కంకణం,సరస్వతి దేవి చిత్రపటాన్ని ప్రసాదంగా అందజేశారు. ఈ కార్యక్రమం పట్ల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల కోసం సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక దర్శనానికి అనుమతించారు. భారీ సంఖ్యలో విద్యార్థులు తరలిరావడంతో అమ్మ వారి దర్శనానికి రెండు గంటలకు పైగా సమయం పట్టింది.

ఆర్థిక అసమానతలతో
అంతులేని అగాధం!

(మొదటిపేజీ తరువాయి)

నేటికీ 3.7బిలియన్ల మంది ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పులు రాలేదు. వారి సంపాదనలో ఏమాత్రం వృద్ధి కనిపించలేదు అని సర్వే తేల్చిచెప్పింది. రివార్డ్ వర్క్, నాట్ వెల్త్ పేరుతో 2017 ఏడాదిలో సంపద సృష్టిపై ఈ సంస్థ అధ్యయనం చేపట్టింది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక ఫోరమ్ సదస్సు నేపథ్యంలో సర్వే వివరాలను వెల్లడించింది. దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థికవేత్తల సదస్సులో ఆక్స్‌ఫామ్ సర్వేను నిశితంగా పరిశీలించనున్నారు. ప్రపంచాధినేతలు తమ చర్చల్లో ఆర్థిక, లింగ అసమానతల గురించి ప్రధానంగా మాట్లాడనున్నారు.

★ గత ఏడాది సర్వే ప్రకారం, దేశంలోని సంపదలో 58 శాతం ఒక్క శాతం మంది ధనికుల వద్ద ఉన్నట్లు తేలింది.ఇది ప్రపంచ సగటు కంటే అధికం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంపదలోని 50శాతం సంపద కొందరి వద్దే పోగుపడినట్లు వెల్లడైంది.

★ తాజా సర్వే మేరకు, ఇండియాలోని ఒక్క శాతం ధనికుల సంపద 2017లో రూ.20.9లక్షల కోట్లు వృద్ధి చెందింది. పెరిగింది. ఇది మనదేశ 2017-18 వార్షిక బడ్జెట్‌తో సమానం. అదేవిధంగా, మనదేశంలో లక్షాధికారుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

★ 2010 నుంచి గమనిస్తే, భారత్‌లో బిలియనీర్ల సంపద ఏడాదికి సగటున 13 శాతం పెరిగింది. సాధారణ ఉద్యోగి సందపతో పోలిస్తే ఇది ఆరు రెట్లు ఎక్కువ. సాధారణ పౌరుల సంపద వృద్ధి గరిష్టంగా 2శాతానికి మించడం లేదు.

★ గతేడాది ఇండియాలో కొత్తగా 17 మంది బిలియనీర్ల జాబితాలో చేరారు. ఈ సంఖ్య ఇప్పుడు 101కి చేరింది. బిలియనీర్ల ప్రస్తుత సంపద విలువ రూ. 20.7 లక్షల కోట్లు. గతేడాది ఇదే సమయంలో వారి సంపద 4.89 లక్షల కోట్లుగా ఉంది. సంపన్నుల డబ్బుతో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో విద్య, వైద్య బడ్జెట్‌ను భర్తీ చేయవచ్చు.

★ టాప్ 10శాతం మంది ప్రజలు 73శాతం సంపదను కలిగివున్నారు. 37శాతం ఇండియన్ బిలియనీర్లు కుటుంబ వారసత్వంగా సంపదను కూడబెట్టారు. దేశంలోని 51శాతం సంపద బిలియనీర్ల చేతుల్లో ఉంది.

★ ఇకసంపన్నుల్లోనూ లింగ భేదం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రతి 10 మంది బిలియనీర్లలో 9 మంది పురుషులే ఉన్నారు. మహిళా సాధికారిత అట్టడుగు స్థాయిల్లోనే ఉంది. బిలియనీర్ల జాబితాలో కేవలం నలుగురు మహిళలు మాత్రమే ఉన్నారు. వారసత్వ సంపద చలవతోనే ఈ గుర్తింపైనా దక్కింది.

★ భారత్‌లో ఓ ప్రముఖ కంపెనీలో అధిక వేతనం తీసుకునే ఎగ్జిక్యూటివ్ ఏడాది పాటు సంపాదించిన మొత్తం గ్రామీణ ప్రాంతంలో కనీస వేతనం తీసుకునే ఓచిన్న ఉద్యోగి సంపాదించడానికి దాదాపు 941 ఏళ్లు పడుతుందని సర్వే తెలిపింది. ఇదే అమెరికాలో అయితే ఓ ప్రముఖ కంపెనీ సీఈఓ ఒక్క రోజు తీసుకునే వేతనాన్ని, సాధారణ ఉద్యోగి చేరుకోవాలంటే ఏడాది కాలం శ్రమించాల్సిందే.

★ భారత్‌లోని ప్రఖ్యాత గార్మెంట్ పరిశ్రమలో గరిష్ట వేతనం పొందే సీఈవో 17.5 రోజుల సంపాదనను చేరుకునేందుకు గ్రామీణ ప్రాంత కూలీకి 50 ఏళ్లు పడుతుంది.

★ బాగా డబ్బున్న ఆ ఒక్క శాతం మందికి పెద్దమొత్తంలో పన్నులు వేయాలని మెజార్టీ ప్రజలు అభిప్రాయపడ్డారు. పేద-ధనిక వర్గాల మధ్య పెరుగుతున్న అంతరంపై తక్షణమే దృష్టిసారించాల్సిన అవసరం ఉందని 73 శాతం మంది స్పష్టంచేశారు.


★ ప్రపంచవ్యాప్తంగా పది దేశాల్లోని లక్షా 20 వేల మంది అభిప్రాయాలను ఈ సర్వే సేకరించింది.

''బిలియనీర్ల సంపద వృద్ధిచెందడం ఆర్థికాభివృద్ధికి సంకేతం కానేకాదు. ఒకరకంగా ఇది విఫల ఆర్థిక వ్యవస్థకు సంకేతం. దేశానికి ఆహారం అందించేందుకు, మౌలికరంగ నిర్మాణానికి, పారిశ్రామిక వృద్ధి కోసం ఫ్యాక్టరీల్లో ఎంతో శ్రమిస్తున్న పనిచేస్తున్న మెజార్టీ ప్రజలు తమ కుటుంబ సభ్యులకు రెండు పూటల తిండి కూడా ఇవ్వలేక పోతున్నారు. పిల్లలకు సరైన విద్య, వైద్యం అందించలేని దుస్థితిలో ఉన్నారు. అభివృద్ధి విభజన ప్రజాస్వామ్యాన్ని బలహీనం చేస్తుంది. దీనిమూలంగా పెట్టుబడి దారీతత్వం, అవినీతి పెచ్చుమీరుతుంది''

నిషా అగర్వాల్ (ఆక్స్‌ఫామ్ సీఈవో)

26 నుంచి దళిత తేజం-తెలుగుదేశం

• ఎక్సైజ్ శాఖామంత్రి జవహర్



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రప్రభుత్వం దళితుల అభివృద్ధి, సంక్షేమం కోసం చేస్తున్న పథకాలను విస్తృతంగా ప్రచారం చేసి చైతన్య పరిచేందుకు ఈనెల 26 నుంచి దళిత తేజం - తెలుగుదేశం అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్ శాఖామంత్రి కే ఏ శ్యామ్యూల్ తెలిపారు. దళిత వాడల్లో ఉన్న ప్రతి ఇంటికీ వెళ్లి ఎస్సీల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న పథకాలను వివరించనున్నట్లు మంత్రి తెలిపారు. దళితుల సంక్షేమం అంబేద్కర్ ఆశయం కాగా ఆచరణ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుదని ప్రశంసించారు. సచివాలయంలోని నాలుగో బ్లాక్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జవహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం వేల కోట్లు వెచ్చిస్తోందన్నారు. దళితుల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన పథకాలు ఏవిధంగా అమలు చేస్తుందో తెలియజేయడానికే దళితతేజం - తెలుగుదేశం కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు మంత్రి చెప్పారు. ఈనెల 26 నుంచి రాష్ట్రవ్యాప్తంగా దళిత వాడల్లో ఈ కార్యక్రమం ప్రారంభం కానుందన్నారు. ఏప్రిల్ 20న విజయవాడలోని పవిత్ర సంఘం వద్ద జరిగే సభతో ఈ కార్యక్రమం ముగుస్తుందన్నారు. అమ్మకు వందనం కార్యక్రమంతో అంబేద్కర్‌ను స్మరించుకునే అవకాశం కలిగిందన్నారు. మహిళలకు రాజకీయాల్లో 33 శాతం రిజర్వేషన్లు కలిపించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికే దక్కుతుందన్నారు.

పీఏసీ చైర్మన్ పదవిని సురేష్‌కు ఇవ్వాలి..

పీఏసీ చైర్మన్ పదవిని బుగ్గన రేజేంద్రనాథ్ నుంచి దళితుడైన ఆదిమూలపు సురేష్‌కు కట్టబెట్టి దళితులపై తనకున్న ప్రేమను ప్రకటించాలని విపక్షనేత జగన్‌కు ఎక్సైజ్ శాఖామంత్రి జగన్‌కు సవాల్ విసిరారు. జగన్‌చుట్టూ తన కులపు నేతలు తప్ప దళిత నేతలు లేరన్నారు. దళితులకు టీడీపీలో ఒరిగిందేమీలేదని జగన్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. వైకాపా నేతలు అవినీతి కంపులో దొర్లుతున్నారని ఎద్దేవా చేశారు. రేపల్లె కల్తీ మద్యం తయారీ ఘటనలో సూత్రదారులు, పాత్రదారులు ఎంతటి వారైనా వదిలేదిలేదని మంత్రి హెచ్చరించారు. ఈ కేసుపై ఎక్సైజ్ శాఖాధికారులు సమగ్రంగా దర్యాప్తు జరుపుతున్నారని దోషులకు శిక్ష తప్పదని పేర్కొన్నారు.

నిఘా నేత్రాలతో రైల్వే భద్రత కట్టుదిట్టం

• త్వరలో అన్ని రైల్వే స్టేషనల్లో సీసీ కెమెరాలు
• 11 వేల రైళ్లు, 8,500 స్టేషన్లలో సీసీ కెమెరాల ఏర్పాటు • ఇందుకోసం రూ. 3వేల కోట్ల బడ్జెట్

అమరావతి, ఆంధ్రప్రభ : ఇక నుంచి రైళ్లల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయబోతున్నారు. నిఘా నేత్రాల పర్యవేక్షణలో భద్రతను మరింతగా పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే రైల్వే శాఖ ప్రణాళికలు రూపొందించింది.ప్రయాణీకులకు భద్రతతో కూడిన ప్రయాణానుభూతులను కల్పిందుకు దేశ వ్యాప్తంగా అన్ని రైళ్లు, రైల్వేస్టేషన్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయా లని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈమేరకు సంబంధిత నివేది కలను కూడా కేంద్రానికి నివేదించింది. త్వరలోనే 11వేల రైళ్లు, 8,500 రైల్వే స్టేషన్లల్లో దాదాపు 12 లక్షల సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు రైల్వే శాఖ కసరత్తు చేస్తోంది. 2018-19 రైల్వే బడ్జెట్‌లో దీని కోసం రూ.3000 కోట్లతో నిధిని కూడా ఏర్పాటు చేయబోతున్నారు. కానుంది. రైలులోని ప్రతి కోచ్‌లో ఎనిమిది సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తారు. రైల్వే స్టేషన్లల్లో ప్రవేశ ద్వారాల నుంచి అన్ని ప్రదేశాలను కవర్ చేసేలా నిఘా నేత్రాల పర్యవేక్షణ ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కేవలం 395 స్టేషన్లు, 50 రైళ్లలో మాత్రమే సీసీటీవీ వ్యవస్థ అందుబాటులో ఉంది. రోజు రోజుకు రైల్వేలో పెరిగిపోతున్న నేరాలకు చెక్ పెట్టేందుకు రైల్వే శాఖ యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటోంది. నిఘా నేత్రాల ఏర్పాటుకు సంబంధించి గతంలో ప్రత్యేకించి,నిపుణులతో కమిటీలు కూడా వేయడం జరిగింది. ఆ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు తాజాగా రైల్వేశాఖ ఈ నిర్ణయం తీసుకున్నది.

విభజన హామీలను గాలికి వదలవద్దు

• చంద్రబాబుకు అండగా నిలవండి: మంత్రి మారెప్ప

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన రాష్ట్ర విభజన హామీలను తక్షణమే అమలు చేయాలని మాజీ మంత్రి మూలింటి మారెప్ప డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా టిడిపితో కలిసి బిజెపి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రధానమంత్రి విఫలమయ్యారని ఆరోపించారు. సోమవారం ఆయన వెలగపూడి సచివాలయం వద్ద ఆంధ్రప్రభతో మాట్లాడుతూ తాను బలహీనవర్గానికి చెందినవాడినని ప్రధాని చెబితే సరిపోదని, ఆచరణలో హామీలను అమలు చేసి చూపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర అభివృద్ధి కోసం చేస్తున్న కృషికి అండగా నిలవాల్సింది పోయి రాజధాని నిర్మాణంతో పాటు పోలవరం ప్రాజెక్టు, నిధుల విడుదల, ఇతర ప్రాజెక్టులు, విశాఖ రైల్వే జోన్ వంటి పలు అంశాలపై మెలికపెట్టడం ఇదెక్కడి చోద్యంఅని మారెప్ప ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇతరుల మాదిరిగానే దళిత అధికారులకు కూడా సముచితమైన గౌరవం ఇవ్వాలని రాష్ట్ర మాజీ మంత్రి మూలింటి మారెప్ప ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కోరారు. దళితులలోనూ సమర్థులైన అధికారులున్నారని, నవ్యాంధ్రప్రదేశ్ భవిష్యత్‌కు గట్టి పునాది వేసే క్రమంలో ఉన్నతాధికారుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రితో పాటు మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషికి జాతీయ, అంతర్జాతీయస్థాయిలో మంచి స్పందన లభిస్తోందని, ఈ నేపథ్యంలోనే త్వరలో పదవీ విరమణ చేయనున్న ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ కమిషనర్ రామాంజనేయులు పదవీకాలాన్ని పొడిగించాలని సి.ఎం. ను కోరారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయడంలో, ఫలితాలు రాబట్టడంలో రామాంజనేయులు అనేకసార్లు సమర్థతను చాటుకున్నారని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో ఒక్క పంచాయతీరాజ్ శాఖకే 46 అవార్డులు రావడం ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి నారా లోకేష్‌ల ఘనత అన్నారు. ఇందుకు సమర్థులైన అధికారుల పాత్ర కూడా మరవలేనిదని గుర్తు చేశారు. కమిషనర్‌గానే రామాంజనేయులు సత్ఫలితాలు రాబట్టారని, నిజాయితీ, నిబద్ధతతో పనిచేశారని, కిందిస్థాయి నుంచి వచ్చి ఉన్నత చదువులు అభ్యసించారని, కలెక్టర్‌గా, జాయింట్ కలెక్టర్‌గా, వివిధ శాఖలలో పనిచేసిన సీనియర్ అధికారిగా ఆయన మంచి ప్రతిభను కనబరిచారని గుర్తు చేశారు. రామాంజనేయులును ప్రిన్సిపల్ సెక్రెటరీగా నియమించి కనీసం ఏడాదిన్నర సర్వీసును పొడిగించాలని మారెప్ప ముఖ్యమంత్రిని కోరారు. గతంలోపలువురుఅధికారులకు ఇదే విధంగా సర్వీసును పొడిగించారని, రామాంజనేయులుకు కూడా ఒక ఛాన్స్ ఇవ్వాలని ఆయన ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా కోరారు. ఇప్పటికే సమర్థతనుచాటుకున్న ఈ అధికారిసర్వీసును పొడిగిస్తే బలహీనవర్గాలకు ఎంతో మేలు జరుగుతుందని, తెలుగుదేశం ప్రభుత్వ లక్ష్యం కూడా అదేనని మాజీ మంత్రి గుర్తు చేశారు.

ఏపీలో గ్రేటర్ టాప్

• మురికివాడల్లో ఆల్‌టైమ్ రికార్డ్ • స్మార్ట్ విశాఖలో సగం జనాభా స్లమ్స్‌లోనే • 793 మురికివాడల్లో 9.33 లక్షల మంది నివాసం • తగ్గించేందుకు పటిష్టమైన ప్రణాళికలు • ఇలా అయితే భవిష్యత్తులో దేశంలోనే మరోసారి మురికివాడల్లో ప్రథమ స్థానం



విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో: భారత దేశంలోనే అత్యధిక మురికివాడలు ఉన్న నగరంగా గతంలో విశాఖ ఒకసారి రికార్డుల్లోకి ఎక్కింది. అయితే అప్పటి నుంచి నగరంలో మురికివాడలను తగ్గించాలని మహావిశాఖ నగరపాలకసంస్థయూసిడి విభాగం ప్రయత్నాలు చేస్తూనే ఉంది. స్మార్ట్ సిటీగా విశాఖను అభివృద్ధి చేస్తున్నామని నేతలంతా పదేపదే ప్రకటిస్తున్నప్పటికి ఆచరణలో మాత్రం మురికివాడల్లోనే సగం జనాభా నివాసం ఉంటున్నారు. ఇదే విషయాన్ని జీవీఎంసీ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఇందుకు తగ్గట్లుగానే మురికివాడలు కూడా ఆయా ప్రాంతాల్లో దర్శనమిస్తున్నాయి. అయితే దేశంలోనే అత్యధికంగా మురికివాడలు ఉన్న నగరంగా పేరు పొందడంతో కొంత మేరకు మురికివాడలు తగ్గించాలని చాలా కాలంగా ప్రయత్నాలు జరుపుతూ వస్తున్నారు. చాలా మంది జనాభా మురికి వాడల్లోనే నివాసం ఉండడంతో ఎక్కడ ఏ మురికివాడను తొలగించాలన్నా వీలుపడటం లేదు. ప్రస్తుతం జీవీఎంసీ గుర్తించిన నివేదికలు ప్రకారం పట్టణ పరిధిలో మొత్తం 793 మురికివాడలు ఉండగా అందులో 9లక్షల33వేల238 మంది ప్రజలు నివాసముంటున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో 2,07,386 బిపిఎల్ కుటుంబాలు ఉండడం గమనార్హం. వీటితో పాటు మురికివాడల్లోనే 2,72,787 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉన్నారు. గతంలో దేశంలోనే అత్యధిక మురికివాడలు ఉన్న నగరంగా విశాఖను ప్రకటించడం జరిగింది. అయితే అప్పట్లో నివేదికలు తప్పుగా సమర్పించడం జరిగిందని అధికారులుచెప్పుకొచ్చారు. వాస్తవంగా విశాఖలో సగం మంది జనాభా మురికివాడల్లోనే జీవనం సాగిస్తున్నారు. కొంత కాలం క్రితం గ్రేటర్ కమిషనర్‌గా రామాంజనేయులు విధులు నిర్వహించినప్పుడు పట్టణ పరిదిలో ఉన్న మురికివాడలను తరలించేందుకు శతవిదాలా ప్రయత్నం చేశారు. రామ్మూర్తిపంతులు పేట వెనుక ఉన్న మురికివాడ, రైల్వే న్యూకాలని వద్దనున్న మరో మురికివాడ మధురవాడకు తరలించారు. ఆ తరువాత ఇందిరాప్రియదర్శిని కాలనీ, అల్లూరిసీతారామరాజు నగర్‌తో పాటు మరిన్ని మురికివాడలు తరలించే ప్రయత్నం చేసినప్పటికి వేర్వేరు కారణాలుతో వీలుపడలేదు. అత్యధిక శాతం జనాభా మురికివాడల్లో నివశిస్తూ పట్టణంలోనే ఉపాది అవకాశాలు మెరుగుపర్చుకుంటూ జీవనం సాగిస్తున్నాయి.

వీరిని శివారు ప్రాంతాలకు తరలించి ఇళ్లు కేటాయించి ఇతరత్ర సదుపాయాలు కల్పించినా తిరిగి ఉపాది కోసం నగరానికే రావాల్సి వస్తుంది. దీంతో ప్రయాణ ఛార్జీలు, ఇతర ఖర్చులకే కూలి సొమ్ము సరిపోతుంది. దీని వల్ల మురికివాడల ప్రజలను శివారు ప్రాంతాలకు తరలించినా అక్కడకు వెళ్లేందుకు ఎవరూ ఇష్టపడటం లేదు. దీంతో జీవీఎంసీ ప్రయత్నాలు కూడా నెరవేరలేదు. అయితే పట్టణంలో 793 మురికివాడలు ఉన్నట్లు రికార్డులు స్పష్టం చేయడంతో దీని వల్ల దేశ వ్యాప్తంగా అనేక గణాంకాల్లో విశాఖ పేరు తరచూ వినిపిస్తుంది.

కాబట్టి ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం, మహావిశాఖ నగరపాలక సంస్థ అధికారులు అవసరమైన కార్యాచ రణ చేపట్టి పట్టణ పరిదిలో ఉన్న మురికివాడల ప్రజలకు మరింతమెరుగైన జీవనం కల్పించే విధంగా ఇళ్లు కేటాయించడంతో పాటు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. ప్రస్తుతం నగరంలో ఉన్న మురికివాడల్లో సదుపాయాలు దయనీయంగా ఉన్నాయి. అనేక చోట్ల చెత్తా చెదారం, మురుగు కాలువల మధ్యనే మంచాలు వేసుకొని ప్రజలు సేదతీరాల్సిన పరిస్థితి నెలకొంది. మంచినీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు కూడా అంతంతమాత్రమే. స్మార్ట్ సిటీగా ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న మహావిశాఖలో మురికివాడల పై ప్రభుత్వం దృష్టిసారించకపోతే భవిష్యత్తులో కూడా సగంకంటే జనాభా మురికివాడల్లోనే నివాసం ఉండకతప్పదు. దేశవ్యాప్తంగా అత్యధిక మురికివా డలు ఉన్న నగరంగా మరోసారి విశాఖ రికార్డుల్లోకి ఎక్కక మానదు.

ఆంధ్రప్రభ

రైతాంగ సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● నిరంతరంగా వ్యవసాయ పరిశోధనలు ● 3వ విడత రుణమాఫీ కింద రూ.3,300 కోట్లు విడుదల - మంత్రి సోమిరెడ్డి



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం ద్వారా రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటును అందిస్తూ వారి సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని రాష్ట్ర వ్యవ సాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి వెల్లడిం చారు. సోమవారం గుంటూరులోని ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో నిర్వహించిన కిసాన్ మేళాకు రాష్ట్ర మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పత్తిపాటి పుల్లారావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు అధ్యక్షతన జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి సోమిరెడ్డి మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా వ్యవసాయ రంగ అభివృద్ధికై ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు సొంతమన్నారు. నాణ్యమైన విత్తనాలతో నాణ్యమైన పంటలు చేతికి వస్తాయని, ఈ నేపథ్యం లోనే నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించా లన్న సంకల్పంతో నిరంతరం వ్యవసాయ పరిశోధ నలు జరిగేలా కర్నూలులో మెగా సీడ్ పార్క్‌కు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇక్కడ ఆవిష్కరించే నాణ్యమైన విత్తనాలను రాష్ట్ర రైతాంగానికే గాకుండా దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల రైతులకు అందించడం జరుగుతుందన్నారు. మూడవ విడత రైతు రుణ మాఫీ కోసం రూ.3,600 కోట్లకు గాను రూ.3,300 కోట్లను విడుదల చేయడం జరిగిందని, దీనికి 10 శాతం వడ్డీని కలిపి అర్హులైన రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని చెప్పారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ ప్రోత్సహించేందుకు ఇప్పటి వరకు 10,000 ట్రాక్టర్లను రైతులకు పంపిణీ చేయడం జరిగిందని, మరో 2,800 ట్రాక్టర్లను త్వరలో పంపిణీ చేస్తామని తెలిపారు.

విరివిగా మార్కెట్ సౌకర్యం కల్పిస్తున్న ప్రభుత్వం: మంత్రి పత్తిపాటి

సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులకు ఆధునిక సాంకేతికతను జోడిస్తూ లాభసాటి సేద్యం దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు తెలియజేశారు. రైతాంగం పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధరలతోపాటు విరివిగా మార్కెట్ సౌకర్యం రాష్ట్ర ప్రభుత్వం కల్పించడం జరుగుతోందన్నారు. భూసార పరీక్షలను ఎప్పటికప్పుడు నిర్వహిస్తూ అధిక దిగుబడులకు రైతులకు తోడ్పాటును అందిస్తూ కౌలు రైతులకు కూడా గతంలో ఎన్నడూ లేనివిధంగా అధిక స్థాయిలో వ్యవసాయ రుణాలను ఇచ్చిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదే అని చెప్పారు. ఆచార్య ఎన్.జీ.రంగా విశ్వవిద్యాలయాన్ని దేశంలోనే నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. అనంతరం వ్యవసాయ ఎగ్జిబిషన్‌ను తిలకించిన మంత్రులు పలువురు లబ్దిదారులైన రైతులకు ట్రాక్టర్లు, ఇంజన్లు, వ్యవసాయ పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, విశ్వ విద్యాలయ వీసీ దామోదర నాయుడు, బోర్డు మెంబర్ లక్ష్మి నారాయణ, వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరి జవహర్‌లాల్, మిర్చి యార్డు ఛైర్మన్ మన్నవ సుబ్బారావు, జడ్పీ వైఎస్ ఛైర్మన్ పూర్ణ చంద్రరావు, యూనివర్శిటీ ఉన్నతాధికారులు ఎన్.వి.నాయుడు, కె.రాజారెడ్డి, భారతి, రత్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాడివాడిగా పీఏసీ సమావేశం

● పట్టిసీమపై నేడు చర్చ ● అవకతవకలు జరిగాయంటూ కాగ్ నివేదిక? ● రేపు ఆర్థిక పరిస్థితిపై సమీక్ష ● హాజరుకానున్న టీడీపీ, వైసీపీ

అమరావతి, ఆంధ్రప్రభ: 23వ తేదీన జరుగనున్న పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశం వాడి వేడిగా జరిగే అవకాశాలున్నాయి. పట్టిసీమ తో పాటు ఇతర మరికొన్ని చిన్నతరహా ప్రాజెక్టులపై సమావేశంలో సీరియస్‌గా చర్చ జరుగుతుందని భావిస్తున్నారు. కొన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఇటీవలే కాగ్ నివేదికను సమర్పించినట్టు సమాచారం. ఆ నివేదిక ఆధారంగానే పీఏసీ సమావేశంలో సభ్యులు అధికారులను నిలదీసే అవకాశాలున్నాయి. పట్టిసీమ ప్రాజెక్టు పూర్తయినప్పటికీ, ఆ ప్రాజెక్టు నిర్మాణంలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని ఇప్పటికే కాగ్ రిపోర్టు పిఏసీకి అందినట్టు తెలుస్తోంది. అధికార పక్షంతో పాటు, ప్రధాన ప్రతిపక్షానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు కూడా పీఏసీలో సభ్యులుగా వున్నారు. అంతే కాకుండా బిజెపి నుంచి ఒకరు సభ్యునిగా వున్నారు. ప్రభుత్వం పట్టిసీమ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. నదుల సంధానంలో ఇది ఒక రికార్డుగా భావిస్తోంది. ముఖ్యమంత్రి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ఈ ప్రాజెక్టు విషయమై పలువార్లు ప్రస్తావించారు. అయితే కంప్ట్రోలర్ ఆఫ్ ఆడిటర్ జనరల్ నివేదిక మాత్రం ప్రాజెక్టు నిర్మాణంలో కొన్ని అవకతవకలను ఎత్తి చూపినట్టు సమాచారం. దీని ప్రాతిపదికనే పీఏసీ సభ్యులు ఇరిగేషన్ , ఆర్థిక శాఖ అధికారులను నిలదీసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. పట్టిసీమతో పాటు పుష్కరం ఎత్తిపోతల ప్రాజెక్టుపై కూడా సమావేశంలో ప్రత్యేకంగా ప్రస్తావించే అవకాశాలున్నాయి. ఇటీవలే జరిగిన సమావేశానికి అధికారులు హాజరు కాని పరిస్థితులు వున్నాయని పీఏసీ మండిపడింది. పుణ్యకాలమంతా అధికారుల పర్యటనలకే సరిపోతున్నప్పుడు అత్యున్నతమైన పబ్లిక్ అకౌంట్స్ కమిటీకి స్థానమెక్కడిదని కమిటీ సభ్యులు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కావాలనే సహాయ నిరాకరణను అవలింభిస్తోందనిమండిపడ్డారు. ఈసారి అధికారులు సమావేశానికి పూర్తిస్థాయిలో హాజరయ్యే అవకాశాలుండటంతో పీఏసీ నుంచి ఘాటుగా ప్రశ్నలు తలెత్తే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీలుకూడా ఈ సమావేశానికి హాజరు కానున్నారు.

పాలకపక్షం నుంచి ఐదుగురు

కాగా వైఎస్సార్‌సిపికి చెందిన బుగ్గన రాజేంద్రనాథ్ చైర్మన్‌గా వున్న తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు కె.అప్పలనాయుడు (గజపతి నగరం), తోట త్రిమూర్తులు (రామచం ద్రాపురం), యరపతినేని శ్రీనివాసరావు(గురజాల), బి.కె.పార్థ సారధి(పెనుగొండ), ఎమ్మెల్సీ బీద రవిచంద్ర సభ్యులుగా వున్నారు. అదే విధంగా వైఎస్సార్ సిపి తరపున ఎమ్మెల్యేలు దాడిశెట్టి రాజా(తుని), ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్సీ పిల్లి సుభాష్ చంద్రబోస్ వున్నారు. భారతీయ జనతా పార్టీ నుంచి పి.విష్ణుకుమార్ రాజు(విశాఖపట్నం) సభ్యులుగా వున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సిపి సభ్యులు పట్టిసీమపై అవకతవకల విషయంలో విమర్శలకు దిగిన పక్షంలో విపక్షానికి చెందిన సభ్యులు ఎదురు దాడికి దిగే అవకాశాలు లేకపోలేదు.

24న ఫైనాన్స్‌పై సమావేశం

కాగా ఒకవైపు ఇరిగేషన్ కు సంబంధించి పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశం వాడివేడిగా జరుగుతుందని భావిస్తున్న నేపథ్యంలో ఈ నెల 24న రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై బుధవారం మరో సమావేశం జరగనుంది. కాగ్ నివేదికలోనూ రాష్ట్రప్రభుత్వ తప్పిదాలను ఎత్తిచూపారని భావిస్తున్నారు. దీంతో అధికార, ప్రతిపక్షసభ్యుల మధ్య అసెంబ్లీని తలపించే రీతిలో వాదనలు తలెత్తే అవకాశాలు లేకపోలేదు.

అధికారులపై ఫిర్యాదు తప్పదా...

కాగా గత సమావేశం సందర్భంగా ప్రభుత్వ తీరుపై పీఏసీ ఛైర్మన్ మండిపడ్డారు. దీంతో తాజా సమావేశం సందర్భంగా మరోసారి సర్కారు తీరుపై నిరసన వ్యక్తం చేసే అవకాశాలు లేకపోలేదు. కీలకమైన అధికారులు సమావేశానికి రాకపోతే ఏమి చేయాలనే దిశగా ఛైర్మన్ కసరత్తు చేస్తున్నారని సమాచారం. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వి.దినేష్‌కుమార్‌ను కలవాలనే యోచనలో ఆయన వున్నారని సమాచారం.

తిరుపతి, కాకినాడకు ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సికింద్రాబాద్ - తిరుపతి, కాకినాడ - సికింద్రాబాద్ మధ్యన ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నామని దక్షిణ మధ్య రైల్వే తెలియచేసింది. సికింద్రాబాద్ - తిరుపతి ప్రత్యేకరైలు ఈ నెల 25న సికింద్రాబాద్ నుండి బయలుదేరి మరుసటి రోజు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 28న తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు సికింద్రాబాద్ చేరుకుంటుంది. అదే విధంగా కాకినాడ - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 28న కాకినాడలో బయలుదేరి మరుసటి రోజు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లను మార్గమధ్యలోని అన్ని ప్రధానమైన స్టేషన్లలో నిలుపుదల చేయడం జరుగుతుందని తెలియచేశారు.

ముంబై మారథాన్‌లో
రేచల్ ఛటర్జీకి బంగారు పతకం



అమరావతి, ఆంధ్రప్రభ: ముంబైలో నిర్వహించిన మారథాన్ - 2018లో మాజీ ఐఏఎస్ అధికారిణి రేచల్ ఛటర్జీ బంగారు పతకాన్ని సాధించారు. జనవరి మూడో ఆది వారం సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న ఈ క్రీడలో రేచల్ ఛటర్జీ 65 నుండి 69 ఏళ్ల కేటగిరీలో బంగారు పతకాన్ని సాధించారు. రేచల్ చటర్జీ ముంబై మారథాన్‌లో బంగారు పతకాన్ని సాధించడం ఇది నాలుగో సారి. నిర్ణీత 42.105 కి.మీ. దూరాన్ని 4:44:20 సమయంలో చేరుకుని నాలుగోసారి విజయకేతనం ఎగుర వేశారు. రేచల్ ఛటర్జీ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నియమించిన తొట్టతొలి మహిళా ఛైర్మన్‌గా గుర్తింపబడ్డారు. ప్రస్తుతం ఆమె 69 ఏళ్ళ వయస్సులో ఈ పోటీల్లో పాల్గొని అందరికీ క్రీడా స్ఫూర్తిని నింపారు. అంతేకాకుండా ఆమె అనంతపురం జిల్లా కలెక్టరుగా, హైదరాబాద్ మునిసిపల్ కమిషనర్‌గా, ఏపీ ట్రాన్స్‌కోకు ఛైర్మన్ అండ్ ఎండీగా, వైద్య ఆరోగ్య శాఖ, సాంఘీక సంక్షేమ శాఖలకు ప్రిన్సిపల్ సెక్రటరీగా, కేంద్ర ప్రభుత్వ చేనేత మంత్రిత్వ శాఖలో డైరెక్టరుగా పనిచేసి అందరి మన్ననలు పొందారు.

జాతీయ హాకీ జట్టు ఎంపిక పూర్తి

క్రీడాకారుల్లో క్రమశిక్షణ ఎంతో అవసరం: నిరంజన్‌రెడ్డి



జాతీయ హాకీ క్రీడకు ఎంపికైన మహిళా క్రీడాకారుల జట్టు

అమరావతి, ఆంధ్రప్రభ: 26 నుండి జార్ఖండ్‌లో జరుబోయే 8వ జాతీయ మహిళా హాకీ క్రీడకు ఏపీ నుండి టీమ్‌ను సిద్ధం చేసినట్లు ఏపీ హాకీ క్రీడా కార్యదర్శి ఎం నిరంజన్ రెడ్డి తెలిపారు. స్థానిక మాకినేని బసవపున్నయ్య క్రీడా ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన హాకీ క్రీడాకారుల శిక్షణా ముగింపు శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 10 నుండి 23వ వరకు హాకీ క్రీడకు సంబంధించి మహిళా క్రీడాకారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించనట్లు తెలిపారు. ఈ శిక్షణా సమయంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 18 మంది క్రీడాకారులను గుర్తించి వారిని జాతీయ హాకీ క్రీడలకు పంఉతున్నట్లు తెలిపారు. ఎప్పుడైనా క్రీడాకారులకు నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళిక తప్పనిసరిని ఆయన తెలిపారు. ఎంత క్రమశిక్షణతో తర్ఫీదు పొందితే అంత మంచి క్రీడాకారులుగా వెలుగొందుతారన్నారు. ఈ ప్రాథమిక సూత్రాన్ని క్రీడా కారులు తూ.చ. తప్పకుండా అమలుచేస్తే భవిష్యత్తులో విజయకేతం ఎగురవేయడం ఖాయమన్నారు. తద్వారా రాష్ట్రానికి, దేశానికి వన్నె తేవచ్చన్నారు. ఈ విధంగా రాణించే క్రీడాకారులకు రాష్ట్రప్రభుత్వ ఉద్యోగాలను ప్రత్యేక కోటాకింద పొందే అవకాశముందన్నారు. భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవడం క్రీడాకారుల చేతిలోనే ఉందన్నారు. అనంతరం క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ హాకీ రిఫరీ జి హర్షవర్ధన్, జాతీయస్థాయి క్రీడాకారులు అజయ్ బాబు, శ్రీనివాసరావు, నూతనంగా ఎంపికైన జట్టు కోచ్‌లు జి లక్ష్మీ కరుణ, కే రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే..

తలారి మల్లీశ్వరి, పిల్లిగోళ్ల జ్యోతి, మాదుగుల భవానీ, లొట్ల మేరీ, చబాల వాణి, షేక్ ఫౌజియా, బాలగొండ మహేశ్వరి, పిచ్చపాటి హాజిత, ఉండబంద జ్యోతి, యర్రబల్లి ప్రవల్లిక, కూర్మపు రమ్య, బండారు పూజిత, కాలపురెడ్డి వీర వెంకట దుర్గ, బొక్కం స్పందన, చిన్నిపల్లి పార్వతి, గీర స్నేహ, ప్రత్తిపాటి జ్యోతి, కొసరాజు జయా చౌదరి జాతీయ మహిళా హాకీ క్రీడా టీమ్‌కు ఎంపికయ్యారు.

వీరపునాయనపల్లి తహసీల్దార్ అరెస్టు

వేంపల్లి, ప్రభన్యూస్: చింతలమల్లి సొసైటీ అక్రమాల కేసులో వీరపునాయనపల్లి తహసీల్దార్ కృష్ణా నాయక్‌ను అరెస్టు చేసినట్లు వేంపల్లి పోలీసులు తెలిపారు. కృష్ణా నాయక్ తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను రిమాండ్‌కు పంపినట్లు పులివెందుల రూరల్ సీఐ రామకృష్ణుడు తెలిపారు.

ఫిల్మ్‌నగర్ దైవసన్నిధానంకు
నూతన పాలకమండలి

● అధ్యక్షుడిగా మోహన్‌బాబు, కార్యదర్శిగా పరుచూరి గోపాలకృష్ణ ● 12 మందితో పాలకమండలి ప్రకటించిన శారదాపీఠం



విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో: హైదరాబాద్ జంట నగరాలుతో పాటు తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రాచుర్యం పొందిన దైవసన్నిధానం ఆలయంకు విశాఖ శారదాపీఠం తరుపున నూతన పాలక మండలిని నియమించడం జరిగింది. ఈ మేరకు పీఠాధిపతి స్వరూపానందేంద్రసరస్వతి మహాస్వామి ఆధ్వర్యంలో గత 13 ఏళ్లుగా భక్తులతో మహాక్షేత్రంగా దైవసన్నిధానంగా విరాజిల్లుతుంది. ఈ మేరకు శారదాపీఠం తరుపున 12 మందితో నూతన పాలకమండలిని సోమవారం ప్రకటించారు. అధ్యక్షులుగా మంచు మోహన్‌బాబు, కార్యదర్శిగా పరుచూరి గోపాలకృష్ణ ఇతర పదవుల్లో వై.గిరిబాబు, కె.రఘురామ రాజు, కృష్ణంరాజు, టి.చెన్నప్పరెడ్డి, వి.చాముండేశ్వరినాద్, వి.రామ్‌ప్రసాద్, కె.సురేఖ, కోమటరెడ్డి లక్ష్మి, లక్ష్మి, జి.వెంకట లక్ష్మి, యు.శ్యామలాదేవి తదితరులు పాలకమండలి కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర భక్తులనుద్దేశించి అనుగ్రహబాషణం చేశారు. భక్తులు మనోభావాలు దెబ్బతినకుండా సంప్రదాయాలను కాపాడుతూ దైవసన్నిధానం అభివృద్ధికి పాలక మండలి పాటుపడాలని, ఇదే సమయంలో ఆలయ కీర్తిప్రతిష్టలు పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శారదాపీఠం ఉత్తరపీఠాధిపతి కిరణ్‌కుమార్ శర్మ, పీఠం శ్రీకార్యం కామేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీపై
అనర్హత వేటు వేయండి

అసెంబ్లీ కార్యదర్శికి వినతి పత్రం అందజేసిన టీడీపీ నేతలు

అమరావతి, ఆంధ్రప్రభ బ్యూరో: రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీపై అనర్హత వేటు వేయాలని తెలుగు దేశం పార్టీకి చెందిన ఎమ్మెల్సీ బీద రవీంద్ర, వేమిరెడ్డి పట్టాభి రెడ్డిలు అసెంబ్లీ అధికారులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈమేరకు సేకరించిన వివరాల ప్రకారం ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టబద్రుల ఎమ్మెల్సీగా వైయస్సార్ కాంగ్రెస్ బలపర్చిన పీడీఎఫ్ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసుల రెడ్డి ఒక కేసులో నేరం రుజువై రెండేళ్లపాటు శిక్ష పడిందని వారు తమ లేఖలో పేర్కొన్నారు. నేర చరిత్ర కలిగిన శ్రీనివాసుల రెడ్డి పెద్దల సభలో ఉండేందుకు అర్హత లేదని, కాబట్టి ఆయనపై అనర్హత వేటు వేయాలని కోరారు. అనర్హత వేటు వేసి తక్షణమే సదరు ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు నిర్వహించాలని వారు తమ అభ్యర్థనలో కోరారు. అయితే, వీరి అభ్యర్థనను స్వీకరించిన అసెంబ్లీ అధికారులు ఈ దరఖాస్తును మండలి ఛైర్మన్‌కు పంపుతా మని తెలిపారు. గత ఎన్నికల్లో శ్రీనివాసుల రెడ్డి తమ సమీప టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి పట్టాభి రెడ్డిపై 4,559 ఓట్ల మెజార్టీతో గెలుపొందిన విషయం పాఠక విదితమే. అయితే అసెంబ్లీ అధికారులకు ఫిర్యాదు చేసిన బీదా రవీంద్రతోపాటు శ్రీనివాసుల రెడ్డికి ప్రత్యర్థిగా బరిలో నిలచిన టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి పట్టాభి రెడ్డి కూడా ఉన్నారు.

'బ్రహ్మణీ'లో డీఆర్ఐ సంస్థ దాడులు

జమ్మలమడుగు రూరల్, ప్రభ న్యూస్: ఎంతో మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి దొరుకుతుందని, ఎంతో ఆర్భాటంగా దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర రెడ్డి జూన్ 2007 సంవత్సరంలో స్వహస్తాలతో శంఖుస్థాపన చేసిన బ్రహ్మణీ ఉక్కు పరిశ్రమపై సోమవారం డిఆర్ఐ సంస్థ దాడి చేసి లెక్కలోకి రాని రూ. 190 కోట్ల విలువ గల మిషనరీని అక్రమంగా నిల్వ ఉంచారని సీజ్ చేశారు. సోమవారం సాయంత్రం జమ్మలమడుగు మండల పరిధిలోని అంబవరం పంచాయతీలో 2007 సంవత్సరంలో శంఖుస్థాపన చేసిన బ్రహ్మణీ స్టీల్‌ప్లాంట్ నందు డిఆర్ఐ సంస్థ ప్రతినిధులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. 2009 సంవత్సరంలో డిఆర్ఐ సంస్థ విదేశాల నుంచి ఓడరేవు ద్వారా రూ. 190 కోట్ల విలువ గల అత్యాధునిక టెక్నాలజీ గలిగిన మిషన్లను దిగుమతి చేసుకుంది. వీటిని బ్రహ్మణీ స్టీల్‌ప్లాంట్‌లో నిర్మించేలా ఒప్పందం చేసుకొని అక్క డికి తరలించింది. అయితే అప్పటి నుంచి బ్రహ్మణీ స్టీల్‌ప్లాంట్ యాజ మాన్యం వీటిని వాడుకోకుండా ఎక్కడ బడితే అక్కడ పారవేశారు. దీంతో సమాచారం తెలుసుకున్న డిఆర్ఐ సంస్థ ప్రతినిధులు సోమవారం సాయం త్రం దాడులు చేసి వృధాగా పడేసిన పరికరాలను పరిశీ లించారు. ఎంతో విలువైన ఈ మిష న్లను వాడుకోకుండా తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వృధాగా పడవేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులో వీటిని అక్రమంగా ప్రభుత్వానికి ఎటువంటి పన్నులు చెల్లించకుండా దిగుమతి చేసుకున్నట్లు సమాచారం. దీంతో బ్రహ్మణీ స్టీల్‌ప్లాంట్ యజ మాని జనార్ధన రెడ్డికి అతి పెద్ద షాక్ తగిలినట్టు అయింది. ముందు ముం దు మరెన్ని అక్రమాలు బ్రహ్మణీ లో బయట పడతాయో వేచి చూడాల్సిందే.

బీజేపీ, మోడీ చెప్పినట్లు
నడుస్తున్న రాష్ట్రపతి

● అత్యుత్సాహంతో ఆప్ ఎమ్మెల్యేలపై వేటు: సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

అమరావతి, ఆంధ్రప్రభ: దేశ ప్రథమ పౌరుడైన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రాజ్యాంగానికి భిన్నంగా వ్యవహరించి 20 మంది ఆఫ్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయటాన్ని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఖండించారు. అత్యున్నత పదవిలో ఉన్న రాష్ట్రపతి కోవింద్ ప్రధాని నరేంద్ర మోడీకి కొంగ జపం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రపతి హోదలో ఉన్న వ్యక్తి పై విమర్శలు చేయాల్సి రావటం దురదుష్టకరం అన్నారు. కోర్టు పరిధిలో ఉన్న ఎమ్మెల్యేల పై అనర్హత వేటు వేయటం న్యాయవ్యవస్థను తక్కువ చేయటమే అన్నారు. విజయవాడలోని సీపీఐ పార్టీ కార్యాలయం దాసరి భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్రపతి వ్యవహార శైలిలో పై నారాయణ మండి పడ్డారు. ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీ ఉండగానే అప్ 67 స్థానాలను కైవసం చేసుకోవడంతో ఆ ప్రభుత్వం పై కత్తి కట్టారన్నారు. పార్లమెంటరీ కార్యదర్శులుగా ఉన్నారనే నెపంతో వారి పై అనర్హత వేటే వేయటం శోచనీయమన్నారు. బీజేపీ, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రల్లో ఒకలా, విపక్షాలు అధికారంలో ఉంటే మరొకలా కేంద్రం వ్యవహరిస్తోందన్నారు. రెండు రోజులలో పదవీ విరమణ చేసే ఎన్నికల అధికారి పాలనాపరమైన నిర్ణయాన్ని తీసుకుంటే ఏ విధంగా అమలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రపతి వద్ద అనేక అంశాలు పెండింగ్ లో ఉండగా కేవలం ఢిల్లీ ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడు పై అత్యుత్సాహం చూపించాటమేనని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణాలో పార్టీ ఫిరాయించిన శాసన సభ్యులను మంత్రులుగా అధికార దర్పాన్ని అనుభవిస్తున్నా పట్టించుకోని ఎన్నికల సంఘం, రాష్ట్రపతి ఆప్ ఎమ్మెల్యేల పై వెంటనే ఎలా నిర్ణయం తీసుకుంటారన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో పార్టీ ఫిరాయింపుదారుల పై ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. దేశంలో న్యాయవ్యవస్థ పూర్తిగా సంక్షభంలో పడిపోయిందని నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు.

గవర్నర్ ఆహ్వానం తిరస్కరణ

గవర్నర్‌నరసియాన్ ఆహ్వానాన్ని నారాయణ తిరస్కరించినట్లు ప్రకటించారు. 26న రిపబ్లిక్ డే సందర్భంగా ఎట్ హోం కార్యక్రమానికి నారాయణను గవర్నర్ ఆహ్వానించినట్లు చెప్పారు. తెలంగాణా ప్రభుత్వాన్ని పొగడ్తలతో ముంచెత్తి గవర్నర్ వ్యవస్థకే నరసింహన్ కళంకం తీసుకువచ్చారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నరసింహన్ చేసిన వ్యాఖ్యలు, పద్ధతిపై సంతృప్తిగా లేనని, అందుకుగాను గవర్నర్ ఇచ్చే విందుకు వెళ్ళి తిని జీర్ణించుకోలేకనే ఆ కార్యక్రమానికి హాజరు కావడం లేదన్నారు. నరసింహన్ అంటే తనకు వ్యక్తిగతంగా ఎంతో అభిమానమని , ఇద్దరి మధ్య మంచి స్నేహసంబంధాలు ఉన్నాయని స్పష్టం చేశారు.

వరల్డ్ క్లాస్ రైల్వేస్టేషన్‌గా నెల్లూరు

● అభివృద్ధి పనులకై రూ.60 కోట్లు కేటాయింపు ● అన్ని వసతులు ఏర్పాటు చేస్తాం ● బిట్రగుంట ప్రాంతాన్ని కూడా అభివృద్ధి చేస్తాం: సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్



నెల్లూరు రైల్వేస్టేషన్‌లో సౌకర్యాల కల్పనపై క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న జీఎం, ఎంపీ తదితరులు

నెల్లూరు, ప్రభన్యూస్: వరల్డ్‌క్లాస్ రైల్వేస్టేషన్‌గా నెల్లూరు రైల్వేస్టేషన్‌ను తీర్చిదిద్దుతామని దక్షిణ మధ్యరైల్వే జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ తెలియజేశారు. సోమవారం ఆయన నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డితో కలిసి వేదాయపాళెం, నెల్లూరు దక్షిణం, నెల్లూరు రైల్వేస్టేషన్లలో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అనంతరం నెల్లూరు రైల్వేస్టేషన్ వీఐపీ లాంజ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి అనేది నిరంతరం సాగే ప్రక్రియ అన్నారు. ప్రస్తుతం రూ.60కోట్లతో నెల్లూరు రైల్వేస్టేషన్‌ను, దక్షిణం, వేదాయపాళెం రైల్వేస్టేషన్లలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. నెల్లూరుజిల్లాలోని రైల్వే అభివృద్ధి పనులపై పూర్తి సమాచారం అనంతరం బిడ్‌లను పిలిచి అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించి ఆధునీకరణ చేస్తామన్నారు. రైల్వేలను ఎయిర్‌పోర్ట్‌ల తరహాలో ప్రైవేటు భాగస్వామ్యంతో ఆధునీకరణ చేసే ఆలోచన ప్రభుత్వంలో ఉందన్నారు. రైల్వే పనులు సంబంధించి ఆర్ఎల్ఏ, ఎన్‌బీసీసీ ఆధ్వర్యంలో నాణ్యతతో పనులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రస్తుత ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి నెల్లూరుజిల్లా రైల్వేకు సంబంధించి పలు సమస్యలు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. దశలవారీగా వాటన్నింటినీ పరిష్కారం చేస్తామన్నారు. బిట్రగుంట రైల్వేస్టేషన్‌లో అందుబాటులో ఉన్న వెయ్యి ఎకరాలను ఏ విధంగా వినియోగించుకుని రైల్వేకు ఉపయోగపడుతుందో ఆ విధంగా బిట్రగుంట రైల్వేస్టేషన్‌ను కూడా అభివృద్ధి చేస్తామన్నారు. ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి తరచూ తనను కలుస్తూ నెల్లూరు సమస్యలను దృష్టికి తీసుకురావడం జరిగిందని వాటిలో కొన్నింటికి పరిష్కారం చేశామని, మిగిలిన వాటిని కూడా పరిష్కారం చేస్తామన్నారు.

నెల్లూరు జిల్లాకు రైల్వే సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి : ఎంపీ మేకపాటి

నెల్లూరుజిల్లాకు సంబంధించి నెల్లూరు, కావలి, నాయుడుపేట, గూడూరు, ఉలవపాడు, బిట్రగుంట తదితర స్టేషన్ల అభివృద్ధికి సంబంధించి ఇప్పటికే జీఎంతో చర్చించి వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. నెల్లూరు ఆధునీకరణ చేసేందుకు తన విజ్ఞప్తి మేరకు జీఎం ప్రత్యేకంగా నెల్లూరు రావడం జరిగిందన్నారు.నెల్లూరులోని ఫ్లాట్‌ఫాంలు భద్రతాపరంగా పొడవు పెంచడం, నూతన ఫ్లోరింగ్, టాయిలెట్స్ సౌకర్యం అలాగే దక్షిణ రైల్వేస్టేషన్‌లో అధికంగా టాయిలెట్స్ ఏర్పాటు, నెల్లూరులో కోరమాండల్, గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌లు ఆపేందుకు కావలిలో యశ్వంత్‌పూర్, శబరి ఎక్స్‌ప్రెస్‌లు ఆపేందుకు, ఉలవపాడులో హౌరా, కృష్ణాట్రైన్‌లు ఆపేందుకు జీఎంను కోరడం జరిగిందన్నారు. కృష్ణపట్నం, ముత్తుకూరు రోడ్డు రద్దీ పెరిగినందున ముత్యాలపాళెం వద్ద రైల్వే ఫ్లైవర్‌కు వినతిపత్రం అందించామన్నారు. జిల్లాలోని అన్ని రైల్వేస్టేషన్లు ఆధునీకరణకై, బిట్రగుంటలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న దాదాపు వెయ్యి ఎకరాలు రైల్వేస్థలంలో ప్రత్యేక ఇంజన్ రిపేర్ యూనిట్‌ను నెలకొల్పాలని కోరామన్నారు. రైల్వేస్టేషన్లలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరామన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, రైల్వే ఉద్యోగుల యూనియన్ నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు పలు రైల్వే సమస్యలకు సంబంధించి ఇచ్చిన వినతిపత్రాలను జీఎం స్వీకరించి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. పలువురు రైల్వే ఉన్నతాధికారులు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టాన్ని
పటిష్టంగా అమలు పర్చాల్సిందే

రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కె.శ్రీవాణి



విశాఖపట్నం, ప్రభ న్యూస్ బ్యూరో : మహిళలకు పని చేసే చోట భద్రత, రక్షణ కల్పించేందుకు మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013ను పటిష్టంగా అమలు పర్చాల్సి న అవసరం ఎంతైనా వుందని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కె.శ్రీవాణి అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ చట్టం అమలు ఆవశ్యకతను వివరించారు. ప్రతి మనిషికి స్వేచ్ఛా, స్వాతంత్ర్యం, సమానత్వ హక్కులను ప్రాథమిక హక్కులుగా భారత రాజ్యాంగం ప్రసాదించిందన్నారు. అయితే ఈ హక్కులను పూర్తి స్థాయిలో మహిళా ఉద్యోగులు వినియోగించుకోక పోవడంతో పలు సామాజిక సమస్యలు, ఆటుపోట్లు ఎదురవుతున్నాయన్నారు. ఫలితంగా సమాజంలో మహిళలపై లైంగిక వేధింపులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. ప్రత్యేకించి ఐటి రంగంలో ఇటువంటి వేధింపులు మరీ ఎక్కువగా వున్నాయన్నారు. మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013ను పటిష్టంగా అమలు పర్చకపోవడమే ఇందుకు కారణమన్నారు. ఈ చట్టం ప్రకారం కనీసం పది మంది మహిళా ఉద్యోగులు పని చేసే అన్ని ప్రభుత్వం, ప్రయివేటు కార్యాలయాల్లో అంతర్గత ఫిర్యాదుల సంఘాలను లిఖిత పూర్వకంగా ఏర్పాటు చేసి, ఈ సంఘం ప్రాధాన్యతను మహిళా ఉద్యోగులందరికీ వివరించాల్సి వుందన్నారు. పది మంది కంటే తక్కువ మహిళా ఉద్యోగులు పని చేసే స్థలాల్లోని మహిళా ఉద్యోగులు వారి ఫిర్యాదులను స్థానిక ఫిర్యాదుల సంఘానికి చేసుకోవాల్సివుంటుందన్నారు. జిల్లా కలెక్టర్ లేదా ఆయనచే నియమించిన వారి అధ్యక్షతన ఈ స్థానిక ఫిర్యాదుల సంఘం పని చేస్తుందన్నారు. మహిళా ఉద్యోగుల నుంచి ఇటువంటి ఫిర్యాదులు అందిన వెంటనే ఈ కమిటీలు తక్షణమే విచారణ జరిపి బాధ్యులైన వారిపై తగు చర్యలు తీసుకుంటాయన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యురాలు సి.ఉమాదేవి, డొమెస్టిక్ వైలెన్సు కౌన్సిలర్ జ్యోతిలత, ఒన్ స్టాప్ సెంటర్ ఎడ్మినిస్ట్రేటర్ పద్మావతి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సత్యనారాయణ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలకనుగుణంగా పనిచేయాలి

● ఉద్యోగులకు ఎక్సైజ్ మంత్రి జవహర్ సూచన



అమరావతి, ఆంధ్రప్రభ : ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని ఆబ్కారీ శాఖ మంత్రి కె.ఎస్.జవహర్ అన్నారు. చిత్తశుద్ధితో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వపరంగా సముచిత గుర్తింపు ఉంటుందని ఆయన చెప్పారు. ఏపీ ఎక్సైజు అండ్ ప్రొహిబిషన్ ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం రూపొందించిన డైరీని సోమవారం విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి జవహర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయి పంటల ధ్వంసం, బెల్టు షాపుల నిలువరించడంలో ఎక్సైజు ఉద్యోగుల పాత్ర ప్రశంసనీయమన్నారు. రాష్ట్రంలో 95శాతం మేర బెల్టు షాపులు నిలువరించామని, నవోదయం ద్వారా నాటు సారా తయారీ, అమ్మకాలను పూర్తిగా అరికట్టామని చెప్పారు. రేపల్లె సహా కల్తీ మద్యం రాకెట్‌లో ఏ ఒక్కరున్నప్పటికీ ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన తర్వాత కష్టాలతో కష్టాలతో పాలన ప్రారంభించినప్పటికీ ఉద్యోగుల సంక్షేమానికి ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. తెలంగాణా రాష్ట్రంలో పరిస్థితులు వేరని చెపుతూ ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యాలకు అనుగుణంగా ఉద్యోగులు నిష్పక్షపాతంగా పని చేయాలన్నారు. ఎక్సైజు ఉద్యోగుల అంతర్గత, బహిర్గత సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేయనున్నట్లు మంత్రి జవహర్ చెప్పారు. క్లిష్టమైన పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ ఉద్యోగుల సంక్షేమానికి అన్ని విధాలుగా సహకరించనున్నట్లు తెలిపారు. శాఖాపరమైన విధుల నిర్వహణలో శిక్షలకు గురికాకుండా విధులు నిర్వహిస్తారనే ఆశాభావాన్ని మంత్రి జవహర్ వ్యక్తం చేశారు. ప్రభుత్వపరంగా తీసుకుంటున్న చర్యలు ప్రజల సంక్షేమం దృష్ట్యా తీసుకుంటున్నవే తప్ప మరో విధంగా భావించొద్దన్నారు. ఉద్యోగుల డైరీని ఆవిష్కరించడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆబ్కారీ శాఖ కమిషనర్ డాక్టర్ పి.లక్ష్మీనరసింహం మాట్లాడుతూ రాష్ట్రంలో బెల్టు షాపులను నిలువరించడం వలన ప్రభుత్వ ఆదాయం తగ్గించలేదన్నారు. ఇదే విషయాన్ని ఆర్థికమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. మూడు త్రైమాసిక వాయిదాల్లో రూ.1200 కోట్ల ఆదాయం ఆర్జించామని, రానున్న మూడు నెలల్లో మిగిలిన 25శాతం ఆదాయాన్ని కూడా ఆర్జించనున్నామని చెప్పారు. ఎక్సైజు పనితీరు గుర్తించడం వలనే రానున్న బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించేందుకు ఆర్థిక మంత్రి అంగీకరించారన్నారు. వీటితో సొంత భవనాల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. బేవరేజస్ తరుపున 25 డిపోలు ఉండగా మరో ఏడు అదనంగా ఏర్పాటు కానున్నట్లు చెప్పారు. వీటికి కూడా సొంత భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం సూచనప్రాయంగా అంగీకరించిందని తెలిపారు. ఆయా భవనాల నిర్మాణాలకు జిల్లా జాయింట్ కలెక్టర్లతో సమావేశమై స్థలాల సేకరణకు ప్రభుత్వపరంగా ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఇదిలా ఉండా స్టేషన్ల నిర్వహణకు ఇచ్చే రూ.10వేలను పెంచే ప్రతిపాదన కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. పోలీసు స్టేషన్ల నిర్వహణకు ప్రభుత్వం రూ.4వేలు మాత్రమే ఇస్తుండగా, ఎక్సైజు స్టేషన్ల నిర్వహణకు రూ.10వేలు ఇస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నిర్వహణ ఖర్చులకు సంబంధించి వాస్తవ లెక్కలను చూపినట్లయితే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరుకు కృషి చేయనున్నట్లు చెప్పారు. ఏసీబీ కేసులు తదితర ఇబ్బందుల కారణంగా పదోన్నతులు ఆగిన వారికి ఏడాది ఇచ్చేందుకు మార్గం సుగమం చేస్తున్నామని చెప్పారు. అంతకు ముందు ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరసింహులు ఉద్యోగుల ఇబ్బందులను సభా ముఖంగా ప్రస్తావించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎం.దేవకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎక్సైజు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కె.వెంకటేశ్వర రావు, ఎన్‌జీవోల సంఘం అధ్యక్షుడు పి.అశోక్‌బాబు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర రెడ్డి, ఓఎస్‌డి కొమ్ముల నాగేశ్వరరావు, సంఘం ప్రధాన కార్యదర్శి కె.వి.రమణ, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

వేగంగా పంట రుణాలు!

● పత్తికి మద్దతు ధర లభించేలా చూడండి ● ధాన్యం సేకరణపై సీఎం మార్గదర్శకాలు ● నీరు-ప్రగతి టెలికాన్ఫరెన్స్‌లో సీఎస్ దినేష్‌కుమార్



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని పత్తి రైతులందరికీ మద్దతు ధర లభించేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటనకు వెళ్తూ కూడా ధాన్యం సేకరణ, పత్తి మద్దతు ధరపై మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. ధాన్యం సేకరణ కేంద్రాలపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా దృష్టి సారించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ నీరు - ప్రగతి వ్యవసాయంపై వివిధ జిల్లాల కలెక్టర్లు, వివిధశాఖల ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కృష్ణా జిల్లాలో జరుగుతున్న ధాన్యం సేకరణ వివరాలను కలెక్టర్ లక్ష్మీకాంతంను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశామని, అయితే వాటిని రైస్ మిల్లర్లు, దళారులు దుర్వినియోగం చేసే పరిస్థితి ఉందన్నారు. దీనిపై అధికార యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. రీ సైక్లింగ్ బియ్యాన్ని ధాన్యం సేకరణ కేంద్రాలకు తీసుకువస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బియ్యం రీ సైక్లింగ్‌కు పాల్పడే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. రీసైక్లింగ్‌జరుగుతుందన్న అనుమానం ఉన్న మిల్లుల్లో 2,3నెలల విద్యుత్ వినియోగం లెక్కలు తీసి దీనికి అడ్డుకట్ట వేయాలన్నారు.

పంట రుణాలు పంపిణీ వేగవంతం చేయండి..

ఖరీఫ్‌లో పంట రుణాలు పంపిణీ సంతృప్తికరంగా జరిగిందని, రబీలో కొన్ని జిల్లాల్లో మందకొడిగా జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానంగా శ్రీకాకుళం, కర్నూలు, నెల్లూరు, విజయనగరం జిల్లాల్లో రుణాల పంపిణీని వేగవంతం చేయాల్సిన అవసరమున్నదన్నారు. అదే విధంగా కృష్ణా , గుంటూరు జిల్లాల్లో కౌలు రైతులకు పంట రుణాలు పంపిణీ వేగం పుంజుకోవాల్సి ఉందన్నారు. ఉద్యాన రంగంలో మైక్రో ఇరిగేషన్ లక్ష్యాన్ని సగం మాత్రమే అధిగమించామని, మిగిలిన లక్ష్యాన్ని 3నెలల్లో పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని దినేష్ కుమార్ ఆదేశించారు. ఈ ఏడాది 2,06,500 హెక్టార్లకు గాను 1.12లక్షల హెక్టార్లు మాత్రమే మైక్రో ఇరిగేషన్‌కు వెళ్ళామన్నారు. ప్రస్తుతం ఉన్న పండ్ల తోటల సాగు 41లక్షల ఎకరాల్లో ఉందని, దీనిని కోటి ఎకరాలకు తీసుకువెళ్ళాలని ముఖ్యమంత్రి లక్ష్యాన్ని నిర్దేశించిన విషయాన్ని ఈ సందర్భంగా దినేష్‌కుమార్ అధికార యంత్రాంగానికి గుర్తుచేశారు. రాయలసీమ జిల్లాల్లో మైక్రో ఇరిగేషన్‌కు మరింత ప్రోత్సాహం అందించాలని కోరారు. శ్రీకాకుళం జిల్లాలో మత్స్య కారుల సంఖ్య అధికంగా ఉందని, దీనికి అనుగుణంగా బోట్లు, వలలు, కేటాయించాలని ఆ జిల్లా కలెక్టర్ ధనుంజయ్ రెడ్డి సీఎస్ దినేష్ కుమార్‌ను కోరారు. దీనిపై స్పందించిన ఆయన కార్పొరేషన్ ల ద్వారా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ వారం పంట కుంటల త్రవ్వకం సరిగాలేదని రానున్న నాలుగు నెల్లలో మరింత చురుకుగా తవ్వకాలు సాగాలని సూచించారు. చెరువులు, కాల్వ గట్లపై కంపలను తొలగించే పనులను ముమ్మరం చేయాలని ఆదేశించారు. అన్ని జిల్లాల్లో 2016-17 ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని , అదే విధంగా 2017-18 మంజూరు లక్ష్యాన్ని అధిగమించాలని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్ లక్ష్యాలను అధికార యంత్రాంగం మరింత శ్రద్ధ చూపాలని కోరారు.

నరేగా పనుల బాధ్యత కలెక్టర్లదే..

నరేగా పనుల బాధ్యత జిల్లా కలెక్టర్లదేనని, ఈ పనులకు నాయకత్వం వహించి ప్రతీ జిల్లాలో వ్యక్తిగతంగా పనుల పురోగతిని పర్యవేక్షించడంతోపాటు సమీక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. నరేగాలో మెటీరియల్ కాంపోనెంట్ పనులు 40శాతం మించి మించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లేని పక్షంలో కేంద్రం నుండి అభ్యంతరాలు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో లేబర్ కాంపోనెంట్ పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న రెండు నెల్లలో ఎన్‌ఆర్‌ఎం కార్యక్రమాలపై అధికార యంత్రాంగం దృష్టి సారించాలని కోరారు. గుంటూరు, కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సహజ వనరుల నిర్వాహణ కార్యక్రమాలు తక్కువగా జరుగుతుండడంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి ఈ కార్యక్రమాలను వేగవంతం అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉపాధి కూలీలకు సకాలంలో వేతన చెల్లింపులు జరపడంతో పాటు ఏవైనా రికార్డులను పక్కాగా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు.

ఈ నెల 31లోపు జన్మభూమి వినతుల పరిష్కారం చేయాలి

5వ విడత జన్మభూమి - మా ఊరులో వచ్చిన వినతుల పరిష్కారంపై కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అధీకృత వినతులన్నింటినీ ఈనెల 31లోపు పరిష్కరించాలని దినేష్ కుమార్ ఆదేశించారు. కేవలం 18రోజుల సమయం మాత్రమే మిగిలి ఉందని, ఈ లోగా సమస్యలు, అర్జీలు ఎట్టి పరిస్థితుల్లో పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఆర్థిక పరమైన వినతులను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని సూచించారు. కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దేశించిన లక్ష్యాలను అనుగుణంగా అధికార యంత్రాంగం పనిచేయాలని, ప్రతీ జిల్లా టార్గెట్లను అధిగమించాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి రాజశేఖర్, ఉద్యానశాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి, మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్, పంచాయితీరాజ్ , వ్యవసాయ శాఖ కమిషనర్ రామాంజనేయులు, హరిజవహర్‌లాల్, ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అరుణ్ కుమార్, పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు సోమశేఖర్, ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి ఎ.వి.రాజమౌళి, ఇతర అధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

చిరంజీవి, నేను చిలుకా గోరింకల్లా గొడవపడతాం

మోహన్‌బాబు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : చిరంజీవి నేను చిలుకా గోరింకల్లా గొడవపడుతుంటామని, పాత తరం హీరో కృష్ణంరాజుతో సరదాగా ఉంటానని సినీనటుడు మోహన్ బాబు పేర్కొన్నారు. ఫిలిం నగర్ దైవసన్నిధానం చైర్మన్‌గా సినీనటుడు మోహన్ బాబు బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దైవసన్నిధా నంలో ధర్మానికి విరుద్ధంగా ఏ పనిచేయమని ఆయన తెలి పారు. బ్రాహ్మణుల మధ్య గొడవలొద్దని ఆయన సూచిం చారు. దేవుడి గుడికి చైర్మన్‌గా ఉండాలని ఎప్పుడూ కోరుకోలేదని, ఆరునెలలుగా సుబ్బిరామిరెడ్డి పట్టుబట్ట డంతో దైవసన్నిధానం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించానన్నారు. భక్తుల కోసమే ఈ బాధ్యత తీసుకున్నానన్నారు. కంచి పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి, దర్శకుడు రాఘవేందర్‌రావు, టి.సుబ్బరామిరెడ్డి, మురళీ మోహన్, చాముండేశ్వరినాథ్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సం దర్భంగా స్వరూపానందేద్ర స్వామి 12 మంది పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

నేడు టీఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నారా లోకేష్ జన్మదిన వేడుకలు

హై దరాబాద్, ఆంధ్రప్రభ : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏపీ రాష్ట్ర మంత్రి నారా లోకేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని టీఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ క్యాంపులు, రక్తదాన శిబిరాలను నిర్వహిస్తోంది. అలాగే అన్ని నియోజకవర్గాల కేంద్రాలలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్ళలో, ప్రభుత్వ ఆసుపత్రులలో పండ్ల పంపిణీలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మం చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు.

పలువురు ఐఏఎస్, ఐపీఎస్‌లకు పదోన్నతులు

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని పలువురు సీనియ ర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు పదోన్నతి కలిపిస్తూ ప్రభు త్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1993, 2005 బ్యాచ్ ఐఏఎస్ అధికారులకు ప్రిన్సిపల్, సెలక్షన్ గ్రేడ్ అధికారులుగా పదోన్నతి కలిపించగా..2000, 2004 బ్యాచ్ ఐపీఎస్ అధికారుల కు ఐజీలుగాను, డిఐజీలుగాను పదోన్నతి ఇచ్చారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన అధికారులు ప్రస్తుత విభాగాల్లోనే పని చేయాల్సి ఉందని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

పదోన్నతి పొందిన ఐఏఎస్‌లు..

రాష్ట్రంతో పాటు కేంద్ర సర్వీసుల్లో పని చేస్తూ పదోన్నతి పొందిన వారిలో 1993 బ్యాచ్‌కి చెందిన తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి అనిల్ కుమార్ సింఘాల్, జీఏడిలో కార్యదర్శిగా పని చేస్తున్న గోపాలకృష్ణద్వివేది, దేవాదాయ శాఖ కమిషనర్ వై.వి.అనురాధ, బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి బి.ఉదయలక్ష్మి, విశాఖపట్టణం పోర్టు ట్రస్ట్ చైర్మన్ ఎం.టి.కృష్ణబాబు, కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ సంయుక్త కార్యదర్శి డాక్టర్ బి.కిషోర్, ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.దమయంతి ఉన్నారు. సెలక్షన్ గ్రేడ్ ఐఏఎస్‌లుగా పదోన్నతి పొందిన వారిలో 2005 బ్యాచ్‌కి చెందిన ఏపీఎస్పీడీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముదావత్ ఎం నాయక్, టిటిడి జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పి.భాస్కర, ఉప రాష్ట్రపతి ప్రైవేటు కార్యదర్శి డాక్టర్ ఎన్.యువరాజ్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉప కార్యదర్శి ఎం.జానకి ఉన్నారు.

పదోన్నతి పొందిన ఐపీఎస్‌లు

రాష్ట్ర కేడర్‌కు చెందిన ఆరుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులు పదోన్నతి పొందారు. 2000 బ్యాచ్ ఐపీఎస్ అధికారులైన సిబిఐలో డిఐజీగా పని చేస్తున్న మనిష్ కుమార్ సిన్హా, గుంటూరు రేంజ్ డిఐజీ చేస్తున్న కె.వి.వి.గోపాల రావు, విజయవాడ జాయింట్ సీపీ బి.వి.రమణ కుమార్ ఏపీ ఏసీబీలో అదనపు డైరెక్టర్ పి.హరికుమార్ ఐజీ పదోన్నతి పొందారు. 2004 బ్యాచ్‌కి చెందిన తీరప్రాంత భద్రతా విభాగం ఎస్పీ డాక్టర్ నవీన్ గులాటీ, విజయవాడ కమిషనరేట్‌లో శాంతి భద్రతల విభాగం డీసీపీగా పని చేస్తున్న కాంతిరాణా టాటా డీఐజీ పదోన్నతి పొందిన వారిలో ఉన్నారు.

ఆస్కార్ వ్యాఖ్యాతగా ప్రియాంక చోప్రా

ముంబై : ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక ఆస్కార్ పురస్కారాల కోసం నామినేషన్లను ప్రకటించే అవకాశాన్ని ప్రియాంక చోప్రాకు అందివచ్చింది. హాలీవుడ్ తారలు రొసారియో డాసన్, మిషెల్ రొడ్రిగజ్, రెబెల్ విల్సన్‌తో కలిసి ఆమె వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నారు. బుధవారం నామినేషన్లను ప్రకటించనున్నారు. ప్రియాంక ప్రస్తుతం అమెరికన్ సీరిస్ క్వాంటికో షూటింగ్‌లో ఉన్నారు. ప్రస్తుతం ఈ షూటింగ్ అమెరికాలో జరుగుతోంది. గతేడాది ప్రియాంక ప్రధాన పాత్రలో నటించిన హాలీవుడ్ సినిమా బేవాచ్ గత ఏడాది విడుదలైంది. అనంతరం ఆమె ఏ కిడ్ లైక్ జేక్, ఇజింట్ ఇట్ రొమాంటిక్ తదితర హాలీవుడ్ చిత్రాల్లో నటిస్తున్నారు.

కొల్లేటి సమస్య పరిష్కారానికి కేంద్రం సానుకూలం

● వైద్య, ఆరోగ్య అంశాలపై ఉన్నతాధికారులతో చర్చలు ● హస్తిన పర్యటనలో ఏపీ మంత్రి కామినేని శ్రీనివాస్



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : కొల్లేరు సరస్సుపై ఆధారపడి జీవనం సాగిస్తున్న పజల సమస్య పరిష్కారానికి కేంద్రం సానుకూలంగా స్పందించింది. పర్యావరణానికి, నీటి ప్రవాహానికి ముప్పు వాటిల్లకుండా సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర పర్యావరణం, అటవీశాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ సానుకూలతను వ్యక్తం చేసినట్టు ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ వెల్లడించారు. కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలోని కొల్లేరు, కొల్లేటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారి సమస్యల పరిష్కారానికి కామినేని సోమవారం ఉదయం కేంద్ర మంత్రి హర్షవర్ధన్‌ను న్యూఢిల్లీలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. వివిధ అంశాలపై ఆయనతో చర్చించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... కొల్లేటి సరస్సు కాంటూరు పరిధి 5 నుంచి 3 కాంటూరుకు తగ్గించే అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉందని చెప్పారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పునకు లోబడి కొల్లేటి సరస్సుపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ప్రజలు జీవనోపాధిని కోల్పోకుండా తగిన సహాయం చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశామని అన్నారు. కొల్లేటిపై ఆధారపడి బతుకుతున్న వారికి ప్రభుత్వ పరంగా ఏవిధమైన నష్టపరిహారం చెల్లించలేదని, సొంత భూములు కలిగిన వారికి కూడా నష్టపరిహారం ఇవ్వలేదని హర్షవర్ధన్ దృష్టికి తీసుకు వెళ్ళినట్లు కామినేని పేర్కొన్నారు. 133 సొసైటీల పరిధిలోని సుమారు 20 వేల ఎకరాల కొల్లేటి భూమిపై ఆధారపడి పేద ప్రజలు జీవనం వివరించారు. జీవనోపాధి లేక ఇప్పటికే చాలా కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళినట్లు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు మంత్రి శ్రీనివాస్ వెల్లడించారు. దీంతోపాటు 14 వేల ఎకరాల జిరాయితీ భూమి గల రైతులు కూడా నష్టపోయే పరిస్థితి ఉన్నందున వీరందరికీ కూడా ప్రత్యామ్నాయ జీవనోపాధిని కల్పించాల్సిన అవసరం ఉందని వివరించినట్లు చెప్పారు. కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల సరిహద్దులను ఆసరాగా చేసుకొని కొల్లేటి ప్రాంత ప్రజలకు జీవనోపాధి అవకాశాలను కల్పించి ఆదుకోవాలని హర్షవర్ధన్‌ను కోరినట్లు కామినేని మీడియాకు తెలిపారు. ఈ అంశంపై ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అసెంబ్లీలో తీర్మానం కూడా చేయించి ప్రధాని నరేంద్ర మోడీ, అప్పటి అటవీ, పర్యావరణ శాఖ మంత్రులుగా పనిచేసిన ప్రకాష్ జవదేకర్, అనిల్ దవేలకు వివరించగా... మంత్రులు స్వయంగా కొల్లేరు ప్రాంతాన్ని సందర్శించి పలు సూచనలు కూడా చేసినట్లు తెలిపారు. దీనిపై రీడిఫైన్ చేసిన నివేదికను కూడా హర్ష వర్ధన్‌కు, ఆ శాఖ ఉన్నతాధికారులకు అందచేసినట్టు కామినేని శ్రీనివాస్ చెప్పారు. ప్రస్తుత ఉపరాష్ట్రపతి, నాటి కేంద్రమంత్రిగా వున్న వెంకయ్య నాయుడు దృష్టికి కూడా గతంలో ఈ వ్యవహారాన్ని తీసుకెళ్లినట్టు చెప్పారు. కొల్లేటి సరస్సులో విడిది చేసేందుకు వచ్చే ఫెలికాన్ పక్షులకు, పర్యావరణానికి ఏవిధమైన నష్టం వాటిల్లకుండా కైకలూరు నియోజకవర్గం, కైకలూరు, ఆటపాకలలో ఫిబ్రవరి 4 వ తేదీ నుంచి "ఫెలికాన్ ఫెస్టివల్"ను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కామినేని శ్రీనివాస్ పాత్రికేయులకు చెప్పారు.

రాష్ట్ర వ్యవహారాలపై కేంద్ర ఉన్నతాధికారులతో కామినేని చర్చలు

ఆంధ్రఅప్రదేశ్‌లో వైద్య, ఆరోగ్య శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలను, వాటికి కావలసిన కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకం గురించి కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి, ఉన్నతాధికారులతో చర్చించినట్లు కామినేని శ్రీనివాసరావు వెల్లడించారు. ఏపీలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ వైద్య సేవలను మరింత పటిష్ఠంగా అమలు పరిచేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో అమలు చేస్తున్న వైద్యసేవల ఇన్సూరెన్స్ పథకం పరిధిలోనికి ఎన్టీఆర్ వైద్య సేవల పథకాన్ని కూడా చేర్చాలని, దీనివల్ల ఎంతో మంది పేద ప్రజలకు మేలు చేకూరుతుందని అధికారుల దృష్టికి తీసుకెళ్ళినట్లు ఆయన చెప్పుకొచ్చారు.

29న ఉపాధ్యాయ సంఘాల ధర్నా

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం జనవరి 29న అన్ని జిల్లా కేంద్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాలు ధర్నా కార్యక్రమాలు చేపట్టనున్నాయి. రాష్ట్రంలోని మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయు లు, ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులు సమస్యలతోపాటు పాఠశాలల్లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు, ర్యాలీలు నిర్వహించనున్నారు. ప్రధానంగా 10 నెలల పిఆర్‌సి బకాయిలు వెంటనే మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం బకాయిలను మంజూరు చేయాలని ఉద్యోగులు పేర్కొంటున్నారు. అదేవిధంగా మున్సిపల్ పాఠశాల విద్యలో సర్వీస్ రూల్స్‌లోని అసంబద్ధమైన అంశాలను తొలగించాలని, సమగ్ర సీనియార్టీని తయారుచేసి పదోన్నతులు చేపట్టాలని ప్రభుత్వానికి సూచిస్తున్నారు. వీటితోపాటు పాఠశాలలకు సంబంధించి స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల బిల్లు-2017 ప్రతిపాదన విరమించుకోవాలన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

● పీఆర్‌సీ, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై కమిటీ నియామకం ● విద్యుత్ స్టోరేజ్ కోసం రెండు మండలాల్లో ప్రయోగం : మంత్రి కళావెంకటరావు



విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో : రాష్ట్రంలో విద్యుత్ ఉద్యోగుల సమస్యలను దశల వారీగా పరిష్కరించడం జరుగు తుందని రాష్ట్ర విద్యుత్‌శాఖామంత్రి కిమిడి కళావెంకటరావు తెలిపారు. సోమవారం ఏయూలో రాష్ట్ర బీసీ విద్యుత్ ఉద్యో గుల సంక్షేమ సంఘంకు చెందిన డైరీ, క్యాలెండర్లను మంత్రి చేతులు మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు పీఆర్‌సీ మంజూరు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇక విద్యుత్ సరఫరాకు సంబంధించి కేంద్రం 15 శాతానికి లైన్‌లాస్‌ను పరిమితం చేయాలని సూచించడం జరిగిందని అయితే రాష్ట్రంలో ఇప్ప టికే 9.11 శాతానికి లైన్‌లాస్‌ను తగ్గించామన్నారు. 22.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ కొరత ఉండేదని అటువంటి పరిస్థితి నుంచి అధిగమించడంతో పాటు ఇప్పుడు మిగులు విద్యుత్‌ను స్టోరేజ్ చేసుకునే స్థాయికి ఎదిగామన్నారు. ఏపీలో నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. ఇప్పటికే విద్యుత్ స్టోరేజ్ కోసం నెల్లూరు, విజయనగరం జిల్లాల్లో రెండు మండలాలను ప్రయోగాత్మకంగా ఎంపిక చేయడం జరిగింద న్నారు. మాజీ మంత్రి పెందుర్తి శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ తెలంగాణాలో ఉన్న 1250 మంది ఉద్యోగుల విషయంలో కానీ, తెలంగాణాలో 26 బీసీ కులాలను ఓసీ కులాల్లో చేర్చినప్పుడు ఏ విధంగా స్పందించని ఆర్.కృష్ణయ్య ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి బీసీ కులాలను రెచ్చగొట్టడం సరికాదన్నారు. ఈపీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ హెచ్‌వై దొర మాట్లాడుతూ విద్యుత్‌శాఖలో బీసీ ఉద్యోగులకు అవసరమైన సహకారం అందిస్తామన్నారు. ఎటువంటి సమస్యలు ఉత్పన్న మైన తక్షణమే పరిష్కరిస్తామన్నారు. తొలుత రాష్ట్ర అధ్యక్షులు పోలాకి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆయా జిల్లాల్లో విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను విపులంగా వివరిం చారు. తక్షణమే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మంత్రి కళా వెంకటరావుకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఇదే సమయంలో ప్రభుత్వానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఈపీడీసీఎల్ డైరెక్టర్ శేషు కుమార్, సంఘం నాయకులు జె.సాయిబాబు, కృష్ణమూర్తి, వి.గుణవంతుడు, జి.రంగారావు, టి.రాజేశ్వర రావు, ఏడి.బోజరాజు, పి.వి.రామరాజు, కె.కోటయ్య, ధనుంజయ, జి.రాము, ఎన్.నరసింహారావు, చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు. ఆయా జిల్లాల నుంచి వేలాది మంది ఉద్యోగులు సదస్సుకు హాజరయ్యారు.

ఎక్సైజ్ సిబ్బంది అండదండలతోనే బెల్టు షాపులు

శాసనసభ హామీల కమిటీ చైర్మన్ గాలి ముద్దు కృష్ణమనాయుడు



విజయనగరం,ప్రభ బ్యూరో: ఎక్సైజ్ సిబ్బంది అండదండ లతోనే బెల్టు షాపుల నిర్వహణ యధేచ్ఛగా సాగిపోతుందని శాసన సభ హామీల కమిటీ చైర్మన్ గాలి ముద్దు కృష్ణమనాయు డు వ్యాఖ్యానించారు. హామీల కమిటీ సమావేశంలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రానికి విచ్చేసిన ఆయన అజెండా అంశాలపై పూర్తి స్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ముద్దు క్రిష్ణమనాయుడు బెల్టు షాపుల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చాలా సీరియస్‌గా వున్నప్పటికీ ఎక్సయిజ్ సిబ్బందికి చిత్తశుద్ధి లేకపోయిం దన్నారు. కనీసం బడి,గుడిలకు దూరంగా వున్నాలన్న నిబంధనను కనీసం సరిగా అమలు కానీయని దుస్థితి వెనుక ఎక్సయిజ్ సిబ్బంది పాత్రే కీలకమైందన్నారు. జాతీయ రహదారులకు 500 మీటర్ల దూరంలో వుండాలన్న నిబంధన సక్రమ అమలు విషయంలో కూడా ఎక్సైజ్ అధికారులు కనీస చొరవ చూపని దుస్థితి నెలకొందన్నారు. అన్నింటికీ మించి రెండవ క్వాలిటీ మద్యం విక్రయాలకు ప్రోత్సాహం అందించడం ద్వారా ఎక్సైజ్ అధికారులు సర్కార్ ఆదాయానికి కూడా గండికొట్టిస్తున్న పరిస్థితి నెలకొందన్నారు. మద్యం అక్రమ వ్యాపారాలను నియంత్రించాలన్న ఆలోచన కూడా అధికారులకు లేదన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే అక్రమాలను నియంత్రించే పరిస్థితి లో అధికారులు లేరన్నారు.

జిల్లా అధికార యంత్రాంగం పనితీరును ముద్దు కృష్ణమ నాయుడు ఈ సందర్భంగా అభినందించారు. ఇది హామీల కమిటీ ప్రశంసగా ఆయన నొక్కి వక్కానించి చెప్పారు. కలెక్టర్ వివేక్ యాదవ్, జేసీ శ్రీకేశ్ బాలాజీ లఠ్కర్, ఐటీడీఏ పీవో లక్ష్మీశాలను ప్రత్యేకంగా అభినందించారు. ఆపైన జిల్లా అధికారుల బృందం పని తీరును మెచ్చుకున్నారు. ముఖ్యంగా మలేరియా, డెంగ్యూ చావులను నియంత్రించడంలో కీలక పాత్ర పోషించిన వారంతా అభినందనీయులన్నారు. ఈ సమావేశంలో హామీల కమిటీ సభ్యులు, ప్రభుత్వ విప్ వెంకన్న, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా, విభజన హామీలపై ఆఖరి పోరాటానికి సిద్ధమవ్వాలి

● కేంద్రం నుంచి టీడీపీ మంత్రులు వైదొలగాలి ● రాష్ట్రం అన్ని రంగాల్లో పూర్తిగా వైఫల్యం చెందింది



అమరావతి, ఆంధ్రప్రభ: విభజన హామీలపై సీఎం చంద్రబాబు సుప్రీంకోర్టుకు వెళ్తానడటం రాష్ట్ర ప్రజలని మరోసారి మోసం చేయడానికేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు అన్నారు. సోమవారం విజయవాడలో జరిగిన ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి మూడున్న రేళ్లు పూర్తయినప్పటికీ విభజన చట్టంలోని ఏఒక్క హామీ అమలు కాలేదని మండిపడ్డారు. ప్రత్యేక హోదా పార్లమెంట్‌లో హామీ ఇచ్చారని, కాని సీఎం చంద్రబాబు ప్రత్యేక హోదా కంటే ప్యాకేజీకే ఆమోదం తెలిపారని, ఆప్యాకేజీ సాధించటంలో పూర్తిగా విఫలమైన సీఎం రాజీనామా చేయాలన్నారు. అదేవిధంగా కేంద్రంలో తన మంత్రుల చేత రాజీనామా చేయించి విభజన హామీలపై కేంద్రంపై పోరాటానికి సిద్ధమవ్వాలన్నారు. 16 నెలలుగా ప్రధాని మోడీ సీఎం చంద్రబాబుకి అపాయింట్ మెంట్ ఇవ్వలేదని, దీనిని బట్టి రాష్ట్ర ప్రయోజనాలను ఏవిధంగా పణంగా పెట్టారో అర్థమౌతోందన్నారు. విభజన చట్టంలోని కడప ఉక్కు పరిశ్రమ, అనంతపురంలో సెంట్రల్ యూనివర్శిటీ, గోదావరి జిల్లాలోని పెట్రోలియం యూనివర్శిటీ, విజయనగరం జిల్లాలో గిరిజన యూనివర్శిటీతోపాటు రైల్వేజోన్ తదితర విషయాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. ప్రజల్లో తీవ్ర ఆందోళన బయలుదేరిందని, దీని నుంచి తప్పించుకోవాలని సీఎం చంద్రబాబు చూస్తున్నారని ఆగ్రహించారు.అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, పోలవరం ఏమౌవుతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో దళితుల, ముస్లిం మైనార్టీల మీద దాడులు జరుగుతున్నాయని, వాటిని నిరోధించాలన్నారు.

గతంలో రాష్ట్ర ముఖ్యమంత్రులను ఎందర్నో చూశామని, కానీ ఢిల్లీలో ఏ ముఖ్యమంత్రికి జరగని అవమానం చంద్రబాబుకు జరిగిందని సీపీఐ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ అన్నారు. 16నెలలుగా సీఎం చంద్రబాబు ప్రధాని మోడీ అపాయింట్ మెంట్ ఇవ్వకపోవటం సిగ్గుచేటన్నారు. ప్రధానితో కలిసిన అనంతరం బయటకి వచ్చిన చంద్రబాబు ఏమడిగారో చెబుతున్నారేకాని ప్రధాని మోడీ స్పందించలేదని, కనీసం పీఎం కార్యాలయం కూడా ఏంచెప్పలేదన్నారు. ఎన్నిసార్లు ఢిల్లీకి పోతే ఎవరికి కావాలని, మూడున్నరేళ్లలో సాధించిందేమిటని ప్రశ్నించారు. 2014 విభజన చట్టంలో ఉన్న ఏయే హామీలను కేంద్రం అమలు చేసింది, ఎంత నిధులు ఇచ్చిందో చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు.

సీఎం చంద్రబాబు గతంలో మాట్లాడిన మాటలను ఒకసారి గుర్తుచేసుకోవాలని, కేంద్రంతో చంద్రబాబు ఎందుకు గట్టిగా మాట్లాడటంలేదని వైసీపీ నాయకుడు మల్లాది విష్ణు ప్రశ్నించారు. విభజన సమస్యలు, ప్రత్యేకహోదా రాష్ట్రంలోని ఎంపీలందరూ ఒక తాటిమీదకు రావాలని, వైసీపీ ఎంపీలు వస్తారన్నారు. హోదా, విభజన సమస్యలు మాట్లాడకుండా చలసాని శ్రీనివాస్ చంద్రబాబు, జగన్ గురించి మాట్లాడటం సరికాదన్నారు. ప్రత్యేక హోదా అపర సంజీవిని కాదని అధికార పార్టీ నాయకులు తప్పుదారి పట్టించారని, చట్టంలో పేర్కొన్న హామీలను కూడా తీసుకురావటంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలి అన్నారు. హోదా విషయంలో కాంగ్రెస్ పార్టీ ఈరోజుకు కట్టుబడి ఉందని, ఈమూడున్నరేళ్లలో లోక్ సభలో సోనియా గాంధీ, రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యులు విభజన సమస్యలపై మాట్లాడారని గుర్తుచేశారు. విభజన సమస్యలపై సీఎం చంద్రబాబు, బీజేపీ ఎక్కడా కూడా మాట్లాడటంలేదని, దీంతో రాష్ట్ర ప్రజలు మోసపోతున్నారని తెలిపారు. విభజన హామీలను అమలు చేశామని బీజేపీ నేతలు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని, ఏపీని ఆదుకుంటామంటున్న బీజేపీ చిత్తశుద్ధి ఏమిటో పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కనిపిస్తోందన్నారు. ఏపీ, తెలంగాణాలో రైల్వే అభివృద్ధికి కేంద్రం 5వేల కోట్లు ఇచ్చి మధ్యప్రదేశ్‌కు మాత్రం రూ.38వేల కోట్లు ఇచ్చారని గుర్తుచేశారు. ప్రత్యేక హోదా, విభజన హామీల మీద సీఎం చంద్రబాబు తక్షణమే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలన్నారు. ఏపీ ఎంపీలు స్పందించి కేంద్రంపై ఒత్తిడి తీసుకరావాలని, అవసరమైతే ప్రధాని ఇంటి ముందు ధర్నా చేసి తెలుగువారి సత్తా ఏమిటో చూపించాలన్నారు. జనసేన అధినేత యాత్రని స్వాగతిస్తున్నామని, ప్రజా సమస్యలకోసం ఎవరు యాత్రలు చేసినా స్వాగతించాలన్నారు. ఈరౌండ్ టేబుల్ సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు పోతిన రాము, సీపీఐ నగర కార్యదర్శి దోనెపూడి శంకర్‌తోపాటు ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు, ఉద్యోగ సంఘనాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాప్రభ

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో బోపన్న జోడి ఓటమి

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్-2018 టోర్నీలో సోమవారం జరిగిన పురుషుల డబుల్స్ మ్యాచుల్లో భారత ఆటగాడు రోహన్ బోపన్న ఫ్రాన్స్ ఆటగాడు ఎడ్వర్డ్ రోగర్ జోడీ, ఆలివర్ మరాచ్(ఆస్ట్రేలియా), మేట్ పావిక్ (క్రోయేషియా) జోడి చేతిలో 6-4, 6-7(5), 3-6 తేడాతో ఓటమి పాలయ్యింది. రెండు గంటలపాటు సాగిన ఈ మ్యాచ్‌లో ఇండో-ఫ్రెంచ్ జంట రెండు బ్రేక్ పాయింట్ అవకాశాల్లో ఒక పాయింట్‌ను చేజిక్కుకుంది. కాగా వారి ప్రత్యర్థులు 12 బ్రేక్ పాయింట్లలో మూడింటిని కైవసం చేసుకుంది. కాగా మరో మ్యాచ్‌లో దివిజ్ శరణ్, రాజీవ్ రామ్(అమెరికా) జోడి లుకాజ్ కుబొట్(పోలండ్) వరల్డ్ నంబర్ వన్ ర్యాంకు ఆటగాడు మార్సెలో మెలో(బ్రెజిల్) చేతిలో 6-3, 6-7(4), 4-6 తేడాతో ఓటమి చెందింది. దాదాపుగా 2 గంటల 12 నిమిషాలవరకు సాగిని ఈ మ్యాచ్‌లో శరణ్, రామ్‌లు తమకు వచ్చిన ఆరు బ్రేక్ పాయింట్ల అవకాశాల్లో రెండింటిని తమకు అనుకూలంగా మలచుకోగా, లాకాజ్, మార్సెలో జోడీ నాలుగు బ్రేక్ పాయింట్ అవకాశాల్లో రెండింటిని తమకు అనుకూలంగా మలచుకున్నారు.



క్వార్టర్ ఫైనల్లో ఫెదరర్, కెర్బర్





మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో రోజర్ ఫెదరర్ తన ప్రత్యర్థి ఫుక్సోవిక్స్‌ను ఓడించి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించగా, మహిళల సింగిల్స్‌లో మాజీ ఛాంపియన్ ఆంజెలిక్ కెర్బర్ కూడా తన ప్రత్యర్థిని ఓడించి చివరి 8 మంది పోటీ కూటమిలోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన ప్రీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో స్విట్జర్లాండ్ ఆటగాడు డిఫెండింగ్ ఛాంపియన్ రోజర్ ఫెదరర్ హంగరీ దేశానికి చెందిన మార్టిన్ ఫుక్సోవిక్స్‌పై 6-4, 7-8(7/3), 6-2 సెట్ల తేడాతో విజయం సాధించాడు. 19 సార్లు గ్రాండ్ స్లామ్ విజేతగా నిలిచిన ఫెదరర్ మెల్‌బోర్న్ పార్క్‌లో ఇంతవరకు ఓటమిని ఎరగలేదు. అనంతరం ఫెదరర్ తన గెలుపుపై వ్యాఖ్యానిస్తూ మార్టన్ బాగా ఆడాడు. ఆడే సమయంలో వచ్చే ఐడియాను వేగంగా అమలు చేస్తేనే విజయం వరిస్తుందని అన్నాడు.

ఫెదరర్ వరుసగా సెమీస్‌లో నిలవడం ఇది 14వసారి. రెండవ ర్యాంకులో ఉన్న ఫెదరర్ క్వార్టర్ ఫైనల్లో చెక్ రిపబ్లిక్ ఆటగాడు బెర్డిచ్‌తో తలపడనున్నాడు. బెర్డిచ్, ప్రీ క్వార్టర్స్ మ్యాచ్‌లో ఇటలీకి చెందిన ఫాబియో ఫోగ్నిపై 6-1,6-4, 6-4 వరుస సెట్లలో గెలిచాడు. బెర్డిచ్ గతంలో 2014, 2015లో ఆస్ట్రేలియన్ సెమీస్‌లకు చేరాడు. గత ఏడాది బెర్డిచ్ మూడవ రౌండ్‌లోనే ఓటమి పాలయ్యాడు. కాగా ఇంతవరకు 13 క్వార్టర్ ఫైనల్ మ్యాచుల్లో ఆడిన ఫెదరర్ మొత్తం మ్యాచులు గెలిచి ముందుకు దూసుకు పోయాడు. మహిళ సింగిల్స్‌లో జర్మనీ క్రీడాకారిణి కెర్బర్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. టాప్ క్రీడాకారిణులు కిందిస్థాయి రౌండ్లలోనే ఇంటిదారిపట్టడంతో టోర్నీలో నిలిచిన మహిళా క్రీడాకారిణుల్లో కెర్బర్ మాత్రమే గ్రాండ్ స్లామ్ విన్నర్‌గా కొనసాగుతోంది. సోమవారం జరిగిన సింగిల్స్ మ్యాచ్‌లో తైవానీస్ క్రీడాకారిణి హెచ్‌సీహ్ సువెయ్‌ను 4-6, 7-5, 6-2 సెట్ల తేడాతో ఓడించింది. 21 సీడెడ్ సువెయ్ పోరాట పటిమ చూపి తొలి సెట్‌ను కైవసం చేసుకుంది. రెండో సెంట్లో కూడా సువెయ్, కెర్బర్‌కు గట్టిపోటీనే ఇచ్చింది. ఇరువురి మధ్య నువ్వానేనా అన్నట్లు సాగిన సెట్‌లో చివరికి కెర్బర్ 7-5 తేడాతో గెలి చింది. ఆ తర్వాత సెట్లో సువెయ్‌నుంచి కెర్బర్‌కు ఎక్కువ ప్రతిఘటన ఎదురు కాలేదు దీంతో మూడు సెట్లలో రెండు సెట్లు కైవసం చేసుకున్న కెర్బర్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. అంతకు ముందు జరిగిన ప్రీ రౌండ్ మ్యాచ్‌లో కెర్బర్ రష్యా క్రీడాకారిణి మారియా షరపోవాపై గెలిచింది.

2016లో ఫైనల్లో సెరినా విలియమ్స్‌పై విజయం సాధించి ఛాంపియన్ గా కెర్బర్ నిలిచింది. వరల్డ్ నంబర్ వన్‌గా నిలిచిన కెర్బర్‌కు 2017 అంతగా కలిసిరాలేదు. కాగా తైవానీస్ క్రీడాకారిణి సువెయ్ ప్రపంచ ర్యాంకు 88. ఆమె ప్రపంచ నంబర్ మూడు క్రీడాకారిణి గార్బైన్ ముగురుజాను రెండవ రౌండ్లో, ప్రమాదకర క్రీడాకారిణి అగ్నీస్జ్కా రాద్వాన్స్కాను నాల్గవ రౌండ్లో ఓడించింది. క్వార్టర్ ఫైనల్లో కెర్బర్ అమెరికాకు చెందిన కీస్‌తో తలపడనుంది. మరో మ్యాచ్‌లో చెక్ క్రీడాకారిణి ప్లిస్కోవా తన దేశానికే చెందిన స్ట్రికోవాను 7-6, 3-6, 2-6 సెట్ల తేడాతో ఓడించింది. వీరిద్దరి మ్యాచ్ హోరా హోరీగా సాగింది. తొలిసెట్‌ను స్ట్రికోవా గెలుచుకోగా రెండోసెట్లో ప్లిస్కోవా గెలుచుకుంది. కీలకమైన మూడో సెట్లో గట్టిపోటీ ఇచ్చిన స్ట్రికోవా చివరికి 2-6 తేడాతో ప్లిస్కోవాకు దాసోహమంది. రొమేనియా దేశానికి చెందిన హలేప్ జపాన్ క్రీడాకారిణి ఒసాకాపై 6-3,6-2 వరుస సెట్లలో గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. క్వార్టర్ ఫైనల్లో ప్లిస్కోవా, రొమేనియా క్రీడాకారిణి హలేప్‌ను ఢీకొననుంది.క్వార్టర్ ఫైనల్‌కు చేరిన వారిలో బెల్జియంకు చెందిన ఎలైస్ మార్టెన్ ఉక్రెయిన్ క్రీడాకారిణి ఎలిస్ స్విటోలిస్‌ను ఢీకొననుండగా, స్పెయిన్‌కు చెందిన కార్లా సౌరెజ్ నవరో, డానిష్ క్రీడాకారిణి కరోలిన్ వోజ్నియాకితో తలపడనుంది. క్వార్టర్ ఫైనల్స్ పురుషుల సింగిల్స్‌లో స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్, క్రొయేషియాకు చెందిన మారిస్ సిలిక్‌తో తలపడనుండగా, అమెరికాకు చెందిన టెన్ని సాండ్‌గ్లెన్ దక్షిణకొరియాకు చెందిన చుంగ్ హ్యెన్‌తో, బల్గేరియాకు చెందిన డిమిత్రివ్ ఇంగ్లండ్‌కు చెందిన ఎడ్మండ్‌తో తలపడనున్నారు.

ఖేలో ఇండియా పోటీలకు 3298 అథ్లెట్లు..

న్యూఢిల్లీ: ఈ నెల 31 ప్రారంభం కానున్న ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్ (కేఐఎస్‌జీ)లలో మొత్తం 3298 అథ్లెట్‌లు పాల్గొన నున్నారు. ఇందులో ప్రపంచ జూనియర్ ఛాంపియన్ షూటర్ ఆనిష్ భన్వాలా, ప్రపంచ యూత్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ వెండి పతక విజేత జెరేమీ లాల్‌రినుంగా ఉన్నారు. కేఐఎస్‌జీ నిర్వాహకులకు ఇప్పటివరకు 3298 నామినేషన్లు వచ్చాయి. కాగా 29 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి మొత్తం 4452 అథ్లెట్లు, అధికారులు ఈవెంట్‌లో పాలుపంచుకుంటారని అంచనా. మొత్తం 16 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తు న్నారు. భన్వాలా(15ఏళ్ల వయసు) గత ఏడాది జర్మనీలో నిర్వహించిన ఇంటర్నేషనల్ షూటింగ్ స్పోర్ట్ ఫెడరేషన్ జూనియర్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో 25 మీ. స్టాండర్డ్ పిస్టల్ విభాగంలో స్వర్ణ పతకంను గెలుచుకున్నాడు. పూణెలో సైనిక బాలుర స్పోర్ట్స్ కంపెనీలో శిక్షణ పొందుతున్న మిజోరంకు చెందిన 15 ఏళ్ల జెరెమీ లాల్‌రిన్నుంగా గత ఏడాది ఏప్రిల్‌లో బ్యాంకాక్ జరిగిన ఐడబ్ల్యుఎఫ్ జూనియర్ ఛాంపియన్ షిప్ పోటీల్లో సిల్వర్ మెడల్‌ను గెలుచుకున్నాడు. ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన విలువిద్య కారుడు బొమ్మదేవర ధీరజ్ ఈ టోర్నీలో పాలుపంచుకుంటున్న మరో ప్రముఖ అథ్లెట్. ధీరజ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఐదు స్వర్ణ పతకాలు గెలుచుకున్నాడు. యూత్ ఒలింపిక్స్ క్రీడల ఆర్హతకు నిర్వహించిన ఆసియన్ కాంటినెంటల్ క్వాలిఫైయింగ్ పోటీల్లో వెండి పతకంను గెలుపొందాడు. ఈ క్రీడల్లో పాల్గొనడానికి అత్యధికంగా ఢిల్లీ నుంచి 341, మహారాష్ట్ర నుంచి 321, హర్యానా నుంచి 351 వచ్చాయి. ఈ క్రీడల్లో విజేతలకు 197 స్వర్ణపతకాలు ప్రదానం చేస్తారు.

ప్రచార కర్తగా మహిళా క్రికెటర్ హర్మన్‌ప్రీత్



న్యూఢిల్లీ: ఐసిసిమహిళల క్రికెట్ ప్రపంచకప్-2017లో భారత్ ఫైనల్‌కు చేరడంలో కీలక భూమిక వహించిన హర్మన్‌ప్రీత్ కౌర్ ప్రముఖ టైర్ల కంపెనీతో ప్రచారం ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా కౌర్ తన బ్యాట్‌పై సియట్ లోగోను ప్రదర్శించనుంది. రెండేళ్లు ఈ ఒప్పందం కొనసాగుతుంది. గతంలో ఇదే తరహాలో సియట్‌తో ఒప్పందం కుదుర్చుకున్న వారిలో రోహిత్ శర్మ, అజింక్యా రహానే, ఇషాన్ కిషన్‌లు ఉన్నారు. ఈ ఒప్పందంపై కౌర్ స్పందిస్తూ.. సియట్ ఇప్పటికే పలువురు ప్రముఖ క్రికెటర్లతో ఒప్పందం కుదుర్చుకుంది. నాకు వారి సరసన నిలిచే అవకాశం సియట్ కంపెనీ ద్వారా లభించడం ఎంతో సంతోషం కలిగిస్తోంది. 2017లో భారత్ మహిళా క్రికెట్‌కు వచ్చిన ఊపు ఈ ఏడాది కూడా మరింతగా కొనసాగుతుందని ఆశిస్తున్నాను అని కౌర్ అన్నారు. కౌర్ మహిళా క్రికెట్ జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. కాగా సియట్ వైస్ ప్రెసిడెంట్ నితిష్ బజాజ్ ఈ ఒప్పందంపై మాట్లాడుతూ... భారత మహిళా క్రికెట్ జట్టు అద్భుతంగా ఆడుతోంది. సియట్ తనవంతుగా క్రీడకు సహకరిస్తోందని తెలిపారు. మాతో ఒప్పందం కుదుర్చుకున్న తొలి మహిళా క్రికెటర్ కౌర్ అని అందుకు మేము గర్వపడుతున్నామని బజాజ్ అన్నారు.

తొలి టీ-20లో పాక్‌పై న్యూజిలాండ్ గెలుపు



వెల్లింగ్టన్: స్వదేశంలో న్యూజిలాండ్ జైత్రయాత్ర అప్రతిహతంగా కొనసాగుతోంది. సోమవారం, పాకిస్తాన్‌తో జరిగిన తొలి టీ-20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ మూడు వికెట్ల తేడాతో పాక్‌ను ఓడించింది. టాస్ గెలిచిన న్యూజిలాండ్ బౌలింగ్‌ను ఎంపిక చేసుకుంది. పాకిస్తాన్ బ్యాటింగ్ పేలవంగా సాగింది. ఒక దశలో 38 పరుగులకు 6 వికెట్లు పోగొట్టుకుంది. పూర్తి ఇరవై ఓవర్లు కూడా ముగియకముందే 19.4 ఓవర్లలో 105 పరుగులకు ఆలౌట్ అయింది. టీ-20లో పాక్ అత్యల్ప స్కోరు 74. కాగా న్యూజిలాండ్ టీం తన దేశంలో ఆడిన 12 అన్ని ఫార్మాట్ మ్యాచుల్లో విజయం సాధించి మంచి ఊపుమీద ఉంది. మూడు సిరీస్ మ్యాచుల్లో భాగంగా న్యూజిలాండ్ 1-0 తేడాతో అధిక్యంను సంపాదించింది. పాక్ జట్టులో ఇద్దరు మాత్రమే డబుల్ స్కోరును దాటారు. బాబర్ హజం 43 పరుగులు చేయగా హసన్ అలీ 23 పరుగులు చేశాడు. న్యూజిలాండ్ బ్యాటింగ్ కూడా ఆరంభంలోనే రెండు వికెట్లు కోల్పోయింది. 8 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన న్యూజిలాండ్ ఆ తర్వాత మూడో వికెట్‌కు 49 పరుగులు జోడించింది. 15.5 ఓవర్లలో న్యూజిలాండ్ 106 పరుగులు చేసి విజయం సాధించింది. 49 పరుగులు చేసి తన జట్టును విజయ పథంలో నడిపిన కొలిన్ మున్రో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును దక్కించుకున్నాడు. న్యూజిలాండ్ తన దేశంలో వెస్టిండీస్‌తో ఆడిన రెండు టెస్టులు, రెండు వన్డేలు, మూడు టీ-20 మ్యాచ్‌లు గెలువగా, పాకిస్తాన్‌తో వన్డే సిరీస్‌ను 5-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది. తాజాగా సోమవారం మ్యాచ్ టీ-20 మ్యాచ్‌లో గెలిచి స్వదేశంలో తనకు ఎదురులేదని చాటింది.

పంజాబ్‌కు వరుసగా రెండో గెలుపు



కోల్‌కతా: ముస్తాక్ అలీ ట్రోఫీ-టీ 20 టోర్నీలో యువరాజ్ సింగ్ దూకుడు కొనసాగుతోంది. సోమవారం పంజాబ్, ముంబైజట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ మూడు వికెట్ల తేడాతో గెలిచింది. పంజాబ్ గెలుపులో కీలకంగా మారిన యువీ 34 బంతుల్లో 40 పరుగులు చేశాడు. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై నాలుగు వికెట్లు కోల్పోయి 198 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన పంజాబ్ ఓపెనర్లు మనన్ వోహ్రా (31 బంతుల్లో 42 పరుగులు), మన్‌దీప్ సింగ్ (11 బంతులు 22 పరుగులు) బాగానే ఆడినప్పటికి 6.3 ఓవర్లలో పంజాబ్ 72 పరుగులకు రెండు వికెట్ల కోల్పోయింది. యువరాజ్ సింగ్ బ్యాటింగ్‌కు వచ్చి ఆటను మలుపు తిప్పేశాడు. అప్పటికే క్రీజులో ఉన్న ఓపెనర్ మనన్ వోహ్రాతో కలిసి స్కోరును పరుగులెత్తించాడు. యువరాజ్ వరుసగా రెండు సిక్సర్లు కొట్టి తన దూకుడును చెప్పకనే చెప్పాడు. తన ఇన్నింగ్స్‌లో మొత్తం ఆరు ఫోర్లు కొట్టాడు. 40 పరుగులు చేసి శివందూబె బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యుగా వెనుతిరిగాడు. అప్పటికి జట్టు స్కోరు 172/5. అనంతరం వచ్చిన పంజాబ్ బ్యాట్స్‌మన్లు విజయానికి కావాలసిన 27 పరుగులను 19.2 ఓవర్లలో సాధించారు. కాగా యువరాజ్‌కు రెండు సార్లు లైఫ్‌లు దొరికాయి. తన స్కోరు 8, 32 వద్ద ఉన్నప్పుడు యువరాజ్ ఇచ్చిన క్యాచ్‌లను ముంబై ఫీల్డర్లు వదలివేశారు. ఆదివారం కర్నాటకతో జరిగిన మ్యాచ్‌లో యువరాజ్ దూకుడుగా ఆడి పంజాబ్‌కు గెలిపించాడు.

సంతోష్ ట్రోఫీ ఫైనల్లో కేరళ



బెంగళూరు: సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ ఫైనల్లోకి కేరళ ప్రవేశించింది. గ్రూప్ బిలో భాగంగా సౌత్ జోన్‌లో తమిళనాడుతో డ్రా చేసుకున్న అనంతరం కేరళ ఫైనల్‌కు అర్హత సాధించింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు, కేరళ మంచి ఆటను ప్రదర్శించాయి. అయితే ఇరుజట్లు గోల్ చేయటంలో సఫలతను పొందలేక పోయాయి. ఆట ప్రథమార్థం ముగిసే వరకు రెండు జట్లు 0-0 తో ఉన్నాయి. అనంతరం పరస్పరం గోల్ పోస్టులపై దాడులు జరుపుకున్నప్పటికి ఫలితం లేకపోయింది. కేరళ ఆటగాళ్లు పలుమార్లు గోల్ చేయటానికి ప్రయత్నించినప్పటికి తమిళనాడు డిఫెన్సివ్ ఆటగాళ్లు వారిని నిరోధించారు. చివరికి మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఫైనల్లో కేరళ, కర్నాటకను ఢీకొననుంది.

భారత్ మూడో టెస్టుకు సమాయత్తం



జోహెన్నెస్‌బర్గ్: రేపు ప్రారంభం కానున్న మూడో టెస్టుకోసం భారత క్రికెట్ జట్టు సీరియస్ ప్రాక్టీస్ చేస్తోంది. తొలి టెస్టు 72 పరుగుల తేడాతో, రెండో టెస్టును 135 పరుగుల తేడాతో కోల్పోయిన భారత్ మూడో టెస్టులోనైనా విజయం సాధించడానికి తన సర్వ శక్తులను ఒడ్డడానికి సమాయత్తమవుతోంది. స్థానిక వండరర్స్ స్టేడియంలో ప్రారంభం కానున్న ఈ టెస్టుకోసం ప్రాక్టీసులో భాగంగా కోహ్లీసేన ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడింది. అనంతరం నెట్ ప్రాక్టీస్‌ను చేస్తోంది. సోమవారం స్థానిక ప్రముఖ రగ్బీ ఆటగాడు కూస్ జెన్సన్ కవల కుమారులు లెఫ్ట్ ఆర్మ్ పేసర్లుగా క్రికెట్‌లో రాణిస్తున్నారు. నెట్ ప్రాక్టీస్‌లో భాగంగా కోహ్లీ వారితో బౌలింగ్ చేయించాడు. కాగా భారత క్రికెటర్ల నెట్ ప్రాక్టీసులో కోచ్ రవిశాస్త్రి అంఫైర్‌గా వ్యవహరించి వారి లోటుపాట్లను తెలుపుతు సూచనలు ఇచ్చాడు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.

ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
Lively Interaction For Ever
లైఫ్
I
మంగళవారం 23 జనవరి 2018

నీ మనసులో ఏముందో దాన్ని పంచుకో ...అంటుంది ఫేస్ బుక్.. సెల్ఫీ దిగావా అయితే చూపించవూ... అని మారాం చేస్తుంది ఇన్‌స్టాగ్రామ్.. ఏదో ఒక బ్లాగు రాయొచ్చుగా... అని గోముగా అడుగుతుంది టంబ్లర్...నీ అభిప్రాయం ఘాటుగా..సూటిగా మూడు ముక్కల్లో చెప్పమని అరుస్తుంది ట్విట్టర్ పిట్ట..ఇవన్నీ బాగానే ఉన్నాయి.. కాని ఉద్యోగం.. ఉపాధి..మరి వీటికి సంబంధించిన నైపుణ్యాలు ఎక్కడ పంచుకోవాలి....ఎలా తెలుసుకోవాలి....అనే ప్రశ్న వేస్తే నేనున్నానోచ్... అంటూ ముందుకు దూసుకువస్తుంది... ప్రొఫెషనల్ నెట్ వర్క్ ప్లాట్ ఫామ్... లింక్డ్ ఇన్!

ప్రపంచంతో... LinkedIn



టెక్ టైమ్

2003లో ప్రారంభమైన లింక్డ్ ఇన్ అకౌంట్ హోల్డర్ల సంఖ్య ప్రపంచ వ్యాప్తంగా రమారమి 50 కోట్లు. 5.2 కోట్ల ఖాతాదారులతో భారత దేశం ప్రపంచంలోనే రెండో స్థానంలో నిలిచింది. మన దేశంలో గురుగ్రామ్, బెంగళూరు,ముంబై, ఢిల్లీలలో లింక్డ్ ఇన్ ఖాతాదారుల సంఖ్య అధికం. ఇక ప్రథమ,తృతీయ స్థానాలను అమెరికా, చైనాలు ఆక్రమించాయి. ఈ ప్రొఫెషనల్ నెట్‌వర్క్ ప్లాట్‌ఫామ్‌లో ప్రతి ఖాతాదారునికి సగటున 330 మంది ప్రొఫెషనల్స్‌తో కనెక్టివిటీ ఉంటుంది. 2016లో దీనిని మైక్రోసాఫ్ట్ 29 బిలియన్ డాలర్లుకు కొనుగోలు చేసిన తర్వాత లింక్డ్ ఇన్ రూపురేఖలు మారిపోయాయి.

ఆధునిక ప్రపంచంలో ప్రతి మనిషి ఒక బ్రాండ్! ఆధునిక మనిషి తన వ్యక్తిత్వాన్ని పెంచుకోవడంలో..ప్రొఫెషనల్ ఉనికిని చాటుకోవడంలో ..తన బ్రాండు వ్యాల్యూను పెంచుకోవడంలో లింక్డ్ ఇన్ కీలక పాత్ర పోషిస్తుందనడం... అతిశయోక్తి కాదు. అంతటి ప్రాముఖ్యత సంతరించుకుంది ఈ ప్రొఫెషనల్ నెట్‌వర్క్ ప్లాట్‌ఫామ్! కేవలం ఉద్యోగ అన్వేషణ కోసమే కాకుండా..ప్రొఫెషనల్ నెట్‌వర్క్ ప్లాట్‌ఫామ్ ద్వారా కలిగే ప్రయోజనాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకుందాం!

♦ లింక్డ్ ఇన్ ప్రొఫైల్ ఏ భాషలో ఉన్నా..200 దేశాల్లో 24 భాషల్లో రిజిష్టర యినందున..దాని ఖాతాదారులందరూ చూస్తారు.

♦ ప్రపంచంలో దాదాపు 80 శాతం ఉద్యోగాలు నెట్‌వర్కింగ్ వలన లభిస్తున్న తరుణంలో...రిక్రూటర్లు, హెచ్.ఆర్ మరియు హెడ్ హంటర్లు లింక్డ్ ఇన్‌లో యాక్టివ్‌గా ఉంటూ ఉద్యోగ అభ్యర్థులను ఈ నెట్‌వర్క్‌లో అన్వేషిస్తుంటారు.

♦ లింక్డ్ ఇన్‌లో ఖాతాలు మూడు రకాలుగా వర్గీకరించ బడతాయి. మీరు మైక్రోసాఫ్ట్ అధినేత సత్యానాదెళ్లకు కనెక్షన్ రిక్వెస్ట్ పంపి....ఆయన ఓకే చేస్తే మిమ్ములను ఫస్ట్ డిగ్రీ కనెక్షన్‌గా పరిగణిస్తారు. నాదెళ్ల కనెక్షన్‌లో గూగుల్ హెచ్.ఆర్. హెడ్ ఉంటే..అతను మీ సెకండ్ డిగ్రీ కనెక్షన్. అంటే ఇక్కడ సత్యానాదెళ్ల ..మీకు, గూగుల్ హెచ్ఆర్ హెడ్‌కు కామన్ కనెక్షన్..అందుకే గూగుల్ హెచ్ఆర్ హెడ్ మీ కనెక్షన్ రిక్వెస్ట్ ఆమోదించే అవకాశం ఉంది. ఇక అమెజాన్ టెక్నికల్ హెడ్‌ను మా ఖాతాలో యాడ్ చేసేందుకు మీరు రిక్వెస్ట్ పంపితే...ఆయనకు మీకు కామన్ కనెక్షన్ లేకపోతే..మీరిరువురు ఒకరికి ఒకరు థర్డ్ డిగ్రీ కనెక్షన్‌గా పరిగణిస్తారు.

♦ మీ సీవీ మరియు విద్యార్హతలు..ఉద్యోగాన్వేషణకు పాస్‌పోర్ట్ అయితే..ఉద్యోగ అవకాశాల కల్పన.. కెరీర్ డెవలప్‌మెంట్, ప్రముఖులతో పరిచయాలు తదితర అవకాశాలకు మీ లింక్డ్ ఇన్‌ప్రొఫైల్ వీసాలాంటిది. అందుకే పూర్తిగా నింపని, స్పష్టత లేని, ప్రొఫైల్ ఫొటో లేని లేదా ప్రొఫెషన్ ఫొటోకు బదులు..సెల్ఫీలాంటి ఫొటోలు ప్రొఫైల్ ఫొటోలుగా పెట్టిన ప్రొఫైల్‌తో మీరు కనెక్షన్ రిక్వెస్టు పంపితే.. అవతలి వ్యక్తి యాక్సెప్ట్ చేయరు. అంతేకాదు మీరు పంపిన రెక్వెస్టులు అధికంగా తిరస్కరించబడితే ..మీరు కొత్తగా ఇన్విటేషన్ పంపే లిమిట్‌ను కోల్పోతారు.

♦ మీ ప్రొఫైల్‌లో పొందుపరిచిన విద్యార్హతలు, పనిచేసిన కంపెనీల వివరాలు, అనుభవం ఇతరత్రా వివరాలకు, మీ సీవీలోని వివరాలకు వ్యత్యాసం ఉంటే రిక్రూటర్స్ మీ కాండిడేచర్‌ను వెనక్కు నెట్టేస్తారు. భవిష్యత్తులో కూడా మీ ప్రొఫైల్‌ను పరిగణనలోకి తీసుకోరు. ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి.

♦ మీరు అనేక విషయాలపై వ్యాసాలు రాయడానికి లింక్డ్ ఇన్ తోడ్పడుతుంది. మీరు రాసిన వ్యాసాలను లింక్డ్ ఇన్ లో ప్రచురించే ముందు సంబంధిత 'కీ వర్డ్స్'కి ముందు హాష్ టాగ్ ఉపయోగించడం ముఖ్యం. ఫొటోలు వీడియోలు కూడా వ్యాసం కోసం ఉపయోగించవచ్చు. మీ వ్యాసం బాగుంటే మీ నెట్‌వర్క్ లోని వారే కాకుండా మొత్తం లింక్డ్ ఇన్లో ఎవరైనా 'లైక్ లేదా కామెంట్ పెడతారు లేదా తన నెట్‌వర్క్‌లో వ్యాసాన్ని షేర్ చేసుకొంటారు' ప్రచురించబడిన వ్యాసాన్ని ఎడిట్ లేదా డిలీట్ చేసుకోవచ్చును. ఈ విధంగా మీ ప్రొఫైల్ నలుగురి దృష్టిలో పడి, ఆకట్టుకోవాలంటే మీరు కొన్ని వ్యాసాలు ప్రచురించడం ఒక మార్గం. మీ లింక్డ్ ఇన్ కనెక్షన్ల ద్వారా కాకుండా, మీ నెట్‌వర్క్ వెలుపల ఉన్న వ్యక్తులచే కూడా వీక్షించబడుతుంది.

♦ లింక్డ్ ఇన్లో పేరు గాంచిన కంపెనీల అధిపతులు, సిఇఒలు, టెడ్ స్పీకర్లు, లీడర్షిప్ పర్సనాలిటీలు, కోచులు, ప్రముఖ రచయితలు మొదలగు వారు అనుక్షణం క్రియాశీలంగా ఉంటూ వార్తలు, లీడర్షిప్ వచనాలు, బిజినెస్ మరియు స్టార్టప్‌ల గూర్చి విశ్లేషణలు, కథనాలు, మోటివేషనల్ ఆలోచనలు లాంటి ఎన్నో మంచి విషయాలు తమ అప్డేట్లు లేదా వ్యాసాల ద్వారా పంచుకొంటుంటారు. వీళ్లే 'లింక్డ్ఇన్ ఇన్ఫ్లుయెన్సర్స్'గా వ్యవహరింపబడతారు. ఎంత మంది ఇన్ఫ్లుయెన్సర్స్‌ని ఫాలో అయితే అంత ఉత్తమం.

♦ లింక్డ్ ఇన్‌లో చేరిన తరువాత మనకు ఆసక్తి అవసరమున్న కంపెనీల లింక్డ్ ఇన్ పేజీలను పరిశీలించి ఆ సంస్థల గూర్చి క్షుణ్ణంగా తెలుసుకొని ఫాలో బటన్ నొక్కడం ద్వారా ఫాలో అవ్వొచ్చును. ఫాలో అయినప్పుడు ఆయా సంస్థల గురించిన వార్తలు, విషయాలు మరియు ముఖ్యంగా ఉద్యోగాల ఖాళీ జాబితా, భర్తీ కోసం విడుదల చేసిన నోటిఫికేషన్ చూసి అప్లై చేయవచ్చును. మనకు తెలిసినవాళ్ళు, మన ఊరువాళ్ళు లేదా మనం చదివిన స్కూలు, విద్యాలయాల నుంచి చదువుకున్నవాళ్లు... ఎవరైనా ఆ సంస్థల్లో పని చేస్తున్నట్లయితే వారికి లింక్డ్ఇన్ ఆహ్వానం పంపడం ద్వారా నెట్‌వర్క్‌ని పెంచుకోవాలి.

♦ మీ చదువు, ఉద్యోగాలలో మీకున్న అనుభవం, స్కిల్స్‌ని బట్టి మీరెంత వేతనానికి అర్హులో ...అంటే మీ సామర్థ్యాన్ని తెలుసుకోవడానికి 'లింక్డ్ఇన్ శాలరీ' అనే ఫీచర్ బాగా ఉపయోగపడుతుంది. ప్రస్తుత మీ జాబ్ టైటిల్ మరియు స్థానాన్ని బట్టి మీకెంత జీతం సంపాదించడానికి ఆస్కారం ఉంది. ఇంటర్వ్యూకెళ్లినట్లయితే మీరు ఎంత జీతం కోరుకోవచ్చు... లాంటి విషయాలను లింక్డ్ ఇన్... ఆస్తకికరమైన డేటాతో టైటిల్, లెవెల్, బ్రాండ్, విద్యాస్థాయి మరియు క్షేత్రము, పరిశ్రమ, కంపెనీ పరిమాణాల ఆధారంగా తెలియజేస్తుంది. కాకపోతే ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలంటే...ముందు మీ ప్రస్తుత జాబ్ టైటిల్, జీతం వివరాలు నమోదుచేయాలి. లింక్డ్ఇన్ మీ జీతం వివరాలు గోప్యంగా ఉంచుతుంది. ఫేస్‌బుక్ మెసెంజర్, గూగుల్ చాట్ లాగే లింక్డ్ ఇన్లో చాటింగ్ చేయవచ్చును. లింక్డ్ ఇన్ చాట్లో, మీరు ఫొటోలను లేదా ఫైళ్లను కూడా పంపవచ్చును.

♦ మీ నెట్‌వర్క్‌లో ప్రముఖ సంస్థల డైరెక్టర్లు, మరియు ప్రఖ్యాత కంపెనీల ఉన్నతాధికారులు లేదా సిఎక్స్ ఒలు ఉన్నప్పుడు... మీ నెట్‌వర్క్‌లో కనెక్షన్లను ఎవరూ అన్వేషించకుండా లేదా మీ సహోద్యోగులు, క్లయింట్లు, మీ కాంపిటీషన్ కంపెనీలు మీ కనెక్షన్ల జాబితాను చూసి ఆ ప్రముఖ వ్యక్తులకు చేరువ అవకుండా ఉండాలని మీరనుకొంటే ...మీకు మాత్రమే కనపడేటట్టుగా మీ కనెక్షన్ల జాబితాను ప్రైవేట్‌గా ఉంచాలనుకొంటే సెక్యూరిటి సెట్టింగ్స్‌లో మార్చుకోవచ్చును.

♦ లింక్డ్ ఇన్‌లో మీరు పెట్టిన ప్రతీ అప్‌డేట్, ఆర్టికల్, వీడియో, ఫొటోలకి విశ్లేషణలు చూడగలరు, ఆ విశ్లేషణలను తెరిచి, మీ పోస్టులు ఎన్ని వ్యూస్ పొందింది, ఎంతమంది చదివారు, ఏ సిటీ, ఏ జాబ్ టైటిల్, ఏ కంపెనీలలో పనిచేస్తున్న వాళ్ళు అత్యధికంగా మీ పోస్టులు చదివారు లేదా చూశారు... ఇంకా మీ పోస్టులను చూసిన వ్యక్తుల స్థానం... 1వ, 2వ లేదా 3వ డిగ్రీ కనెక్షన్ల నుండి ...ఏ స్థానం...లాంటి విశ్లేషణ పొందవచ్చును.

> మీరే ఒక బ్రాండ్... మీ బ్రాండ్‌కి విలువ కల్పించి... గుర్తింపు పెంపొందించడానికి ప్రపంచంలోనే అతి పెద్ద ప్రొఫెషనల్ నెట్ వర్క్ లింక్డ్ఇన్...ఉపయోగపడుతుంది. ఇది మీ నైపుణ్యాలను, అనుభవాలను స్పష్టంగా నిర్వచించడంలో మీకు సహాయపడే ఏకైక వేదిక. ఇది మీకు వ్యక్తిగత, వృత్తిపరమైన బ్రాండుని నిర్మించడంలో తోడ్పడుతుంది. ప్రపంచవ్యాప్తంగా మీ అనుభవాన్ని, అభ్యర్థిత్వాన్ని ప్రదర్శిస్తుంది. లింక్డ్ఇన్‌లో చురుకుగా ఉండటం వలన ఇవన్నీ సాధ్యమవుతాయి.

♦ ఎన్నో విషయాల మీద దాదాపు వందల లింక్డ్ఇన్ ఛానల్స్ ఉన్నాయి. వాటిని ఫాలో అవడం వలన కొత్త విషయాలను నేర్చుకొనవచ్చును.

♦ మీ లింక్డ్ ఇన్ హెడ్ లైన్‌లో 'నేను అత్యున్నతమైన కొత్త అవకాశం కోసం చూస్తున్నాను' లేదా 10,000 కనెక్షన్స్ అయ్యాయి. 15000వేలు నెక్ట్స్ టార్గెట్' లాంటివి పెట్టి మీ వాల్యుని క్షీణ పర్చుకోవద్దు.

♦ చిన్న కుటీర పరిశ్రమ నుంచి పెద్ద బహుళజాతీయ సంస్థ వరకు ప్రపంచమంతా ఈ రోజు ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ ద్వారా వ్యాపార కార్యకలాపాలు సాగిస్తోంది. ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ ల్లో లింక్డ్ ఇన్ కన్నా లక్షణమైన ప్లాట్‌ఫామ్ మరొకటి లేదు. అందుకే అన్ని ప్రముఖ సంస్థల ముఖ్య కార్యవర్గం, అధికారులు, మిగతా సోషల్ మీడియా ప్లాట్‌ఫారములలో ఉన్నా లేకపోయినా లింక్డ్ఇన్‌లో తప్పనిసరిగా నమోదు అవడమే కాకుండా యాక్టివ్‌గా ఉంటారు.

♦ లింక్డ్ ఇన్ కనెక్షన్ల ఫోన్ నెంబర్, ఇమెయిల్, కంపెనీ వివరాలు ఎక్సెల్ లేదా పిడిఎఫ్ ఫైలులో ఇంపోర్ట్ చేసుకోవచ్చును. మరియు మీ ఫోన్ కాంటాక్టులకి కూడా ఇంపోర్ట్ చేసుకోవచ్చును.

♦ చాలా మంది ఇతరులకు లింక్డ్ ఇన్ కనెక్షన్ రిక్వెస్ట్ పంపడంలోనే నిమగ్నులవుతారు. కానీ అన్నిటికన్నా ముఖ్యమైనది లింక్డ్ ఇన్ గ్రూప్స్. మీకు సంబంధించిన గ్రూపులలో జాయిన్ అయితే అక్కడ కొన్ని వేలమందితో ... మీ నెట్‌వర్క్‌లో లేని వారితోనూ... చర్చలు జరపవచ్చును, వాళ్ళ ద్వారా అమూల్యమైన విజ్ఞానం నేర్చుకొనవచ్చును. వాళ్ల కామెంట్లకు బదులు ఇవ్వవచ్చును. మీ వ్యాసాలు, పోస్టులు కూడా ఎన్నో సంబంధిత గ్రూపులలో పోస్ట్ చేయుటకు వీలుంది.

♦ ఇన్ మెయిల్' కనెక్షన్లతో నెట్ వర్క్‌తో పని లేకుండా మీకు కావాల్సిన ప్రముఖ వ్యక్తిని సంప్రదించాలంటే వాళ్ల ఇ-మెయిల్ లేదా ఫోన్ నెంబర్లు కావాలి. కానీ లింక్డ్ ఇన్‌లో 'ఇన్ మెయిల్' ద్వారా మీరు ఎంత పెద్ద వ్యక్తికైనా క్లుప్తంగా మెసేజ్ పంపవచ్చును. ఉదాహరణకు మీ స్టార్టప్ ఐడియా , ఫండింగ్ అవసరం లేదా మీరు అతని బిజినెస్/ కంపెనీ కోసం ఏ విధంగా ఉపయోగపడగలరో... ఒక వెంచర్ కాపిటల్ ఇన్వెస్టర్లకు, కంపెనీ వ్యవస్థాపకుడుకి ఇన్ మెయిల్ చేయవచ్చును.

♦ మీ వ్యాపారం లేదా వృత్తి... నెట్‌వర్కింగ్ ఆధారితమైనచో ' లింక్డ్ ఇన్ ప్రీమియం' సభ్యత్వం అవసరం, ప్రీమియం అకౌంట్లో ఉచిత అకౌంట్ కన్నా ఎన్నో అదనపు సదుపాయాలున్నాయి.

♦ లింక్డ్ ఇన్ సెక్యూరిటీ సెట్టింగ్స్‌లో మీ అకౌంట్‌కి సంబంధించి చాలా ఆప్షన్లున్నా యి. మీరు ఇంకొకరి ప్రొఫైల్ ఓపెన్ చేసి చూసినప్పుడు వాళ్లకు నోటిఫికేషన్ మీ పేరు బదులు అనానిమస్ (అజ్ఞాత వ్యక్తి) అని కనపడేట్లుగా మార్చుకోవచ్చు. మీ ప్రొఫైల్ అప్డేట్ చేసినప్పుడు అందరికీ నోటిఫికేషన్ వెళ్లకుండా, మీ కాంటాక్ట్ డీటెయిల్స్ ఎవరెవరికి కనపడాలి... ఎవరు మీకు కనెక్షన్ రిక్వెస్ట్ పంపొచ్చు... అందరూనా లేదా సెకండ్ డిగ్రీ/ లెవెల్ వాళ్ళు మాత్రమేనా... లాంటివి సెట్ చేసుకోవచ్చు.

♦ మీరు మీ ఉద్యోగం మారి మీ కాంపిటీషన్ సంస్థలో ఉద్యోగం స్వీకరించారనుకోండి...మీ పాత కంపెనీ ఉద్యోగులు లేదా మీ మాజీ బాస్ మీ లింక్డ్ ఇన్ పోస్టులు చూడడం మీకు ఇబ్బందికరం కావొచ్చు. అలాంటపుడు...సదరు వ్యక్తులను మీ నెట్‌వర్క్ కనెక్షన్ల నుండి తొలగించవచ్చును.

♦ మీ ప్రొఫైల్లో మీరు నిర్మించిన ప్రాజెక్ట్, వెబ్సైట్, బ్లాగ్, షార్ట్ మూవీ, ఇన్ఫోగ్రాఫిక్స్ లాంటి వాటి మీడియా... ఫొటోలు, వీడియోలు, వెబ్ లింకులు పొందు పర్చుకున్నట్లయితే ఎంతో మంది రిక్రూటర్లను, సంస్థల హెచ్ ఆర్ డిపార్ట్‌మెంట్ వ్యక్తులను ఆకర్షించవచ్చును.

♦ మీ విద్యార్హతలు, పని చేసిన కంపెనీలు, మీరు సాధించిన ప్రగతి, పాజెక్టులు, మీకున్న అదనపు స్కిల్స్ లాంటి వివరాలతో వీడియో సి.వి.ని చిత్రీకరించి మీ లింక్డ్ఇన్ ప్రొఫైల్లో అప్‌లోడ్ చేయవచ్చు. ఈరోజుల్లో కంపెనీలు, రిక్రూటర్లు మరియు హెచ్. ఆర్... స్కైప్‌లోనూ ఇతర వీడియో కాల్స్ ద్వారానూ మొదటి రౌండ్ ఇంటర్వ్యూలను తీసుకోడానికి మొగ్గు చూపుతున్నారు.

♦ ఒక వార్తా పత్రిక మొదటి పేజీ హెడ్ లైన్ ఎంత శక్తిమంతంగా ఉంటుందో మీ లింక్డ్ ఇన్ ప్రొఫైల్ హెడ్ లైన్ అంత బాగా ఉండాలి. పరిమితమైన అక్షరాలు ఉపయోగించి మీ ప్రొఫెషన్‌కి సంబంధించిన విషయాలతో... అవకాశాలు కురిపించేలా 'కీ వర్డ్స్'తో మీ ప్రొఫైల్ హెడ్ లైన్ ని రాయాలి.



♦ 'లింక్డ్ఇన్ రికమెండేషన్స్' మీ ప్రొఫైల్ కు అదనపు హంగు, విశ్వసనీయత తీసుకొస్తాయి. మీరు ఇదివరకు పనిచేసిన సంస్థలోని ఉన్నతాధికారి లేదా మీ మాజీ బాస్... మీ పాత క్లయింటులాంటి వాళ్లు మీ పనితీరు, బిహేవియర్, ట్రైట్స్ మరియు స్కిల్స్... వంటివి చర్చించి మీ కోసం రాసిన రికమండేషన్ మీ ప్రొఫైల్‌కి క్రెడిబిలిటీ తెస్తుంది. మీరు ఒట్టి మాటల మనిషి కాదని చేతల ద్వారా మెప్పించగలరనే నమ్మకం కలిగిస్తాయి ఈ రికమెండేషన్లు.

♦ మీ జ్ఞానాన్ని ప్రదర్శించడానికి, అలాగే మీకు నైపుణ్యమున్న లేదా ప్రవేశమున్న అంశాల ద్వారా... ఇతరులకు సహాయపడే కంటెంట్, విషయాలు అందించడానికి లింక్డ్ఇన్ ఒక గొప్ప మార్గం. మీ నెట్‌వర్క్‌లో లేదా గ్రూపులలో ఒక పోస్టుని పంచుకొన్నపుడు సభ్యుల పరస్పర చర్చను ప్రోత్సహించేలా ప్రశ్న లేదా వ్యాఖ్యను చేర్చండి. మీరే ఒక బ్రాండ్... మీ బ్రాండ్‌కి విలువ కల్పించి... గుర్తింపు పెంపొందించడానికి ప్రపంచంలోనే అతి పెద్ద ప్రొఫెషనల్ నెట్‌వర్క్ లింక్డ్ ఇన్...ఉపయోగపడుతుంది. ఇది మీ నైపుణ్యాలను, అనుభవాలను స్పష్టంగా నిర్వచించడంలో మీకు సహాయపడే ఏకైక వేదిక. ఇది మీకు వ్యక్తిగత, వృత్తిపరమైన బ్రాండుని నిర్మించడంలో తోడ్పడుతుంది. ప్రపంచవ్యాప్తంగా మీ అనుభవాన్ని, అభ్యర్థిత్వాన్ని ప్రదర్శిస్తుంది. లింక్డ్ఇన్‌లో చురుకుగా ఉండటం వలన ఇవన్నీ సాధ్యమవుతాయి.

-సునీల్ ధవళ
మాజీ వైస్ ప్రెసిడెంట్
నేషనల్ జియోగ్రాఫిక్ అండ్ ఫ్యాక్స్



మార్కెట్లోకి... హీరో హెచ్‌ఎఫ్ డాన్ బైక్!



హీరో మోటోకార్ప్ లిమిటెడ్ నుంచి 2018 మోడల్ హీరో హెచ్‌ఎఫ్ డాన్ బైక్ ఇండియా మార్కెట్లోకి వచ్చింది. ఇది ప్రస్తుతం ఒడిశా రాష్ట్రంలో మాత్రమే అందుబాటులో ఉంది. 100సీసీ ఇంజన్ సామర్థ్యం ఉన్న ఈ బైక్ ధర 37,400 రూపాయలు.(ఎక్స్ షోరూం ధర- ఒడిషా) త్వరలోనే ఈ బైక్ దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా అందుబాటులోకి రానుంది. ఒడిషా మార్కెట్లో కూడా ఈ బైక్ .ఎరుపు,నలుపు కలర్లలో, అందుకు అనుకూలమైన గ్రాఫిక్స్‌తో లభిస్తుంది. ఇక బైక్ సీట్,ఇంజన్, ఇతర భాగాలు మాత్రం నల్లరంగులో ఉంటాయి. మొత్తం మీద కొత్త బైక్ యూత్‌ను ఆకట్టుకునేలా ఆకర్షణీయంగా డిజైన్ చేశారు.

ఏడు డివైస్‌లు... ఒక స్మార్ట్ రిమోట్




మన ఇంట్లో టీవీ,ఏసీ, ఆడియో సిస్టమ్.. ఇంకా పలురకాల ఇతర పరికరాలు ఉంటాయి. వాటిని ఆపరేట్ చేసుకోవడానికి ఒక్కోదానికి ఒక్కో రిమోట్ ఉంటుంది. ఏసీ ఆన్ చేయాలంటే దాని రిమోట్ దొరకదు. టీవీ రిమోట్ కనిపిస్తుంది. అప్పుడు కాస్త చిరాకు వేస్తుంది. విసుక్కుంటాము. టీవీ, ఆడియో సిస్టమ్,ఏసీ..ఇలా అన్నింటిని ఆపరేట్ చేయడానికి ఒకే రిమోట్ ఉంటే బాగుండు అనిపిస్తుంది. అయితే పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం పుణ్యమా అని అన్నింటినీ ఆపరేట్ చేసేవిధంగా స్మార్ట్ రిమోట్ మార్కెట్లోకి వచ్చింది.స్మార్ట్ రిమోట్ ద్వారా మనం కూర్చున్న చోటునుంచే కదలకుండా టీవీని, ఆడియో సిస్టమ్‌ను, ఏసీని..ఏది కావాలంటే దానిని ఆపరేట్ చేసుకో వచ్చు.. కాకపోతే ధర కాస్త ఎక్కువ. దీని ధర కేవలం 14,700 రూపాయలు మాత్రమే. ఈ రిమోట్ మూడు సెన్సార్ల సిస్టమ్‌ను కలిగి ఉంది. సెన్సార్లను గది లో అనువైన చోట అమర్చు కో వాల్సి ఉంటుంది. స్మార్ట్ రిమోట్ తో ఏడు రకాల డివైస్‌లను ఆపరేట్ చేసుకో వచ్చు. ఇది చిన్న పరికరం కదా ఇంట్లో ఏమూలనైనా పడి పోతే .. అన్న బాధ అవసరం లేదు. దీని చార్జింగ్ బేస్ వద్ద ఉన్న బటన్ దాని ఉనికిని కనిపెట్టడంలో సాయం చేస్తుంది.

వాట్సప్ నుండి నేరుగా యూట్యూబ్‌కి



మీకు మీ మిత్రుడు వాట్సప్ ద్వారా యూట్యూబ్ వీడియో లింక్ పంపాడా? దానిని మీరు చూడాలంటే తప్పకుండా వాట్సప్ యాప్‌నుంచి బయటకు వచ్చి చూడాల్సిందే. మీరు ఐపోన్ వినియోగ దారులైతే ఇక మీదట మీకు అలాంటి సమస్య ఉండదు. ఐఫోన్ వినియోగ దారులు వాట్సప్ లోనే ఉండి నేరుగా యూట్యూబ్ వీడియోను తిలకించ వచ్చు. అయితే ఈ కొత్త ఫీచర్ ఐఓఎస్ వినియోగ దారులకు మాత్ర మే అందు బాటులోకి వచ్చింది. ఐఓఎస్ వినియో గదారులు యాపిల్ యాప్ స్టోర్ ద్వారా 2.18.11 వాట్సప్ వెర్షన్‌ను అప్ డేట్ చేసుకోవాలి. ఆండ్రాయిడ్, విండోస్ వినియో గదారులకు ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తుందనే సమాచారం లేదు.

శరణాగతులకు పరమాత్మ అండ



ఎవరికీ అన్యాయం చేయాలని అనుకోకూడదు. ఎవరినీ బాధపెట్టాలనీ అనుకోకూడదు. ఎక్కడ ఎవరు తప్పుగా భావిస్తుంటారో వారిని భగవంతుడు చూస్తూ ఊరుకోడు. ఎవరు తీసుకున్న గోతిలో వారే పడతారు అన్న చందంగా ఎవరినైనా బాధపెట్టాలని చూస్తే వారే చివరకు బాధపడే స్థితి కలగవచ్చు.

పాండవులను ఇబ్బంది పెడదామని దుర్యోధనుడు ఘోషయాత్ర ప్రయత్నం చేశాడు. దాని వల్ల ఘోర అవమానం పాలయ్యాడు. దానితో బుద్ధి వస్తే బాగుండేది. మరోసారి అటువంటి ప్రయత్నమే చేశాడు. అయితే ధర్మాత్ములకు, తనను నమ్ముకున్న వారికి అపకారం జరగనివ్వడా పరమాత్మ. ఆ అపకారాన్ని అడ్డుకున్నాడు. అందరూ సంతోషంగా ఉండాలని అనుకోమని పెద్దలు చెబుతుంటారు. పాండవులకు నష్టం కలిగించాలని కౌరవులు తలపెట్టిన పన్నాగాన్ని, పరమాత్మ దానిని వమ్ము చేసి ధర్మాత్ములను ఎలా రక్షించాడో తెలిపే కథ సర్వ ధర్మాల సారమైన మహాభారతంలో ఉంది. అది బాగా ప్రచారం పొందిన కథే.

ఒకసారి ముక్కోపి అయిన మహర్షి దుర్వాసుడు తన శిష్యగణంతో దుర్యోధనాదుల వద్దకు వచ్చాడు. దుర్వాసునికి కోపం వస్తే శపిస్తాడు కనుక దుర్యోధనుడు ఆయనతో జాగ్రత్తగా మెసిలాడు. ఆయనను అతిథి సత్కారాలతో మంచి చేసుకున్నాడు. అతని ఆతిథ్యానికి సంబరపడిపోయిన దుర్వాసుడు ఏ వరం కావాలో కోరుకోమన్నాడు. దుర్యోధనుడు వినయం నటిస్తూ 'స్వామీ! మీ దీవెన చాలా బలమైంది. దురదృష్టవశాత్తూ పాండవులు ద్యూతంలో ఓడిపోయి అరణ్యవాసం చేయాల్సి వచ్చింది. వారు ధర్మపరులు జూదంలో ఓడి ఆ నియమాల ప్రకారం అడవుల్లో ఉంటున్నారు కనుక మీరు వారున్న ప్రదేశానికి వెళ్లి ఆశీర్వదిస్తే చాలా సంతోషిస్తాను' అన్నాడు. దుర్యోధనుడు ఆ మాటలు మంచి మనసుతో అంటున్నాడని అనుకుని మరింత సంతోషించాడు దుర్వాసుడు. అందుకు అంగీకరించాడు. దుర్వాసుడు అడవికి వెడితే అరణ్యంలో ఉన్న పాండవులు ఆయనకు సరైన సత్కారాలు చేయలేకపోవచ్చని దానితో ఆయనకు కోపం వచ్చి శపించగలడని దుర్యోధనుని ఉద్దేశం.

మహాభారతంలో చిన్న కథలు

దుర్వాసుడు పాండవులు ఉన్న చోటికి వెళ్లాడు. ఆయన వెళ్లే సమయానికి భోజనాల సమయం దాటిపోయింది. పాండవుల భోజనాలు కూడా పూర్తయ్యాయి. దుర్వాసుడు శిష్యులతో కలిసి భోజనానికి వస్తానని చెప్పాడు. నదికి వెళ్ళి స్నానం చేసి శుచియై వస్తానని వెళ్లాడు. పాండవులకు అరణ్యవాసంలో ఆహారం ఇచ్చి ఆదుకుంటున్నది సూర్య భగవానుని అనుగ్రహంతో వచ్చిన అక్షయ పాత్ర. దానిలో ఆహారం అక్షయమై ఎంత మంది వచ్చినా సరిపోతుంది. అయితే ఒక సారి శుభ్రం చేసినాక ఆ పూటకు అది మళ్లీ పని చేయదు. ఆ సమయంలో దుర్వాసునికి, ఆయన శిష్యులకు ఎక్కడి నుంచి ఆహారం తేవాలని వారు ఆలోచనలో పడ్డారు. అందునా వచ్చింది దుర్వాసుడు. ఇటువంటి సమయాల్లో ఆదుకోగలిగింది తమకు అండదండ అయిన శ్రీకృష్ణుడే కనుక ద్రౌపదీ దేవి ఆయనను ప్రార్థించింది. తలచుకోగానే ఆయన వచ్చాడు. తనకు ఆకలి వేస్తోంది ఏదైనా పెట్టమని అడిగాడు. అవతల దుర్వాసుడు వచ్చాడు, ఆయనకే లేనిది నీకేమి ఇస్తానంది ద్రౌపది. పర్వాలేదు అక్షయ పాత్రలో ఏదో ఒకటి ఉండక పోదు అని ఆ పాత్ర తీసుకుని దానిలో అడుగున మిగిలిన ఒక మెతుకును తిని అక్షయమస్తు అన్నాడు. పరమాత్మ అక్షయం అని ఎవరి గురించి అన్నాడో అది వారికి అక్షయమయింది. తర్వాత భీముని కేసి చూసి దుర్వాసుని అతని శిష్యులను సాదరంగా తీసుకురమ్మన్నాడు. కృష్ణునికి శరణాగతి అయిన వారు, ఆయనపై భారం వేశారు. భీముడు వారిని తీసుకురావడానికి వెళ్ళాడు. అక్కడ స్నానాదులు చేసిన, చేస్తున్న దుర్వాసునికి, ఆయన శిష్యులకు అకస్మాత్తుగా కడుపులు నిండిపోయాయి. దుర్వాసుడు దీనికి కారణమేమిటని దివ్య దృష్టితో చూసాడు. దుర్యోధనాదుల పన్నాగం, తాను భోజనానికి రావడంతో పాండవుల ఆవేదన, కృష్ణుని అభయం ఇవన్నీ ఆయనకు అవగతమయ్యాయి. ఈలోగా భీముడు వచ్చి భోజనానికి రమ్మని పిలిచాడు. అయితే దుర్వాసుడు 'జరిగింది తెలిసింది. మాకు భోజనం తిన్నంత తృప్తి కలిగింది. ఇక ఇప్పుడు మేము భోజనాలు చేయలేం. మమ్ములను క్షమించమని ధర్మరాజుతో చెప్పు. పాండవులందరికీ వాసుదేవుని కృప ఎల్లవేళలా ఉండాలని దీవిస్తున్నాను. మీ ధర్మాచరణ, సత్యపాలన మీకు విజయాన్ని ఇస్తుంది. సుఖ సంతోషాలతో ఉండండి' అని దీవించి భీముడిని పంపాడు.


అందుకే ఎప్పుడూ అందరూ బాగుండాలని, అందులో మనమూ ఉండాలని కోరుకోవాలి. వేదం కూడా సర్వే జనాస్సుఖినోభవంతు అనమంటుంది. దాన్ని మనం అనుసరిస్తే కష్టాలు కన్నీళ్లు మన చెంతకు రావు.

- అశ్విని

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

నిద్రాహార విహార నియతి



శ్రీ రమణాశ్రమం
6-4-47

నిన్న మధ్యాహ్నం ఒక భక్తులు భగవానుని సమీపించి, ''స్వామీ, తానెవరో తన ఆత్మను విచారించి తెలుసుకునేందుకు ధ్యానం చేయాలి గదా? ధ్యానానికి కూర్చుంటే నిద్ర వస్తుందే? అది రాకుండా ఉండే ఉపాయం ఏమిటి?'' అన్నారు. ''ప్రస్తుతం నీవు జాగ్రత్తలో జాగ్రత్తగా ఉండటం నేర్చుకో. వెనక నిద్ర సంగతి చూద్దాం. జాగ్రత్తలో ఎన్నో కలలు కంటాం. అవి లేకుండా జాగ్రత్త కలగాలి ముందు. ఈ చూచేదంతా స్వప్నమే. ఈ స్వప్న ప్రపంచంలో నుండి మేలుకోవా'' లన్నారు భగవాన్. ''ఆ జాగ్రత్త కలగటానికి సాధన కావాలి గదా? ఏదో ఒక నియతి యేర్పరచుకొని సాధన చేద్దామంటే, ఈ నిద్ర వస్తుందే? ఏవిధంగా దీన్ని పోగొట్టుకోవాలో భగవాన్ దయతో సెలవీయాలి'' అన్నారా పృచ్ఛకులు. ''ఆవరణ విక్షేపాదుల్లో మొదటి ఆవరణమే నిద్ర. సాధ్యమైనంతవరకు అది రాకుండా చూచుకోవాలి. అది ఏ కారణం వల్ల వస్తున్నదీ? అని విచారించి, ఆహార, విహారాదులు స్వచ్ఛంగా, మితంగా ఉండేట్లు నడుపుకొని, నిద్రరాకుండా చూచుకోవాలి గాని, వచ్చిన వెనక ఆపాలంటే లాభం లేదు. పుష్టిగా తింటే , సుష్టుగా నిద్ర రాదా మరి? ధ్యానానికి కూర్చుంటే తల ఊగుతుంది. కొందరు, వెంట్రుకలు, వెనక వైపు మేకుకు కట్టుకుంటారట. తల ఊగినప్పుడు మెలకువ రావటం తప్ప దాని వల్ల ధ్యానానికేం ప్రయోజనం? చిన్నప్పటి నా నిద్ర చరిత్ర ప్రసిద్ధమైనదే గదా. స్కూల్లో పాఠాలు చెపుతుంటే, కునికిపాట్లొస్తవని, వెనకగోడకు మేకొకటి కట్టి, తాడుకట్టి, జుట్టుకు ముడిపెట్టేవాణ్ణి. తల ఊగితే తాడు బిగిసి మెలకువ వచ్చేది. అట్లా కట్టు కోకుంటే, పంతులు చెవులు మెలిపి ఊపి లేపేవాడు'' అని నవ్వనారంభించారు భగవాన్.

''భగవానిదంతా కల్పించి చెప్పలేదు గదా?'' అన్నారు మురుగనార్. ''లేదు,లేదు. వాస్తవమే. పాఠం వినకుంటే పంతులు దండిస్తాడని అట్లా చేసేవాణ్ణి. అప్పటి స్థితి అది. ఇక్కడికి వచ్చిన మొదటి రోజుల్లో కళ్లు మూసుకొని ఒకే ధ్యానంలో ఉంటే, రాత్రేదో, పగలేదో తెలిసేది కాదు. ఎప్పుడైనా కళ్లు తెరచి చూస్తే, అప్పుడే ప్రొద్దుకుంకిందా? తెల్లవారిందా? అనిపించేది. ఆహారం లేదు. నిద్రలేదు. విహారం ఉంటే ఆహారం కావాలి. ఆహారం అంటే నిద్ర వస్తుంది. విహారం లేకుంటే ఆహారం వద్దు. ఆహారం లేకుంటే నిద్ర రాదు. ప్రాణాధారంగా ఏ స్వల్పాహారమో కుక్షిలో పడితే చాలు. నాకంతే అయ్యేది. కళ్లు తెరిచినప్పుడెవరో ఒకరు ద్రవరూపంగా ఏదో ఒకటి ఒక గ్లాసు ఆహారమిచ్చేవారు. అంతే, అయితే ఒకటి. ఒకే నిర్వికల్ప నిష్ఠలో ఉన్నప్పుడే తప్ప మనస్సు, శరీరం, వ్యవహారార్థం ఉపయోగించినప్పుడు ఆహార నిద్రలు విసర్జించుటకు వీలవుతుందా? అట్లా చేస్తే, శరీరం తూలుతుంది. అందువల్ల, మితసాత్త్వికాహార విహార నియతి ఆత్మోన్నతికి అత్యంతావశ్యకమని చెప్పవలసి ఉన్నది. ఉత్తములు తాము చేసే నిష్కామ్య సత్కార్యాచరణకు నిద్ర వల్ల కాలం వృధా పోరాదని, చాలాభాగం నిద్రను దూరం చేస్తారు. పదింటికి పడుకొని, రెండింటికి లేవటం మంచిదన్నారు కొందరు. అట్లాగైతే, నాలుగు గంటలు చాలును నిద్ర కన్నమాట. నాలుగు చాలదు ఆరుగంటలు కావాలన్నారు కొందరు. అంటే, ఆహార నిద్రలు అసలు మానటం మంచిది కాదు. అతిగానూ ఉండకూడదన్నారన్నమాట. నిజమే. ఏదైనా పూర్తిగా అరికట్టాలంటే మనస్సు దానిమీదికే పోతూ ఉంటుంది. అందువల్ల సాధకుడైన వాడన్నిటికీ మితంగా టయమివ్వాలి'' అన్నారు భగవాన్. భగవద్గీతలో చూడు

శ్లో: నాత్యశ్నతస్తు యోగో-స్తి, నచైకాంత మనశ్నతః
నచాతి స్వప్నశీలస్య జాగ్రతోనైవచార్జున . అ 6. శ్లో.16
శ్లో: యుక్తాహార విహారస్య, యుక్త చేష్టస్య కర్మసు,
యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా అ.6. శ్లో. 17

- సూరి నాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

వర్తమానంలో జీవించాలి




కాలం మూడు రకాలని అందరికీ తెలుసు. అవి భూత, వర్తమాన, భవిష్యత్తులు. భూత కాలం అంటే జరిగిపోయిన కాలం అని మనకు తెలుసు. వర్తమానం అనుభవిస్తుంటాము. భవిష్యత్తు ఎలా ఉంటుందో మనకు తెలియదు. అయితే ఆ కాలం కూడా ఉందని తెలుసు. కాలక్రమంలో ఎన్నో జరుగుతుంటాయి. సుఖాలు, దుఃఖాలు, కష్టాలు ఎన్నో ఉంటాయి. వర్తమానాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞులు చెబుతుంటారు. ఎందుకంటే భూత, భవిష్యత్తు కాలాలు మన అధీనంలో లేనివి. గతాన్ని గురించి ఇపుడు ఆలోచిస్తే ప్రస్తుతం ఆనందానికి దూరం అవుతాము. గతంలో సుఖం గురించి ఇపుడు తలచుకుంటే అది ఇప్పుడు లేదని దుఃఖం వస్తుంది. గతంలోని దుఃఖం ఇప్పుడు తలచుకుంటే ఎంత కష్టపడిపోయానో అని దుఃఖం వస్తుంది. కాబట్టి గతం ఒక భూతమే. భవిష్యత్తును గురించి ఇప్పుడు ఆలోచించడమెందుకు. ఆ సమయంలో పరిస్థితులు ఎలా ఉంటాయో ఇప్పుడు ఆలోచించినా మళ్ళీ ఆ సమయంలో ఆలోచించాల్సి వస్తుంది. దాని వల్ల ఈ సమయం వ్యర్థమవుతుంది కదా! గతాన్ని పరిశీలించుకుని భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకుని వర్తమానంలో వ్యవహరించడం తెలివైన పని. వర్తమానంలో జీవించాలి. ఈ క్షణం వ్యర్థం కాకుండా ప్రయత్నించాలి. ఈ క్షణం సద్వినియోగం చేస్తే వచ్చే ప్రతిక్షణం ఉత్తమంగానే ఉంటుంది. ప్రస్తుతాన్ని సద్వినియోగం చేసుకోమని చెప్పేదెందుకంటే ఏదైనా పనిని సమయం ఉన్నా ఎప్పుడో చేద్దామని వాయిదా వేసుకుంటే అది జరగకపోవచ్చు. మృత్యువు నీ జుట్టు పట్టుకుని తీసికెళ్ళడానికి సిద్ధంగా ఉంది కనుక ధర్మం చెయ్యి అని ఒక హితబోధ. అందువల్ల ధర్మం చేయడంలో ఆలస్యం వద్దు అనేది పెద్దల మాట. ఇక్కడ ధర్మాచరణకు సంబంధించి ఒక విషయం గుర్తు చేసుకోవడం ముఖ్యం. ఏదైనా దానం చేయదలచుకున్నపుడు దానిని వెంటనే చేయాలని, ఒక చేతి నుంచి మరో చేతికి మార్చుకునే లోగానే మనసు మారిపోయే ప్రమాదముందని చెబుతారు. అంటే ఎడమ చేత్తో దానం చేయమని కాదు సాధ్యమైనంత త్వరగా చేయమని

కాలం భగవత్స్వరూపం. అందువల్ల కూడా దానిని సద్వినియోగం చేసుకోవాలి. కాలేశ్వరుని పేరుతో శివుడు కొలువై ఉన్న క్షేత్రాలు కూడా ఉన్నాయి. ఇక కాశికాపురాధినాథుడు కాలభైరవుడున్నాడు. పరమాత్మ వలె కాలం అనంతమైనది. దాని ఆద్యంతాలు మనకు తెలియదు. ఆ కాల ప్రవాహంలో కొంత సమయం మాత్రమే మన అస్తిత్వం ఉంటుంది. మనకు ముందు కాలం ఉంది. మన తర్వాత కాలం ఉంటుంది. మానవులు ఉన్నా లేకున్నా కాలం మాత్రం ఉంటుంది. అది నిత్యం. సర్వానికి సాక్షీభూతం.

(డాక్టర్ సివిబి సుబ్రహ్మణ్యంగారి వ్యాసం ఆధారంగా)

పుష్కర ద్వీపం

దధి, మండ సముద్రానికి అవతల పుష్కర ద్వీపము శాఖ ద్వీపమునకు రెట్టింపు వెడల్పుతో వ్యాపించి ఉంటుంది. స్వాదుజల సముద్రముతో చుట్టూ ఆవరించబడి ఉంటుంది. ఈ సముద్రముపై పెద్ద పుష్కరం అనగా పద్మము వ్యాపించి ఉంటుంది. ఇది జ్వాలా శిఖలతో, స్వచ్ఛమైన బంగారు ఆకులతో రక్షతో వ్యాపించి ఉంటుంది. ఈ పద్మము చతుర్ముఖ బ్రహ్మకు ఆసనంగా కల్పించబడి ఉంటుంది. ఈ ద్వీపము మధ్యలో ఉన్న మానస సరస్సుకు ఉత్తరముగా మానసరోత్తరము అను పేరుతో పదివేల యోజనముల ఎత్తుతో, అంతే విస్తీర్ణముతో ఒకే పర్వతము ఉంది. ఈ పర్వతమునకు నాలుగు దిక్కులలో ఇంద్రాది నలుగురు లోకపాలకుల పురములు ఉంటాయి. ఈ పర్వతం పైనే సూర్యభగవానుని రథానికి సంవత్సర రూపమైన చక్రము మేరు పర్వతము చుట్టూ తిరుగుతూ దేవతలకు అహోరాత్రము కనిపిస్తుంటుంది.



పుష్కర ద్వీప ఊహా చిత్రం

ధర్మం-మర్మం



- డా॥ కందాడై రామానుజాచార్య



భగవద్గీత

నిరంతర భక్తి నియుక్తుడు ఉత్తముడు

అధ్యాయం 7

శ్లోకం 17:

తేషాం జ్ఞానీ నిత్యయుక్త
ఏకభక్తిర్విశిష్యతే।
ప్రియో హి జ్ఞానినోత్యర్థమ్
అహం స చ మమ ప్రియః॥

తాత్పర్యం

వీరిలో సంపూర్ణ జ్ఞానము కలిగి సదా భక్తియుక్తసేవలో నియుక్తుడై ఉండేవాడు అత్యంత ఉత్తముడు. ఎందుకంటే నేనతనికి మిక్కిలి ప్రియుడను, అతడు నాకు మిక్కిలి ప్రియతముడు.

భాష్యం

ఈ నలుగురిలోకి ఎవరైతే భగవద్ జ్ఞానముతో 'నేను భగవంతుని' అని సేవలో నిమగ్నుడవుతాడో అతడు ఉత్తముడు, భగవంతునికి మిక్కిలి ప్రియతముడు. వారందరూ కూడా శుద్ధ భక్తుని సాంగత్యములో క్రమేణా శుద్ధ భక్తిని పాటించవచ్చునేమో గాని, ఇతనికి వేరే భౌతిక కోరికలు లేని కారణముగా అతని సాధన స్థిరంగా కొనసాగుతుంది. భగవంతుని దివ్య స్థితిని ఎరిగి ఉన్న కారణముగా అతడు భౌతిక సాంగత్యముచే ప్రభావితుడు కాక పూర్తి రక్షణతో కొనసాగుతాడు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

దినఫలాలు

మేష రాశి: ఆర్థిక లావాదేవీలు అనుకూలం. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. విద్యా ప్రయత్నాలు అనుకూలం. మంచికార్యాలలో పేరు, ప్రఖ్యాతులు లభిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయమార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు వంటివి ఉపకరిస్తాయి. విద్యా విషయాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ పనికిరాదు. ఆర్థిక విషయాల్లో విస్మయాలు ఉంటాయి. ఆదాయ వృద్ధిలో ఆటంకాలు కొనసాగుతాయి.

మిథున రాశి: సాహస నిర్ణయాలు ఊరట కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలలో ఉపశమనం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలత ప్రారంభమవుతుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పనులలో వేగం పెరుగుతుంది. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు కలసి వస్తాయి.

కర్కాటక రాశి: శ్రమ అధికమవుతుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఉంటుంది. అనవసర ఆందోళనలు పెరుగుతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

సింహ రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. పెట్టుబడుల ప్రతిబంధకాలు ప్రబలమవుతాయి. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార మోసాలను గ్రహించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: తెలివైన నిర్ణయాలు తద్వారా విజయాలు చేకూరుతాయి. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. వ్యాపార విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు సులభతర మవుతాయి.

తులా రాశి: విదేశీ లావాదేవీలు/సంభాషణలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. అతి తొందర ద్వారా కార్యక్రమాల్లో పొరపాట్లు దొర్లుతాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడగట్టుకొనే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.


వృశ్చిక రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. అసహన పరిస్థితులు వ్యాపార పరంగా ఉంటాయి. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. వ్యాపార ప్రతిబంధకాలను ఎదుర్కోగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. గతంలోని తప్పులు సరిదిద్దుకొనే అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: సంభాషణల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. కోర్టు వ్యవహారాలు ఊరట కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి. ఆరోగ్య ప్రతి కూలత ఆకస్మికం. బాధ్యతలు పెరుగుతాయి. ఆదాయం గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.


కుంభ రాశి: నూతన ఉత్సాహం పెరుగుతుంది. విద్యా ప్రయత్నాలు లాభిస్తాయి. శుభవార్తలు వింటారు. శుభవ్యయం ఉంటుంది. ఆరోగ్య విషయంలో ప్రతికూలత తగ్గుతుంది. పోటీని తట్టుకోగలుగుతారు. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

మీన రాశి: రుణ ప్రయత్నాలు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ఉపశమనం ఉంటుంది. ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్య రీత్యా శ్రద్ధ పాటించాలి. ముఖ్యమైన పనుల విషయంలో ఏకాగ్రత తప్పనిసరి. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

కులాసా



చలికాలంలో సైనసైటిస్ ముప్పే

సైనసైటిస్ అంటే ఏమిటి?

సైనసెస్ అంటే ముక్కు చుట్టూ కంటి వెనక భాగం వరకు గాలితో నిండి ఉండే ప్రదేశం. పుర్రెభాగాన్ని తేలికగా ఉంచడానికి, ముక్కు నుంచి పీల్చిన గాలిని తేమగా ఉంచడానికి ఇవి దోహదపడతాయి.

సైనస్ లక్షణాలు ఏమిటి? సైనస్ ఇన్ఫెక్షన్‌కి గురయ్యారా?

రెండు రకాల సైనసైటిస్‌లు ఉన్నాయి. ఒకటి తీవ్రమైన సైనసైటిస్. సర్వసాధారణంగా జలుబు ఉంటుంది. తల, కంటి చుట్టూ భాగంలో భారంగా ఉంటుంది. ముక్కు రంధ్రాలు మూసుకుపోతాయి. శ్లేష్మం బొట్టుబొట్టుగా జారుతూ గొంతు వెనకభాగం నుంచి క్రిందికి దిగుతుంది. దీనివల్ల గొంతు నొప్పి కూడా వస్తుంది.

రెండోది దీర్ఘకాలంగా ఉన్న సైనసైటిస్. ఇది వస్తే మాత్రం ఇన్ఫెక్షన్ ఉంటుంది. నెలల తరబడి కొనసాగే అవకాశం ఉంది. ఒకవేళ ఈ వ్యాధి తగ్గినా మళ్లీ తిరగబెడుతుంది.

సైనస్ ఇన్ఫెక్షన్ ఉంటే ప్రతీసారి యాంటీబయోటిక్స్ వాడాల్సిన అవసరముందా?

తప్పనిసరిగా వాడాల్సిన అవసరం లేదు. లక్షణాల తీవ్రతను బట్టీ ఈఎన్‌టి సర్జన్ యాంటీబయోటిక్స్ కోసం సిఫారసు చేస్తాడు. దీర్ఘకాలికంగా సైనసైటిస్ ఉంటే మాత్రం నాసికా రంధ్రాల ద్వారా స్టెరాయిడ్ స్ప్రే తీసుకుంటారు. కొన్నివారాల్లో లక్షణాలు తగ్గుముఖం పడతాయి. నాసికా రంధ్రాలు శుభ్రపడితే సైనసైటిస్ తగ్గుముఖం పడుతుంది.

నాసికా దూల వల్ల సైనసైటిస్‌కి దారితీస్తుందా?

చాలా కేసుల్లో నాసికాదూల సరిగ్గాలేని కారణంగా సైనసైటిస్ వస్తుంది. నాసికా అలర్జీల వల్ల కూడా సైనసైటిస్‌కి కారణంగా నిలుస్తుంది. నాసికలో ఉన్న మాంసపు కండ పరిమాణాన్ని బట్టి సైనసైటిస్ ఉంటుంది. వీటిని టర్బినేట్స్ అని కూడా పిలుస్తున్నారు.

ఎలాంటి పరీక్షలు అవసరమవుతాయి?

ఈఎన్‌టి సర్జన్ దగ్గరికి వెళితే సైనసైటిస్ సమస్య ఉన్నట్టు గుర్తిస్తే మాత్రం సీటీస్కాన్ కోసం సిఫారసు చేయొచ్చు. దీర్ఘకాలంగా మందులు వాడినప్పటికీ నయం కానప్పుడు ఈ పరీక్ష చేస్తారు. ఇన్ఫెక్షన్ వల్ల ఎటువంటి అవలక్షణాలు కలిగాయో సీటీస్కాన్ ద్వారా వెల్లడవుతుంది.

ఎండోస్కోపిక్ సైనస్ సర్జరీ అంటే ఏమిటి?

ఇది తక్కువ కోతల శస్త్రచికిత్స. ముక్కులోపలి భాగం నుంచి ఈ శస్త్రచికిత్స చేస్తారు. దీనివల్ల ముక్కు వెలుపల ఎటువంటి కోతలు, మరకలు ఉండవు. సైనస్ తెరచుకోవడానికి ఫైన్ ఎండోస్కోప్ వినియోగిస్తారు. దీనివల్ల స్రావాలు నాసికా రంధ్రాల ద్వారా కారిపోతాయి.

సైనస్ శస్త్ర చికిత్స వల్ల ప్రయోజనం ఉందా?

సైనస్ శస్త్రచికిత్స చాలా విజయవంతమయ్యింది. ఎందుకంటే రోగి జీవిత నాణ్యత మరింత పెంచుతుంది. సైనస్ శస్త్రచికిత్స సమర్థవంతంగా ఉండదని సర్వసాధారణ అపోహ. ఇటువంటి వార్త మీరు వినే ఉంటారు. నాసిక రంధ్రాల ద్వారా శ్వాసతీసుకోగలుగుతున్నారు. నాసికారంధ్రాల్లో ఉన్న పూడికలను తొలగిస్తుంది. సైనస్ శస్త్రచికిత్స అన్ని సమస్యలను పరిష్కరించలేదు. అలర్జీలు వంటివి తగ్గకపోవచ్చు. శస్త్రచికిత్సల వల్ల అనారోగ్యానికి గురవుతామని చాలామంది భావిస్తారు. వివిధ బ్యాక్టీరియా కారణంగా ఇన్ఫెక్షన్స్ వస్తుంటాయి. కాబట్టి ఏ శస్త్రచికిత్స అయినా ఇటువంటి సమస్యను పరిష్కరించలేదు. సైనస్ సర్జరీ అయిన తర్వాత కూడా జలుబు, వైరల్ యుఆర్ఐ అనేది మామూలు విషయం.



డాక్టర్ ప్రదీప్‌సింగ్
సీనియర్ కన్సల్టెంట్ అండ్ చీఫ్
డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఈఎన్‌టి, హెడ్
అండ్ నెక్ సర్జరీ
కాంటినెంటల్ హాస్పిటల్స్

కఫ దోషం వల్లే




కఫ దోషం వల్ల సైనసైటిస్ వ్యాధి సంక్రమిస్తుంది. చల్లటి ఆహారాన్ని తీసుకోకూడదు. శీతలపానీయాల జోలికి, మంచు ఉన్న ప్రదేశాలకు వెళ్లకూడదు. చల్లటి నీటితో స్నానం చేయకూడదు. ముఖ్యంగా తలస్నానం పనికిరాదు. పగటి నిద్ర పనికిరాదు. ఏడెనిమిది గంటలకు మించి నిద్రపోకూడదు. నూనె పదార్థాలు, స్వీట్లు, ఉప్పు అధికంగా తీసుకోకూడదు. అరగని పదార్థాలను తీసుకోకూడదు. సీజనల్ పండ్లు తినాలి. దానిమ్మ, నారింజ, బత్తాయి, బొప్పాయి, యాపిల్, పియర్స్ వంటివి ఎక్కువగా తీసుకోవడం మంచిది.

పాలు,చక్కెర, కాఫీ, వేపుడు ఉత్పత్తులు, రిఫ్రిజిరేటర్‌లో నిల్వ ఉన్న ఆహారపదార్థాలు తినడం వల్ల సైనసైటిస్ తిరగబెడుతుంది. ఫాస్ట్ ఫుడ్ జోలికి అస్సలు వెళ్లకూడదు. కార్బోనేటెడ్ డ్రింక్స్, సిగరెట్లు, చాక్లెట్లు, మైదా, లిక్కర్, మాంసం, బ్రెడ్, జంక్ ఫుడ్ తినడం మంచిది కాదు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. నడక కూడా మంచిదే. అల్లంవెల్లుల్లి, ఉల్లిగడ్డలు మన ఆహారంలో భాగం కావాలి. వాత, కఫ దోషాల వల్ల సైనసైటిస్ వస్తుంది కాబట్టి జాగ్రత్తగా ఉండటం మంచిది. ఆహారం వేడిగా లేదా చల్లగా ఉండకూడదు. సులభంగా జీర్ణమయ్యే ఆహారం వేడివేడిగా ఉండాలి. ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. ఫైబర్ ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలి. సేంద్రీయ ఎరువులతో చేసిన పండ్లు, కూరగాయలు చాలా మంచిది. వంకాయ తినకూడదు. అలాగే అరటిపండు, టమాట, పెరుగు ద్వారాలకు అడ్డుగా నిలుస్తాయి. వేళకు ఆహారం తీసుకోవాలి. ఒకవేళ తీసుకోకపోతే జఠరాగ్ని లోపాలు తలెత్తి జీర్ణంకాదు. దాల్చిన చెక్క, మిరియాలు, పూదీనా, ఉల్లిగడ్డ, తులసి, వెల్లుల్లి, కొత్తిమీర,లవంగం, పసుపు , అల్లం వంటల్లో విరివిగా ఉపయోగించాలి. అలాగే కంటిఅద్దాలు సరిపోయే విధంగా ఉండాలి. ఒకవేళ అద్దాలు మీ ముక్కు రంధ్రాలను పట్టేసినట్లుగా ఉంటే మాత్రం సైనసైటిస్ వ్యాధి తీవ్రమయ్యే అవకాశం ఉంది.
సిగరెట్ త్రాగకూడదు.
వాయుకాలుష్యం వల్ల ఇది ఎక్కువవుతుంది.



డాక్టర్ బి సంగమేశ్వర్
ఆయుర్వేద వైద్య నిపుణులు
9440065764

హోమియోలో 'సిలీసియా'



సైనసైటిస్ వ్యాధికి హోమియో చికిత్స పరిష్కారం చూపిస్తుంది. శరీరం వ్యాధి నిరోధకశక్తిని తట్టుకునే విధంగా తయారు చేస్తుంది. దీర్ఘకాలికంగా ఉన్న ఈ వ్యాధిని కేవలం కొద్ది రోజుల్లోనే పూర్తిగా నయం చేయవచ్చు.

సిలిసియా

సిలిసియా అనే హోమియో మందువల్ల సైనస్ ఇన్ఫెక్షన్‌లను దూరం చేసుకోవచ్చు. అంతేకాదు తలనొప్పిని కూడా దూరం చేసుకోవచ్చు.

బెల్లడోనా

హోమియోపతి మందుల్లో బెల్లడోనా కూడా బాగా పనిచేస్తుంది. సైనస్ వల్ల వచ్చే తలనొప్పిని ఇది దూరం చేస్తుంది. తీవ్రమైన తలనొప్పి వచ్చినప్పుడు దీనిని వాడవచ్చు. తలపట్టేసినట్లుగా అనిపించినప్పుడు వినియోగించవచ్చు. ముఖం వాచినప్పుడు బాగా వేడి ఉన్నప్పుడు కూడా ఇది పనిచేస్తుంది. సైనస్ కారణంగా గొంతునొప్పి, దగ్గు వస్తే ఇది ఉపయోగకారి.


కాలిబిక్రోమ్ మందు కూడా చక్కగా పనిచేస్తుంది. సైనసైటిస్ వల్ల గొంతు వెనకభాగం నుంచి స్రావాలు క్రిందికి జారినప్పుడు ఈ మందును వాడాలి. ఈ స్రావాలు మందంగా, పసుపువర్ణంలో ఉంటాయి.

శరీరతత్వాన్నిబట్టీ ఈ చికిత్స అందించాల్సి ఉంటుంది.

డాక్టర్ టి. గీత
హోమియోవైద్యనిపుణులు
8019109109



ఐదువేల ఏళ్లక్రితమే ఆక్యుపంక్చర్



సైనసైటిస్ వ్యాధికి ఐదువేల ఏళ్ల క్రితమే చికిత్స ఉన్నట్టు గుర్తించారు. చైనీయులు ఈ చికిత్స గూర్చి కూలకశంగా తెలుసుకున్నారు. రక్తప్రసరణ ఎలాంటి అడ్డంకులు లేకుండా ఉండటానికి ఆక్యుపంక్చర్ దోహదపడుతుంది. సైనస్ సమస్యలు రావడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఊపిరితిత్తుల వేడి వల్ల కూడా ఇది వస్తుంది. సరైన ఆకుపాయింట్స్ మీద ఒత్తిడి ద్వారా అసలు విషయాలను ఆక్యుపంక్చరిస్ట్ తెలుసుకుంటాడు. ఇలా చేయడం వల్ల వ్యాధి ఎందుకు ఎలా వచ్చిందో కూడా తెలుసుకోవచ్చు.

హీలర్ కె. దిలీప్‌కుమార్
క్యాతన్ ఆక్యుపంక్చర్
హెల్త్ రీసెర్చ్ అండ్ సొసైటీ
హైదరాబాద్, విజయవాడ
9848828808



ఆస్థమాకి విరుగుడు

ఇన్‌హేలేషన్ థెరపీ

త్రన మెరిసే చిరునవ్వుతో 14 ఏళ్ల రియా ఇంటికి వేగంగా పరిగెత్తి వచ్చి డాన్స్ పోటీలో గెలుచుకున్న ట్రోఫీని చూపించింది. కొద్దినెలల ముందు ఆమెకి దాదాపుగా ఇది అసాధ్యమే. ఆమె ఊపిరితిత్తులపై కొద్దిపాటి ఒత్తిడి వల్ల ఊపిరితీసుకోవటానికి కష్టపడేలా చేస్తుంది.

ఆమె చాలాకాలంగా నోటి ద్వారా మందులు తీసుకుంటోంది. ఇతర పిల్లలకంటే తక్కువ శక్తి ఉంది. కొద్దిగా శారీరక శ్రమకి గురైనా కూడా ఆమెకి దగ్గు. పిల్లికూతలు ప్రారంభమవుతాయి. ఇంకా అధ్వాన్నం ఏమంటే మందుల వల్ల కడుపులో పుండ్లు, మానసిక ఒత్తిడి, కండరాల బలహీనత, చర్మం కందిపోవటం వంటి దుష్ప్రభావాలు సంభవించాయి. ఆమె సాధారణ జీవితానికి అడ్డంకులు వాటిల్లాయి. ఇప్పుడు ఆమె జీవిత నాణ్యత ఎంతగానో మెరుగుపడింది. నోటి ద్వారా తీసుకునే మందులు కాకుండా రియా ఇన్‌హెలేషన్ థెరపీ తీసుకుంది. దీర్ఘకాలంలో సురక్షితమైన, మరింత ప్రభావవంతమైన చికిత్సగా మారింది. డాన్స్ అంటే రియాకి ఎంతో ఇష్టం. ఇప్పుడు ఆమె ఎంతో ఆరోగ్యంగా ఉంది. ఆస్థమా తిరగబెడుతుందనే భయం లేకుండా స్వేచ్ఛగా తిరుగుతోంది.



ఈ పరిస్థితిలో పోరాడుతున్న రియా వంటి వారు చాలామందే ఉన్నారు. అయితే సరైన చికిత్సా విధానంతో సక్రమమైన నిర్వహణతో ఆస్థమా, సీఓపీడీ (క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మొనరీ డిసీజెస్), సిగరెట్ తాగటం, అలెర్జిక్ రైనిటిస్ వంటి శ్వాసకోశ వ్యాధుల నియంత్రణ సులభం.

ఇన్‌హేల్డ్ కార్టికోస్టిరాయిడ్ థెరపీ (ఐసీటీ) అనేది ఆస్థమాని నియంత్రించడానికి కీలకమైనది. ఏదైనా చికిత్సా విధానంలో ఉత్తమంగా మందులు అందచేయటం ప్రధానం.

మందుల వల్ల వాపుకిగురైన ఊపిరితిత్తులకి చికిత్స చేయడం అనివార్యం.

ఆస్థమా వ్యాధితో బాధపడే పిల్లలతో సహా అన్ని వయస్సుల వారికి ఐసిటి ఉపయోగించవచ్చని నేషనల్ ఆస్థమా ఎడ్యుకేషన్ అండ్ ప్రివెన్షన్ ప్రోగ్రాం సిఫారసు చేసింది.

ఆస్తమా అనేది ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపిస్తున్న దీర్ఘకాలిక వ్యాధి. దీనితో బాధపడే వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. డబ్ల్యూ హెచ్ ఓ ఫ్యాక్ట్ షీట్ ఎన్ 206 ప్రకారం అంతర్జాతీయంగా సుమారు 100, 150 మిలియన్ ప్రజలు ఆస్థమాతో బాధపడుతున్నారు. భారతదేశంలో ఈ సంఖ్య 15 నుంచి 20 మిలియన్‌లకి చేరుకుంది.

ఆస్థమాని నిర్వహించటంలో ఇన్ హేల్డ్ కార్టికోస్టిరాయిడ్స్ ప్రధానమైనవి.


దురదృష్టవశాత్తు చైతన్యం లేకపోవటం వల్ల చాలామంది ప్రజలు ఈ థెరపీ తీసుకోవడానికి ఇష్టపడటం లేదు. చాలామందికి స్టిరాయిడ్ అనే పదం ఉండటం వల్ల ప్రతికూలంగా ఆలోచిస్తున్నారు. ఈ పదం కండరాల్ని నిర్మిస్తుంది అనే భావన కలిగిస్తోంది. వారు కార్టికోస్టిరాయిడ్స్‌ని అనబోలిక్ స్టిరాయిడ్స్‌గా భావించి గందరగోళానికి గురవుతున్నారు.

కార్టికోస్టిరాయిడ్స్ అనబోలిక్ స్టిరాయిడ్స్ ఒకటి కాదు. అర్థం చేసుకోవడం ప్రధానం.

కండరాలను పెంచుకోవడానికి కొంతమంది అథ్లెట్స్ అనధికారికంగా అనబోలిక్ స్టిరాయిడ్స్ ఉపయోగిస్తారు. కార్టికోస్టిరాయిడ్స్‌ని ఆస్థమా చికిత్సలో ఉపయోగిస్తారు. అవి కండరాలను నిర్మించలేవు. మీ శరీరం సహజంగా ఉత్పత్తి చేసే హార్మోన్స్ ఇవి. డాక్టర్ మీకు ఇన్‌హేల్డ్ కార్టికోస్టిరాయిడ్స్ సూచిస్తే వాచిన మీ ఊపిరితిత్తుల్ని శాంతపరచడానికి చిన్న పరిమాణాల్లో ఇదే హార్మోన్ ఇస్తారు. కార్టికో స్టిరాయిడ్స్ ఎందరో జీవితాల్ని కాపాడే ఔషధాలు. ఎందుకంటే అవి ఊపిరితిత్తుల వాపుని నివారించడంలో లేదా ఆ ప్రక్రియను తిప్పి కొట్టడంలో సహాయపడతాయి.

డాక్టర్ వంశీధర్ ఖేదార్
కన్సల్టెంట్
పల్మొనాలజిస్ట్
లోటస్ చిల్డ్రన్ హాస్పిటల్





సీఓపీడీ ప్రాణాంతక వ్యాధి

వేగంగా కొట్టుకుంటున్న గుండెతో సుశీల్‌జైన్ తన అపార్ట్‌మెంట్ తలుపు వద్దకు చేరుకున్నాడు. తనకు క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మొనరీ డిజార్డర్(సీఓపీడీ) ఉందని నిర్ధారణ జరిగిన నాటి నుంచి తన ఆరోగ్యం ఎంతక్షీణించిందో గ్రహించాడు. సీఓపీడీ ఊపిరితిత్తుల లోపాల వాయుమార్గాల్ని దెబ్బతీసే వ్యాధి. ఈ ఊపిరితిత్తుల వ్యాధి వల్ల సరిగ్గా ఊపిరి అందకపోయేది. నిర్విరామంగా దగ్గు వచ్చేది. ప్రతీ శ్వాస ఎంతో కష్టంగా ఉండేది. శ్వాస తీసుకునే సమయంలో కళ్లు కూడా వెడల్పయ్యేవి. ఈ వ్యాధి దైనందిన జీవితం మీద ఎంతో కొంత ప్రభావం చూపిస్తుంది. సాధారణ సంభాషణ కూడా కష్టంగా ఉంటుంది. ఎందుకంటే ఈ వ్యాధి ఉన్న వ్యక్తి ఆలోచించేది తదుపరి శ్వాస గురించి మాత్రమే. సుశీల్‌కి మొదట ఈ లక్షణాలు కనిపించినప్పుడు వాతావరణంలో కాలుష్యం,పొగత్రాగడం వల్ల వచ్చే దగ్గుగా భావించాడు. కానీ క్రమేణా ఈ వ్యాధి మరింత ప్రమాదకరంగా మారింది. ఎక్కువగా దగ్గినప్పుడు అతను శక్తివంతమైన స్టిరాయిడ్స్ కూడా తీసుకోవాల్సి వచ్చింది. ముఖం వాపు, ఎముకల బలహీనత, అధిక రక్తపోటు వంటి వివిధ దుష్ప్రభావాల్ని కలిగించింది. సుశీల్ అనుభవిస్తున్న బాధల్ని ఈ ప్రపంచంలో ఎంతోమంది ఉన్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది.సీఓపీడీ దాదాపు 210 మిలియన్‌ప్రజలపై ప్రభావం చూపిస్తోంది. భారతదేశంలో ఈ రుగ్మతతో అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకత ఉంది. 2016లో మన దేశంలో 22 మిలియన్ మంది ఉన్నారు. ఒక దశాబ్దం క్రితం సీఓపీడీ మరణానికి అయిదో ప్రధాన కారణంగా నిలిచింది. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా మరణానికి నాలుగో అతిపెద్ద కారణంగా అంచనావేయబడుతోంది. ప్రజల్లో చైతన్యం లేకపోవడం, ప్రారంభంలో లక్షణాల్ని నిర్లక్ష్యం చేయడం, వ్యాధి నిర్ధారణలో ఆలస్యం, ప్రభావవంతమైన వైద్య సహాయంఅందకపోవడం వంటి కారణాల వల్ల ఈ రుగ్మత మరింత విస్తృతమవుతోంది. సీఓపీడీ నిర్ధారించడానికి అత్యంత సాధారణంగా ఉపయోగించే శ్వాసపరీక్షల్లో ఒకటి స్పైరోమెట్రీ. ఇది బాధరహితమైన పరీక్ష. ఛాతీ ఎక్స్‌రే, రక్తంలో ప్రాణవాయువు శాతం కొలిచే పరీక్షలుంటాయి. సరైన సమయంలో రుగ్మతను గుర్తించడానికి ఈ పరీక్షలు దోహదపడతాయి.

పొగత్రాగడాన్ని వదిలేయడం, మంచి జీవనశైలి అలవాట్లు, ఇన్‌హేల్డ్ కార్టికోస్టిరాయిడ్స్ వంటి చికిత్సలను సీఓపీడీ ఉన్నవారికి అందించాలి. దీనివల్ల జీవిత నాణ్యత మరింత పెరుగుతుంది.

ఇన్‌హేల్డ్ కార్టికోస్టిరాయిడ్స్ నేరుగా దెబ్బతిన్న వాయునాళాల్ని చేరుకుంటాయి. నోటిద్వారా తీసుకునే కార్టికోస్టిరాయిడ్స్ మొదట రక్తంలో కలిసిపోతాయి. తర్వాత వివిధ అవయవాల ద్వారా ప్రభావానికి గురై వాయుమార్గాల్ని చేరుకుంటాయి. ఈ ప్రక్రియలో మందు అవసరం లేనిచోట శరీరంలో వివిధ భాగాల ద్వారా మందు గ్రహించబడుతుంది. ఇది అంతర్ప్రవాహ దుష్ప్రభావాల్ని కలిగిస్తుంది.

డాక్టర్ బాలరాజు
మేనేజింగ్ డైరెక్టర్
ది చెస్ట్ క్లినిక్
గాయత్రి నర్సింగ్ హోం





భాగమతి ప్రీ రిలీజ్ వేడుక

అందాల తార అనుష్క శెట్టి నటిస్తున్న తాజా చిత్రం భాగమతి. థ్రిల్లర్ కథతో దర్శకుడు అశోక్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. తెలుగుతో పాటు మిగతా మూడు దక్షిణాది భాషల్లో భాగమతి తెరపైకి రానుంది. జనవరి 26న రిపబ్లిక్ డే సందర్భంగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రీ రిలీజ్ వేడుకలను హైదరాబాద్‌లో నిర్వహించారు. నిర్మాత అల్లు అరవింద్, దర్శకులు మారుతి, రాధాకృష్ణ, మేర్లపాక గాంధీ, కథానాయకుడు నాని తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అనుష్క మాట్లాడుతూ.... భాగమతి కథను 2012లో విన్నాను. అప్పటికే బాహుబలి, సింగం 3 చిత్రాలతో నా డేట్స్ ఖాళీగా లేవు. కథ నచ్చినా చేయలేని పరిస్థితి ఏర్పడింది. నేను చేయలేనని చెప్పినా...నా కోసం నాలుగేళ్లు వేచి చూశారు. నా హృదయానికి దగ్గరైన చిత్రమిది. ఇది నా చిత్రమే కాదు....మిగతా ప్రధాన నటీనటులు కథలో కీలకంగా ఉంటారు. వాళ్ల నట ప్రతిభ భాగమతిని మరో స్థాయికి తీసుకెళ్లింది. అని చెప్పింది. దర్శకుడు అశోక్ మాట్లాడుతూ....భాగమతి కథను ముందు ప్రభాస్ గారికి చెప్పాను. తనతో పాటు తన చుట్టూ ఉన్న అందరూ బాగుండాలని కోరుకునే వ్యక్తి అతను. ప్రభాస్ వల్లే భాగమతి ఇక్కడిదాకా వచ్చింది. అనుష్క ఏ పాత్రలోనైనా ఇమిడిపోగల నాయిక. అరుంధతి, రుద్రమదేవి, వేదంలో సరోజ, ఇప్పుడు భాగమతి... ఇలా విభిన్నమైన పాత్రల్లో ఒదిగిపోతుంది. అనుష్క ఒక శక్తి. సినిమా కోసం ఆమె తీసుకునే శ్రమ అద్భుతం. భాగమతి కోసం 45 రోజులు దుమ్ములో నటించారు. ఇక నిర్మాతలు వంశీ, ప్రమోద్, విక్కీ సినిమా కోసం ఎంతైనా శ్రమిస్తారు. ఐదేళ్లుగా ఈ నిర్మాతలతో ప్రయాణం చేస్తున్నాను. ఈ కథలో తామూ ఓ పాత్ర చేస్తున్నంత శ్రద్ధగా ప్రధాన సాంకేతిక నిపుణులు పనిచేశారు అన్నారు.

నాని మాట్లాడుతూ....భాగమతి ఇంటర్వెల్ చూసి అద్భుతంగా ఉందంటూ ఓ వ్యక్తి ఫోన్ చేసి చెప్పారు. ఈ ఏడాది అన్ని పురస్కారాలు అనుష్కకే దక్కుతాయని చెప్పారు. నాతో పిల్ల జమీందార్ రూపొందించిన అశోక్‌కు ఆ సినిమా పేరు ఇంటిపేరైంది. ఇకపై భాగమతి అశోక్‌గా పిలుస్తారు. అన్నారు. ఈ లోగా ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేశారు. గతంలో అనుష్క పుట్టిన రోజు సందర్భంగా ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన చిత్ర యూనిట్ తాజాగా..మరో పోస్టర్‌ను బయటకు తీసుకొచ్చారు.

దర్శకుడు అశోక్ భాగమతి గురించి మాట్లాడుతూ...ఈ చిత్రం కోసం అనుష్క 18 కిలోల బరువు తగ్గింది. సినిమా అంతా అనుష్క పాత్ర చుట్టూనే తిరుగుతుంది. అయితే అనేక కీలక పాత్రలు కథలో ఉంటాయి. టైటిల్‌ను బట్టి చారిత్రక చిత్రం అనుకుంటారు గానీ ఇదొక మోడరన్ డే థ్రిల్లర్. నిజ జీవిత పాత్రల నుంచి స్ఫూర్తి పొంది ఈ కథను రాశాను. ఇందులో రెండు విధాలుగా అనుష్క పాత్ర ఉంటుంది. ఆమెతో పాటు మిగతా క్యారెక్టర్‌లను ప్రేక్షకులు తమతో పోల్చుకునేలా ఉంటాయి. అన్నారు. భాగమతిలో అనుష్క స్నేహితుడు ప్రభాస్ ఓ అతిథి పాత్రలో నటిస్తారని ఊహాగానాలు వినిపించాయి. తాజాగా విడుదల తేదీ దగ్గరకు వస్తుండటంతో...ఇందులో నిజం లేదని తెలుస్తోంది.

నువ్వు నాకు చాలా చాలా స్పెషల్



చాలా మంది సెలబ్రిటీలు వృత్తిపరంగా బిజీగా ఉంటూ వ్యక్తిగత జీవితాన్ని కోల్పోతుంటారు. కెరీర్ ముఖ్యమని భావిస్తారు. కానీ సూపర్‌స్టార్ మహేష్‌బాబు కాస్త డిఫరెంట్. వృత్తితో పాటుగా కుటుంబానికి ప్రాధాన్యతనిస్తారు. తరచుగా కుటుంబంతో కలిసి విదేశీయాత్రలు చేస్తుంటారు. దీనివల్ల కుటుంబంతో మరింత ఎక్కువగా గడపవచ్చనేది ఆయన అభిప్రాయంలా ఉంది.

సోమవారం మహేష్ సతీమణి నమ్రత పుట్టినరోజు. వీరిది ప్రేమవివాహం అనే విషయం తెలిసిందే. తన భార్యకు బర్త్‌డే గ్రీటింగ్ చెబుతూ ఆమెపై ఉన్న ప్రేమను చాటుకున్నారు. నువ్వు నాకు ఎందుకు చాలా చాలా స్పెషల్ అని చెప్పేందుకు ఇది మరో కారణం.... నా ప్రేయసి... నా బెస్ట్‌ఫ్రెండ్.. నా భార్య అయిన నీకు పుట్టినరోజు శుభాకాంక్షలు అంటూ ట్వీట్ చేశారు మహేష్. ఒక్క వ్యాఖ్యంలోనే తన ప్రేమను చాటుకున్నారు. అలాగే నమ్రత, కొడుకు గౌతమ్, కుమార్తె సితారతో కలిసి తను దిగిన ఫోటోను మహేష్ షేర్ చేశారు.

దైవసన్నిధానం చైర్మన్‌గా మోహన్‌బాబు



హైదరాబాద్ ఫిలింనగర్ దైవసన్నిధానం ఛైర్మన్‌గా మోహన్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. శ్రీ శారదా పీఠం అధిపతి శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి వారు మోహన్‌బాబుతో పాటు 12 మంది పాలక మండలి సభ్యులను ప్రమాణం స్వీకారం చేయించారు. మోహన్‌బాబు ఛైర్మన్‌గా నియమితులవగా....పాలక మండలి సభ్యులుగా గిరిబాబు, పరుచూరి గోపాలకృష్ణ, కృష్ణంరాజు సతీమణి శ్యామల, చిరంజీవి సతీమణి సురేఖ, చాముండేశ్వరీనాథ్, వి. రామ్ ప్రసాద్ ఎంపికయ్యారు. దైవసన్నిధానంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు సుబ్బిరామి రెడ్డి, రాజమండ్రి ఎంపీ మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోహన్‌బాబు మాట్లాడుతూ...గుడికి ఛైర్మన్ కావాలని ఎప్పుడూ అనుకోలేదు. మా విద్యా సంస్థలు, నటిస్తున్న, నిర్మిస్తున్న చిత్రాలతోనే తీరిక లేకుండా ఉంది. ప్రత్యేకంగా ఈ బాధ్యతలు ఎందుకు అనుకున్నాను. సుబ్బిరామి రెడ్డి గారి ద్వారా దైవుడే ఈ పదవికి పిలిపించాడని అనిపించింది. సన్నిధానంలోని పద్దెనిమిది దేవాలయాల దేవుళ్ల ఆశీస్సులతో మంచి కార్యక్రమాలు చేపడతానని ఆశిస్తున్నాను. దేవాలయాన్ని పరిశుభ్రంగా ఉంచడం మనందరి ప్రథమ కర్తవ్యం. బ్రాహ్మణోత్తములకు నా హృదయ పూర్వక నమస్కారాలు. ఎవరి పని వాళ్లు చేసుకుంటే అన్ని సక్రమంగా జరుగుతాయి. మేము ఇదే పద్ధతిలో విద్యా సంస్థలు నడుపుతున్నాము. దేవుడి డబ్బు పైసా తీసుకోకుండా...అవసరమైతే నా సొంత ఖర్చులతో ఆలయంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాను. అన్నారు.



విమర్శలు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నాం

- జి నాగేశ్వర రెడ్డి

హాస్య చిత్రాలను రూపొందించి విజయాలు అందుకున్నారు దర్శకులు జి నాగేశ్వర రెడ్డి. ఇదే తరహా కథతో ఆయన దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం ఆచారి అమెరికా యాత్ర. మంచు విష్ణు, ప్రగ్యా జైశ్వాల్ జంటగా నటించారు. బ్రహ్మానందం మరో కీలక పాత్రను పోషించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఆచారి అమెరికా యాత్ర త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు జి నాగేశ్వర రెడ్డి చిత్ర విశేషాలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ...మంచు విష్ణు, నేను కలిసి చేసిన గత రెండు చిత్రాలు దేనికైనా రెడీ, ఈడో రకం ఆడో రకం మంచి విజయాలు సాధించాయి. మాది హిట్ కాంబినేషన్‌గా పేరు తెచ్చుకుంది. ఆచారి అమెరికా యాత్ర కథను మూడేళ్ల కిందట మల్లాది గారు రాశారు. ఆ కథను పీడీ ప్రసాద్, నిర్మాత ఎంఎల్ కుమార్ చౌదరికి చెప్పారు. నేను మంచు విష్ణుతో మరో కథతో సినిమా చేద్దామనుకున్నాను. అయితే నిర్మాత ఈ కథ వినండి బాగుందని చెప్పారు. కథ విన్న నాకు నచ్చింది. ఇందులో హాస్యంతో పాటు అన్ని రకాల భావోద్వేగాలు ఉన్నాయనిపించింది. ఓ అమ్మాయిని కాపాడేందుకు బ్రాహ్మణ కుటుంబమంతా ప్రయత్నిస్తుంది. ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొని ఆ యువతిని వీళ్లంతా ఎలా కాపాడారన్నది కథాంశం. బ్రాహ్మణుల ఇతివృత్తంతో చేసిన గత చిత్రాలు కొన్ని వివాదాలకు కారణమయ్యాయి. మేము దేనికైనా రెడీ చేయకముందే...చాలా చిత్రాల్లో బ్రాహ్మణులను చులకన చేస్తూ చిత్రాలు రూపొందాయి. కానీ మా సినిమాకే ఎక్కువ వివాదాలు ఎదురయ్యాయి. ఈ సారి అలాంటి విమర్శలు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. సినిమా చూశాక బ్రాహ్మణులు గొప్ప అనుభూతి పొందుతారు. పతాక సన్నివేశాల్లో బ్రాహ్మణుల ఖ్యాతిని చెబుతూ సంభాషణలు ఉంటాయి. మంచు విష్ణుతో త్వరలోనే మరో సినిమా చేయబోతున్నాను. అన్ని చిత్రాల్లో హాస్యం ఉంటుంది. చిరంజీవి లాంటి మెగాస్టార్ కూడా కామెడీ చిత్రాలు చేశారు. హాస్య చిత్రాల దర్శకులు స్టార్ హీరోలతో సినిమాలు చేయలేరు అనేది సరికాదు.అన్నారు.



భావన ప్రేమ వివాహం

నటి భావన ప్రేమ, పెళ్లి గురించి కొద్ది రోజులుగా జరుగుతున్న ప్రచారానికి పులిస్టాప్ పడింది. ప్రియుడు నవీన్‌తో భావన పెళ్లి జరిగింది. సోమవారం కేరళలోని త్రిసూర్‌లో జంట ఒక్కటయింది.

మళయాలరంగంలో కెరీర్ ప్రారంభించిన భావన ఆ తర్వాత దక్షిణాది భాషల్లో నటించింది. తెలుగులో మహాత్మ, ఒంటరి చిత్రాల్లో నటించింది. తన కెరీర్‌లో సుమారు 70 చిత్రాల్లో నటించిన భావన కన్నడ సినిమాలో నటిస్తున్నపుడు నవీన్ పరిచయం అయ్యారు. ఆయన నిర్మాత కూడా. అప్పుడే వీరిద్దరు ప్రేమలో పడ్డారు. కుటుంబపెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్నారు.



నవీన్, భావన

తొలి అంతరిక్ష చిత్రం

జయం రవి, నివేదా పేతురాజ్ జంటగా నటించిన తమిళ చిత్రం టిక్ టిక్ టిక్. దర్శకుడు శక్తి సౌందర్ రాజన్ ఈ చిత్రాన్ని రూపొందించారు. భారతీయ వెండితెరపై తొలి అంతరిక్ష చిత్రంగా ఈ సినిమా చరిత్రకెక్కింది. టిక్ టిక్ టిక్ సినిమాను శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వరా ఫిలింస్ తెలుగులోకి తీసుకొస్తోంది. చదలవాడ పద్మావతి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న టిక్ టిక్ టిక్ చిత్ర విశేషాలను యూనిట్ తెలిపారు. నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ...ఇటీవల విదేశాలకు వెళ్లినప్పుడు అక్కడి వాళ్లు బాహుబలి సినిమా చూశామని చెప్పారు. మన సినిమా ఖండాలు దాటిందనే సంతోషం కలిగింది. ఇప్పటికీ హాలీవుడ్ చిత్రాలంటే మనకు ఎంతో ఇష్టం. ఆ స్థాయిలో రూపొందించిన చిత్రమే టిక్ టిక్ టిక్. ఇంతకు ముందు మేము విడుదల చేసిన బిచ్చగాడులో ఉన్న భావోద్వేగాలు ఈ చిత్రంలోనూ ఉంటాయి. ఆ సెంటిమెంట్ నచ్చే సినిమాను తీసుకున్నాం. అన్నారు. జయం రవి మాట్లాడుతూ... ఈ నిర్మాణ సంస్థ సినిమాలకు బాగా ప్రచారం చేస్తారని తెలిసి వాళ్లను అభినందించేందుకు ఇక్కడికి వచ్చాను. మన దేశంలో తొలి అంతరిక్ష చిత్రమిది. ఈ తరహా చిత్రాలు రూపొందించడం సులువు కాదు. అంతరిక్ష చిత్రాల్లో ప్రతి సన్నివేశానికి ఎంతో శ్రమించాలి. గతంలో వచ్చిన స్పేస్ చిత్రాలకు భిన్నంగా అంతకంటే బాగా రూపొందించాలి. మా అదృష్టం కొద్దీ గొప్ప నిర్మాణ సంస్థ దొరికింది. విభిన్నమైన సినిమాలు చేయాలంటే...ప్రతికూల అంశాలను సానుకూలంగా తీసుకోవాలి. నేనదే చేస్తున్నా. అన్నారు.

ఈ కార్యక్రమంలో చదలవాడ లక్ష్మణ్, దర్శకులు అజయ్, అల్లాణి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



జయం రవి

చెప్పుకోవడం మంచిదే

ఉన్నది చెప్పుకుంటే గొప్పంటారు గానీ...చెప్పుకుంటేనే కదా అందిరికీ తెలిసేది. నేను అద్భుతాలు చేయగలను అని మనసులో అనుకుంటే...అది అక్కడే ఆగిపోతుంది. ఎవరి గురించి వాళ్లు చెప్పుకోవడం అనేది రాజకీయాల తర్వాత ఎక్కువగా చిత్ర పరిశ్రమకు పనికొస్తుంది. ఇదే కావాల్సిన ప్రచారాన్ని కల్పిస్తుంటుంది. ఇందుకు ప్రస్తుతం సామాజిక మాధ్యమాలు బాగా పనికొస్తున్నాయి. సోషల్ మీడియాలో నిత్యం తన ఫొటోలు పెట్టడం పని లేని వాళ్లు చేసే పని అనుకుంటారు గానీ...ఈ పోస్టులు బెంగళూరు భామ పూజా హెగ్డేకు ఓ సినిమానే తెచ్చి పెట్టాయి. ట్విట్టర్‌లో ఎప్పుడూ కనిపించే పూజా..తన ఫిట్‌నెస్‌కు సంబంధించిన పోస్టులు పెడుతుంటుంది. వీటిలో ఆమె అసాధారణ ఫోజులూ ఉంటాయి. శారీరకంగా ధృడంగా ఉండే పూజా...పలు రకాల పోరాట విద్యలు నేర్చుకుంది. వీటిలో ఆధునిక, సంప్రదాయ విద్యలున్నాయి. ఇక వీటి గురించి తెలుసుకున్న బాలీవుడ్ దర్శకులు మిలప్ జవేరి రూపొందిస్తున్న తాజా చిత్రంలో ఎంపికచేశారు. ఇందులో జాన్ అబ్రహాం ప్రధాన పాత్ర పోషిస్తుండగా...సమానమైన పాత్రలోనే పూజా కనిపించనుంది. ఈ చిత్రంలో నాయిక పోరాట సన్నివేశాలు చేస్తుంటుంది. వీటిలో మెప్పించాలంటే ఫిట్‌నెస్ ఉండాలని భావించిన దర్శకులు పూజాను తీసుకున్నారు. దీంతో తను క్రమం తప్పకుండా సామాజిక మాధ్యమాల్లో ఉండటం వృథాగా పోలేదని సంతోషపడుతోందీ భామ. ప్రస్తుతం బెల్లంకొండ శ్రీనివాస్‌తో సాక్ష్యం అనే చిత్రంలో నటిస్తున్న పూజా, రంగస్థలంలో ప్రత్యేక గీతంలో కనిపించనుంది. బాలీవుడ్‌లో రేస్ 3 సినిమాలో నటిస్తోంది.